ఈనాడు
హైదరాబాద్
HMDA
బుధవారం అక్టోబరు 9, 2024

65 శాతం పెరిగిన గృహజ్యోతి లబ్ధిదారులు

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్‌లో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య పథకం మార్చి నెలతో పోలిస్తే సెప్టెంబరు నాటికి 65.22 శాతం పెరిగింది. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు కలిపి 10.09 లక్షలకు చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రారంభ నెలలో 6.11 లక్షల మందికి మాత్రమే సున్నా బిల్లులు ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రంగారెడ్డి జోన్‌కు వర్తింపజేయడం, తప్పొప్పులను సవరించడంతో సంఖ్య పెరిగింది. మార్చిలో మెట్రో జోన్‌లో 2,11,524 మందికి సున్నా బిల్లులు జారీ చేయగా.. సెప్టెంబరుకు 2,60,941కి పెరిగారు. మేడ్చల్ పరిధిలో మార్చిలో 3,90,895 మంది ఉండగా.. ఆ సంఖ్య 4,44,292కి చేరింది. రంగారెడ్డి పరిధిలో మార్చిలో 8888 మందికే సున్నా బిల్లులు ఇచ్చారు. తాజాగా 3,04,744 మందికి జారీ చేశారు.



కలకత్తా కాళి.. సంబరాల బెంగాలీ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని బెంగాలీ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మండపంలో కలకత్తా కాళీ మాత ఆకృతిలో ప్రతిష్ఠించిన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

1971-72లో చెరువులు ఎలా ఉండేవి?



సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో రంగనాథ్

ఈనాడు, హైదరాబాద్: సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) 1971-72లో చేపట్టిన సర్వే ప్రకారం.. నగరంలోని జలవనరులు ఎంతమేర విస్తరించి ఉన్నాయో తెలుసుకునేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం హబ్సిగూడలోని ఎస్ఓఐ కార్యాలయానికి వెళ్లారు. డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాటిల్‌తో కలిసి గొలుసుకట్టు చెరువుల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నగరంలోని పరిస్థితులను, పాతకాలం పటాలతో సరిపోల్చి ఆక్రమణలు, జలవనరుల హద్దులపై అధికారులు హైడ్రా కమిషనర్‌కు వివరాలు అందించారు.

అవస్థ తీరేలా.. మురుగు వ్యవస్థ

రూ.17వేల కోట్లతో.. 7వేల కి.మీ. పొడవునా డ్రైనేజీ నిర్మాణం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహానగరంలో మురుగునీటి వ్యవస్థను గాడిన పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో 7,200 కిలోమీటర్ల పొడవునా కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రెండు రోజుల కిందట కేంద్రంలోని పెద్దలను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టును అమృత్‌లో భాగం చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుపై పరిశీలన చేస్తోంది. దశలవారీగా ఈ ప్రాజెక్టును మొదలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించారు.



నిధుల కోసం కేంద్రానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం



నగర మురుగు నీటి బృహత్ ప్రణాళిక మ్యాప్

సమగ్ర నివేదిక..

ప్రస్తుతం మహానగరంలో 7వేల కిలోమీటర్ల పొడవున డ్రైనేజీ లైను ఉంది. వీటిలో అధిక భాగం 50 ఏళ్ల కిందట నిర్మించివే. దీంతో చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్లపై పొంగుతోంది. కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడానికి గత ప్రభుత్వం నివేదికను రూపొందించినా నిధులు లేకపోవడంతో ఆ ప్రాజెక్టు మొదలుకాలేదు. ప్రస్తుతం పాతబస్తీలో రూ.200 కోట్లతో కొత్త డ్రైనేజీల నిర్మాణం జరుగుతోంది. మిగిలిన చోట్ల అలానే వదిలేశారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముంబయికి చెందిన సాహె కన్సల్టెంట్ సంస్థకు డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉండాలన్న దానిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. సదరు సంస్థ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాజధానిలో మురుగు రోడ్లపైకి రాకుండా ఉండాలంటే బల్దియా పరిధిలో 2,600 కిలోమీటర్ల మేర కొత్తగా డ్రైనేజీ నిర్మించాలని నివేదికలో పేర్కొంది. ఔటర్ వరకు మరో 4,600 కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీతోపాటు మురుగు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఇందుకు రూ.17,212 కోట్ల వ్యయం అవుతుందని అంచనా రూపొందించింది. కేంద్రం నుంచి కొంతమేర నిధులు అందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అవసరమైతే ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

హాట్‌స్పాట్లలో 108 వాహనాల మోహరింపు

తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు ఎంపిక



ఈనాడు, హైదరాబాద్: కొంతకాలంగా 108 వాహనాల రాకపోకలపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో సరికొత్త ప్రణాళికతో ముందుకొచ్చింది. హాట్‌స్పాట్‌లను ఎంపిక చేసి ఆ ప్రాంతాల్లో వాహనాలు మోహరించడం వల్ల తక్కువ సమయంలో చేరుకొనే విధంగా యాజమాన్యం ప్రణాళికను రూపొందించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 84 వరకు 108 వాహనాలు తిరుగుతున్నాయి. సేవల్లో నాణ్యత పెరిగేందుకు తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే కూడళ్లు, జాతీయ రహదారులు, సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉండే కాలనీలు తదితర వాటిని హాట్‌స్పాట్లుగా విభజించి అక్కడ 108 వాహనాలను మోహరించారు. ఇలా ప్రతి నెలా వచ్చే డేటాను విశ్లేషించి ఆ సమాచారం ఆధారంగా హాట్‌స్పాట్‌లో కూడా మార్పులు చేర్పులు చేయడంతో 108 సేవల్లో నాణ్యత పెరిగింది.

గ్రేటర్‌లో 108 సేవలు ఇలా..

వాహనాల సంఖ్య	జిల్లా	స్పందించే సమయం
36	హైదరాబాద్	9.23 నిమిషాలు
26	రంగారెడ్డి	13.31 నిమిషాలు
22	మేడ్చల్-మల్కాజిగిరి	11.25 నిమిషాలు

వాహనాల సంఖ్య
స్పందించే సమయం

ముందు గుడిసెలు వేద్దాం.. తర్వాత ఆక్రమిద్దాం

పుప్పాలగూడ, నెక్నాంపూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా

ఈనాడు, హైదరాబాద్, నార్సింగి, న్యూస్‌టుడే: ఐటీ కారిడార్‌కు సమీపంలోని పుప్పాలగూడ, నెక్నాంపూర్‌లోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు భారీ ప్రణాళికను రూపొందించారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటిల్లో పేదల గుడిసెలు ఏర్పాటు చేసి కొద్దినెలల తర్వాత వాటికి పత్రాలు సృష్టించి సొంతం చేసుకోవాలన్నదే వారి ప్రణాళిక. రెవెన్యూ అధికారులు మూసీ నిర్వాసితుల తరలింపు ప్రక్రియలో తలమునకలై ఉండగా.. ఇదే అదునుగా భావించి నెక్నాంపూర్‌లో 10 గుడిసెలు, పుప్పాలగూడలో 20 గుడిసెలను ఐదురోజుల క్రితం వేశారు. సమాచారం తెలుసుకున్న గండిపేట్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో వాటిని తొలగించారు. అక్కడున్నవారిని ప్రశ్నించగా.. పనిచేసుకునేందుకు వస్తే గుడిసెలు వేసుకోమన్నారని చెప్పారు. దీంతో గుడిసెలు ఎవరు వేయించారన్న అంశంపై రెవెన్యూ అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.



నెక్నాంపూర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

తాత్కాలిక నిర్మాణాలు.. కోర్టులో పిటిషన్లు.. తొలుత గుడిసెలు వేయించి వాటిని కూలీలకు ఇవ్వడం.. పదిరోజుల తర్వాత వారిపేర్లతో కోర్టులో పిటిషన్లు వేయడం.. ఎంతోకాలంగా అక్కడే ఉంటున్నట్టు ఆధారాలు సృష్టించడం వంటివి చేస్తున్నారు. కోర్టుల్లో వాయిదాలు కొనసాగుతున్న కొద్దీ గుడిసెల స్థానంలో రేకుల షెడ్లు, పక్కా ఇళ్లను నిర్మిస్తున్నారు. వాటిని జీవో 58 కింద క్రమబద్ధీకరించుకుంటున్నారు. అనంతరం గుడిసెల్లో ఉంటున్నవారిని ఖాళీచేయించి వాటి స్థానాల్లో పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటిల్లో కొన్నింటిని అధికారులు తొలగిస్తున్నా..తాఖీదులు ఇస్తున్నా కొద్దిరోజులయ్యాక మళ్లీ ప్రభుత్వ స్థలాల్లో ప్రహరీలు నిర్మిస్తున్నారు.

చెత్త వేస్తే పక్కాగా చిక్కేస్తారు

సెన్సర్ల సాయంతో వ్యక్తులను గుర్తిస్తోన్న సాఫ్ట్‌వేర్

ఈనాడు, హైదరాబాద్: రాత్రవగానే రోడ్డుపక్కన చెత్త కుప్పలుగా పడుతుంది. చూసేవారు, అడిగేవారు ఉండరనే కారణంతో.. ఇళ్లు, హోటళ్లలోని వ్యర్థాలను రోడ్లపై పడేస్తున్నారు. అలాంటి వారిని క్షణాల్లో గుర్తించే నిఘా వ్యవస్థను ఉప్పల్ సర్కిల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మాదిరి కాకుండా ఉపకమిషనర్ జి.ఆంజనేయులు పక్కాగా అమలు చేస్తున్నారు. మనిషి లేదా యంత్రం కదలికలను గుర్తించి, ఆ దృశ్యాలను ప్రత్యేక ఫోల్డర్‌లో భద్రపరిచే సెన్సర్లను సీసీ కెమెరాలకు అమర్చారు. దాంతో చెత్తకుప్పలు పడిన సమయం ఆధారంగా ఉల్లంఘనులను గుర్తించగలుగుతున్నారు. జరిమానా వేయడంతోపాటు కారణాలు విశ్లేషించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఈ విధానాన్ని నగరవ్యాప్తంగా అమలు చేయడంపై బల్దియా దృష్టిపెట్టింది.



చెత్తవేస్తున్న స్థానికుడు.. సీసీ కెమెరాలో దృశ్యం

మార్పు తీసుకొస్తున్నాం.. ఉప్పల్ సర్కిల్‌లో దాదాపు 100కుపైగా చెత్తకుప్పలున్నాయి. వాటిని సున్నా చేయడమే లక్ష్యంగా మూణ్నెళ్ల క్రితం 23 సీసీ కెమెరాలను అమర్చారు. కేవలం వీడియో రికార్డే కాకుండా మనిషి, వాహనం కదలికలు గుర్తించే కెమెరాలు అమర్చారు. ఎవరైనా చెత్త వేయడానికి వెళ్తుంటే వెంటనే వీడియో రికార్డింగ్ మొదలవుతుంది. ఆయా వీడియోలను ఆ ప్రాంతం పర్యవేక్షకులు, బాధ్యులైన అధికారికి పంపిస్తారు. చెత్త వేసిన వ్యక్తిని తెలుసుకుని, వారింటికి సిబ్బందితోపాటు స్వచ్ఛ ఆటో డ్రైవరును తీసుకెళ్లి.. లోపాలను అక్కడికక్కడే సరిదిద్దుతున్నట్టు ఉపకమిషనర్ 'ఈనాడు'కు తెలిపారు.

రూ.1,20,000 వసూలు..

ఇంట్లోని చెత్తను వీధిలో పడేస్తోన్న 310 మందిని గుర్తించామని, వారికి రూ.500, రూ.1000 చొప్పున రూ.1,20,000 వరకు జరిమానా విధించామని అధికారులు తెలిపారు. జరిమానా వేయడమేగాక.. అందుకు కారణమవుతోన్న సిబ్బంది, స్వచ్ఛ ఆటోలపైనా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే హైదరాబాద్ పరిశుభ్రంగా ఉంటుందని డీసీ వివరించారు.

దోమల నివారణకు కొత్త మందు

- కోల్డ్ ఫాగింగ్‌ను పరిశీలించిన మేయర్, కమిషనర్



అధికారులతో చర్చిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు, హైదరాబాద్: దోమకాటుతో ఏటా వేలాది మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. కొందరు మృతిచెందుతున్నారు. ప్రస్తుతం అమలు చేస్తోన్న దోమల నివారణ చర్యలు పూర్తిస్థాయిలో ఫలితం ఇవ్వకపోవడంతోనే దుస్థితి నెలకొంది. పరిస్థితులను చక్కదిద్దడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆధునిక సాంకేతికతతో పనిచేసే కోల్డ్ ఫాగింగ్ యంత్రాల వినియోగంపై దృష్టిపెట్టారు. అందులో భాగంగా నాలుగు ప్రాంతాల్లో ఆ పద్ధతిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కోల్డ్ ఫాగింగ్ యంత్రాల పనితీరును నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి కమిషనర్ ఆమ్రపాలి పరిశీలించారు. హుస్సేన్‌సాగర్ నాలా పక్కనున్న పార్కులో ఫాగింగ్ చేపట్టి, దోమలు ఏమేర మృతిచెందాయో పరీక్షించి చూశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విభాగం అదనపు కమిషనర్ పంకజ, చీఫ్ ఎంటమాలజిస్టు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. మొదటిసారి దక్షిణ భారతదేశంలో ఈ విధానాన్ని జీహెచ్ఎంసీ పరీక్షిస్తోందని, ఇప్పటికే గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతంగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.





నగరంలో క్రికెట్.. చేతిలో టికెట్

భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య ఈనెల 12న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి సికింద్రాబాద్ జింఖానా హెచ్‌సీఏ గ్రౌండ్‌లో టికెట్ల అమ్మకాలు ప్రారంభించారు. అభిమానులు తరలివచ్చి టికెట్లు, టీషర్టులు కొనుగోలు చేస్తున్నారు.

కొందరు ఉపాధ్యాయుల నియామకాల నిలిపివేత



ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించేందుకు ఎంపికైన వారిలో కొందరి నియామకాలను హైదరాబాద్ జిల్లా అధికారులు నిలిపివేశారు. డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీరు.. సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఎల్బీ స్టేడియంలో బుధవారం జరుగనున్న నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో వీరి పేర్లను చేర్చలేదు. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం, విద్యాశాఖ కార్యాలయంలో పొరుగుసేవల విభాగంలో విధులు నిర్వహిస్తున్న 8 మంది బీఈడీ అర్హత ధ్రువపత్రాలను సమర్పించారు. పొరుగుసేవల పద్ధతిలో పనిచేస్తున్నప్పుడు బీఈడీ క్లాసులకు ఎలా హాజరయ్యారన్న సందేహం రావడంతో నియామక పత్రాలను వారికి అందించడం లేదు. బీఈడీ చదివేందుకు విద్యాశాఖ అధికారులు అనుమతిచ్చారా..లేదా?, వారు చదువుకుంటున్న సమయంలో సెలవులు తీసుకున్నారా.. లేదా? అని పరిశీలించనున్నారు. డీఎస్సీ అధికారులు కొన్ని సందేహాలు వ్యక్తంచేయడంతో నియామక పత్రాలు నిలిపివేశామని, 878 మందిని ఎంపిక చేయగా, వీరి పేర్లను మినహాయిస్తున్నామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

254 మంది అభ్యర్థుల చిరునామాల్లేవ్..

హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ ఉపాధ్యాయుల పోస్టులకు 878 మంది ఎంపికయ్యారు. వీరిలో 254 మంది అభ్యర్థుల చిరునామాలు, వివరాల్లేవు. వీరు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. నియామక పత్రాలు తీసుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి రావాలంటూ అధికారులు ఫోన్లు చేస్తుంటే.. ఆయా నంబర్లు పనిచేయడం లేదు. దరఖాస్తుల్లో వారు పేర్కొన్న చిరునామాలకు సిబ్బంది వెళ్లగా అక్కడ లేరని తెలుసుకున్నారు. ఉర్దూ మాధ్యమం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడంతో ఆయా పోస్టుల నియామకాన్ని కూడా పెండింగ్‌లో ఉంచారు.

ముఖ్యమంత్రి ఇంటి చుట్టూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- హార్ట్‌కప్ వద్ద ఎడమవైపు మూసేసి.. మరో మూడు దారులు తెరిచారు



సూచిక బోర్డుల వద్ద విశ్వప్రసాద్, రాహుల్ హెగ్డే, హరిప్రసాద్, ప్రవీణ్‌కుమార్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వాహనదారుల ఇబ్బందులపై ట్రాఫిక్ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. సీఎం ఇంటి చుట్టూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌లు సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం.45లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ నం.45లోని హార్ట్‌కప్ వద్ద ఎడమ దారిని మూసివేశారు. వాహనదారులు బ్రిడ్జి దిగగానే మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తిరిగి అక్కడి నుంచి సీఎం నివాస దారి మీదుగా రోడ్ నం.36లోని రంగోలికి చేరుకోవచ్చు. సీఎం ఇంటి మీదుగా నేరుగా ముందుకు వెళ్లి పెద్దమ్మగుడి మార్గంలోకి అక్కడి నుంచి రోడ్ నం.36కు వెళ్లొచ్చు. మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తీసుకొని నేరుగా న్యూయార్క్ అకాడమీ మీదుగా రోడ్ నం.36లోని క్రోమాకు వెళ్లేలా చేశారు. వాహనదారులకు అర్థమయ్యేందుకు బోర్డులు, బ్యానర్లను ఏర్పాటు చేశారు.

ఆస్తి కోసం అడ్డు తొలగించాలనుకుంది

నకిలీ బాబాతో మహిళ బేరం



మహమ్మద్ కలీం

కేశవగిరి, న్యూస్‌టుడే: ఆస్తి కోసం.. మరిది, అత్త, ఆడపడుచులను అడ్డుతొలగించాలని పన్నాగం పన్నింది ఓ మహిళ. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పుర పరిధి హసన్‌నగర్‌కు చెందిన నకిలీ బాబా మహమ్మద్ కలీం అలియాస్ ఖలీ(48).. "చేతబడి చేశా.. మరిదితో పాటు అత్త, ఆడపడుచు 48 గంటల్లో చనిపోతారంటూ.. చాంద్రాయణగుట్ట అల్-జుబైల్‌కాలనీకి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ మాలిక్‌కు ఫోనులో బెదిరించడం.. వాట్సాప్ వీడియో కాల్ చేసి వారి ఫొటోలు, గోధుమ పిండి బొమ్మలతో చేతబడి చేసిన దృశ్యాలను చూపాడు." దీంతో మాలిక్ బండ్లగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వృత్తిరీత్యా వాల్ పెయింటర్ అయిన కలీం పలు కేసుల్లో నిందితుడు. 2008 నుంచి బహదూర్‌పుర, శంషాబాద్, తాండూరు టౌన్, కాలాపత్తర్ ఠాణాల్లో ఐదు హత్యాయత్నం, మోసం కేసులున్నాయి. ఓ కేసులో శిక్ష పడగా జైలుకెళ్లాడు. 2016లో జైలు నుంచి విడుదలయ్యాడు. 2022 నుంచి నకిలీబాబా అవతారం ఎత్తాడు. పాతబస్తీ అల్-జుబైల్‌కాలనీకి చెందిన నాజియా ఫిర్‌దౌస్ తనను ఆశ్రయించిందని.. అత్త అష్రఫ్‌బేగం, ఆడపడుచు జరీనాబేగం, మరిది మహ్మద్ ఇర్ఫాన్ మాలిక్‌లను మంత్రాలతో అడ్డుతొలగించాలని కోరిందని కలీం వెల్లడించాడు. ఆస్తి కోసం ఆమె ఇలా చేసిందన్నాడు. నిందితుడి ఇంటి నుంచి పోలీసులు ముగ్గురి ఫొటోలు, చరవాణి, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

'నన్ను చంపేందుకే కుట్రపన్నారు'

నాజియా ఫిర్‌దౌస్ మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త ఫిర్‌దౌస్ గుండెపోటుతో చనిపోయారని.. ఇద్దరు కొడుకులు, కూతురున్నారన్నారు. తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో అత్త, మరిది.. బాబా కలీం వద్దకు తీసుకెళ్లారని, ఆయన వైద్యంతో బాగవుతుందని నమ్మించారన్నారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో బాబా కలీం తనకు నిజం చెప్పాడని.. అత్త, ఆడపడుచు, మరిది కలిసి తనతోపాటు ముగ్గురు పిల్లలను మంత్రాలతో అడ్డుతొలగించాలని కోరారని చెప్పాడన్నారు. ఈ విషయాన్ని బాబా మరిదికి ఫోన్ చేసి తనకు స్పీకర్‌లో వినిపించాడని నాజియా వెల్లడించింది. తనకు ఆస్తి ఇవ్వకూడదనే ఇదంతా చేశారని ఆమె ఆరోపించింది.

రూ.10వేలు ఇస్తే.. డిగ్రీ చదివినట్టే!

నకిలీ విద్యార్హత పత్రాలు తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్



నకిలీ పత్రాలతో నిందితులు

ఈనాడు, హైదరాబాద్ : నకిలీ విద్యార్హత పత్రాలను తయారుచేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. మల్కాజగిరి నివాసి మహ్మద్ మహఫూజ్ ఇక్బాల్(41) అంబర్‌పేట్‌లో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షేక్ ఇలియాస్ (34) ప్రైవేటు ఉద్యోగి. ఇక్బాల్ తాను కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్టు ఇలియాస్‌ను నమ్మించి.. అదనపు ఆదాయం కోసం అడ్డదారి ఎంచుకున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఒరిజినల్ ధ్రువపత్రాలను సేకరించేవారు. ఫొటోషాప్ ద్వారా వాటిపై మార్కులు, పేర్లు మార్చి నకిలీ విద్యార్హత పత్రాలుగా మార్చేవారు. చదువు మధ్యలో ఆపేసిన యువకులు, ప్రైవేటు ఉద్యోగానికి ప్రయత్నిస్తున్న వారికి నకిలీపత్రాలు విక్రయించటం ప్రారంభించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌కు రూ2-3వేలు, డిగ్రీ పట్టాకు రూ.10వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కొనేవారు తగ్గడంతో 6 నెలల క్రితం పత్రాల తయారీ నిలిపివేశారు. తిరిగి నెల క్రితం నలుగురు వ్యక్తులకు పదోతరగతి నకిలీ ధ్రువపత్రాలను విక్రయించారు. సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు నర్సింలు, ఆంజనేయులు, అంబర్‌పేట్ పోలీసులతో కలసి జిరాక్స్ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. పలు రాష్ట్రాల బోర్డులు, విద్యాసంస్థలకు చెందిన 84 నకిలీ ధువపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద 37 మంది వీటిని కొనుగోలు చేసి ప్రైవేటు ఉద్యోగాలు సంపాదించినట్టు గుర్తించారు.

విస్తరణకు సానుకూలం.. పరిహారంపైనే అభ్యంతరం

- పాతబస్తీ మెట్రో మార్గంలో ఆస్తుల సేకరణపై కొనసాగుతున్న ప్రక్రియ



ఈనాడు, హైదరాబాద్:పాతబస్తీ మెట్రోరైలు మార్గంలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. 500 ఆస్తులకు సంబంధించి ఇప్పటికే రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్లు జారీ చేశారు. మొత్తం 1200 వరకు ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆస్తులున్న బాధితుల్లో కొందరు అభ్యంతరాలు చెబుతుండగా.. ఎక్కువ మంది సానుకూలంగా ఉన్నారని.. త్వరితగతినే ప్రక్రియను పూర్తిచేస్తామని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు.

రూ.60వేల వరకు.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో సేకరించాల్సిన ఆస్తుల యాజమానులు కొందరు చదరపు గజానికి రూ.2 లక్షల వరకు పరిహారం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ధర చదరపు గజం ధర రూ.26వేలుగా ఉంది. భూసేకరణ చట్టం ప్రకారం నగరాల్లో రెండింతల పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం రూ.52వేలు అవుతుంది. నిర్మాణానికి, ఇతర ఖర్చులు లెక్కకట్టి రూ.60వేల వరకు పరిహారం ఇచ్చేందుకు మెట్రో సిద్ధమైంది. పాత భవనాలు కావడంతో సానుకూలంగా ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు. పరిహారం విషయంలో అభ్యంతరాలు ఉండటంతో మెట్రో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు నిర్వాసితులతో సమావేశాలు జరిపినట్లు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ అధికారులు చెప్పారు.

100-120 అడుగుల మేర..

- జీహెచ్ఎంసీ మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పు ఉండేలా విస్తరణ చేపట్టనున్నారు.
- స్టేషన్లు నిర్మించే చోట 120 అడుగుల మేర విస్తరిస్తారు.
- దారుల్‌షిఫా నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రహదారి 50 నుంచి 60 అడుగులు మాత్రమే ఉంది. ఇక్కడ ఒక్కోవైపు 20 నుంచి 25 అడుగుల మేర ఆస్తులను సేకరించాల్సి ఉంది.
- శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 80 అడుగుల వెడల్పు రహదారి ఉంది. ఇక్కడ ఇరువైపుల పది అడుగుల మేర విస్తరించాలి. తక్కువ ప్రభావం ఉండటంతో మొదట ఇక్కడి నుంచి సేకరణ ప్రక్రియ చేపట్టారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: టమాటా 63, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 65, క్యాప్సికం 70, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 22, దోస 28, బీట్‌రూట్ 25, ఉల్లి 45, ఆలు 37, చామ 37, మొరంగడ్డ 28, కంద 55, గోబీ 23, సొర 19, పొట్లకాయ 18, అరటి 9, మునగ 5, మామిడి 115, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45, అల్లం(తెల్లది) 160, వెల్లుల్లి 320.

అల్వాల్: (మంగళవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 63, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 47, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 90, గోరుచిక్కుడు 35, చిక్కుడు 55, దోస 28, బీర 45, కాకర 38, చామగడ్డ 37, కీర 40, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, కందగడ్డ 55.

ఆలయంలో ఆకట్టుకున్న వేణుగానం



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో మంగళవారం ప్రముఖ సంగీత కళాకారిణి డా. జయప్రద రామమూర్తి బృందం నిర్వహించిన వేణుగాన సంగీత లహరి భక్తులను ఆకట్టుకుంది. ఎంతో వినసొంపుగా గీతాలను వేణువుపై చక్కగా ఆలపించారు. అనంతరం ఆమెను దేవస్థానం ఈఓ బి.కృష్ణ, సూపరింటెండెంట్ హైమావతి సత్కరించి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు



సీతాఫల్‌మండి: బతుకమ్మ ఆడుతున్న కిషన్‌రెడ్డి సతీమణి కావ్య రెడ్డి

సనత్‌నగర్, సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో బతుకమ్మ సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కాలనీలోని 3వ వీధిలో ఐకాన్ అపార్ట్‌మెంట్స్ వద్ద వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలోని వివిధ అపార్ట్‌మెంట్లకు చెందిన మహిళలు ఆడి పాడారు. జెక్ కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి ఎస్.అన్నపూర్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు. * రవీందర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు స్థానిక సామాజిక భవనం మైదానంలో నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.విజయ్‌సింగ్, ప్రధానకార్యదర్శి వెంకటరమణా రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



జెక్‌కాలనీలో..



రవీందర్‌నగర్‌లో..

బకాయిలు రాక భారంగా..

ఇటు టీపీటీ.. అటు సర్వీస్ ఛార్జీలు సకాలంలో అందక ఇబ్బందులు

కార్ఖానా, న్యూస్‌టుడే: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక పరిస్థితి. దేశంలో ఉన్న కంటోన్మెంట్లలో అతిపెద్దది. కానీ బోర్డుకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి టీపీటీ బకాయిలు, అటు కేంద్రం నుంచి సర్వీస్ ఛార్జీలు కోట్ల రూపాయల మేరకు పేరుకుపోతున్నాయి. బకాయిలు విడుదల చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



కంటోన్మెంట్ బోర్డు

కేంద్రం నుంచి 700 కోట్లకు పైగానే..

రాష్ట్రం నుంచి అడపాదడపా బకాయిలు విడుదలవుతున్నప్పటికి కేంద్రం నుంచి మాత్రం మొండిచేయి ఎదురవుతోంది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపీలు సర్వీస్ ఛార్జీలు విడుదల చేయిస్తామని చెబుతూ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపీ డిఫెన్స్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతుంటారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బండి సంజయ్ దాదాపు 100 కోట్లు సర్వీస్ ఛార్జీలు విడుదల చేయిస్తామని కంటోన్మెంట్‌లో పర్యటించిన సందర్భంలో పలు మార్లు చెప్పినప్పటికీ అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా సర్వీస్ ఛార్జీలు విడుదల కాకపోవడంతో ఆ ప్రభావం ఇక్కడి అభివృద్ధి పనులపై పడుతోంది.

రాష్ట్రం నుంచి 40 కోట్ల టీపీటీ బకాయిలు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జనవరిలో దాదాపు 40కోట్లకు పైగా టీపీటీ బకాయిలను విడుదల చేసింది. మరో నలభై కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. టీపీటీతో పాటు కేంద్రం సర్వీస్ ఛార్జీలు సైతం క్రమం తప్పకుండా చెల్లిస్తే బోర్డు ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడుతుందని సీఈవో మధుకర్ నాయక్ పేర్కొన్నారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

న్యూస్‌టుడే, కార్ఖానా, సంజీవరెడ్డినగర్, రెజిమెంటల్‌బజార్

? తిరుమలగిరి పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న హనుమాన్ దేవాలయం మార్గాన్ని కొవిడ్ సమయంలో ఆర్మీ అధికారులు మూసివేయించారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ తెరవడంలేదు. – రమేశ్, తిరుమలగిరి

✓ ఆర్మీ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – మధుకర్ నాయక్, సీఈవో కంటోన్మెంట్ బోర్డు

? ఎస్సార్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం పరిసరాల్లో పోకిరిల బెడద అధికంగా ఉంది. – వెంకటేశ్వరరావు, ఎస్సార్‌నగర్

✓ ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. రోడ్లపై అనవసరంగా తిరిగితే చర్యలు తీసుకుంటాం. – శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్

? ఈస్ట్‌మారేడుపల్లి వడ్డరబస్తీ ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. – ప్రసాద్, అడ్డగుట్ట

✓ సిబ్బందితో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – శ్రీదర్, ఏరియా సూపర్‌వైజర్

? ఈస్ట్ మారేడుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీప ప్రధాన రహదారి పక్కన చెట్ల కొమ్మలు పేరుకుపోయాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – మాధవి, ఈస్ట్‌మారేడుపల్లి

✓ కొమ్మలను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – జహంగీర్, ఏరియా సూపర్‌వైజర్

? సికింద్రాబాద్‌లోని స్టేషన్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఆవులు తిరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. –సురేశ్, రెజిమెంటల్‌బజార్

✓ ఆవుల యజమానులకు గుర్తించి చర్యలు తీసుకుంటాం: – వెంకటరాములు, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

దుర్గమ్మ.. దీవించు



బీదలబస్తీలోని రేణుకాఎల్లమ్మ దేవాలయంలో..



సనత్‌నగర్: దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని



బేగంపేట: కట్టమైసమ్మను పూజిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం



ఎల్లమ్మ మూలవిరాట్..



ప్రకాష్‌నగర్: మహాలక్ష్మీదేవి



బాపూనగర్‌లో..



జై మాతాదీ యూత్ ఆధ్వర్యంలో..



అమీర్‌పేటలో..



అమీర్‌పేట రాజరాజేశ్వరీ అమ్మవారు

వేర్వేరు ప్రాంతాల్లో రెండు గుర్తుతెలియని మృతదేహాల లభ్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో రెండు గుర్తుతెలియని మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... సికింద్రాబాద్ శివాజీనగర్‌లో ఓ వ్యక్తి(50) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లుగా గుర్తించిన స్థానికులు మార్కెట్ పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి వెళ్లిన పెట్రోలింగ్ సిబ్బంది పరీక్షించగా ఆయన మృతిచెందినట్లుగా గుర్తించారు. చిరునామా లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గోపాలపురం ఠాణా పరిధిలో...

సికింద్రాబాద్‌లోని ఉప్పల్ బస్‌స్టేషన్ ప్రాంతంలోని మెట్రో పిల్లర్ 1173 వద్ద ఓ వ్యక్తి(35) మృతి చెంది ఉన్నట్లుగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీమార్చురీకి తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతంగా విధులు నిర్వహించండి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఒత్తిడితో ఇబ్బంది పడకుండా ప్రశాంతంగా విధులు నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి సూచించారు. అక్టోబర్ 4 నుంచి 10వతేదీ వరకు జరుగుతున్న మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ హరిహరకళాభవన్ ప్రాంతంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 250మంది మెడికల్ ఆధికారులు పాల్గొన్నారు. విధి నిర్వాహణలో వైద్యాధికారులు, సిబ్బంది మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రజలకు సేవలందించాలని కోరారు. డాక్టర్లు నివేదిత, ఆశ్రిత, శ్రీకృష్ణ, శిల్ప పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల నిరాహార దీక్ష

లాలాపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నియామక ప్రక్రియ చేపట్టడానికి నిరసనగా మాదిగ విద్యార్థి సమాఖ్య ఓయూ అధ్యక్షుడు యల్.నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకట్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చందు మాట్లాడుతూ. . డీఎస్సీ నియామక ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న మాదిగలకు తీవ్ర అన్యాయం చేయడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమిడేల్లి తిరుమలేశ్, ఆల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ జీవన్, హైదరాబాద్ అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు



దీక్ష చేస్తున్న ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు

డా.బాలగోపాల్ వర్ధంతి

లాలాపేట, న్యూస్‌టుడే: మానవ హక్కుల నేత డా. బాలగోపాల్ వర్ధంతిని మంగళవారం ఓయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. నాగేశ్వరరావు, ఎన్. సుమంత్ మాట్లాడుతూ.. డా. బాలగోపాల్ పౌర హక్కుల రక్షణ కోసం నిర్విరామంగా పోరాడారని గుర్తుచేశారు. నాయకులు రుక్మత్ పాషా, వెంకటేశ్, కె. స్వాతి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాల తొలగింపు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: బస్తీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో వెలువడిన 'బస్తీల్లో అపారిశుద్ధ్యం' కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. డీఈ ధర్మారెడ్డి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను మంగళవారం తొలగించారు.

వ్యభిచార గృహంపై దాడి... కేసు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఓ ఇంట్లో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు యువతులను భరోసా సెంటర్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిర్వాహకుడి కోసం గాలిస్తున్నారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేష్ కథనం ప్రకారం... మసూద్ సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వెస్ట్ బెంగాల్‌కు చెందిన 25 ఏళ్ల ఇద్దరు యువతులను తీసుకొచ్చి వ్యభిచారాన్ని కొనసాగిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మంగళవారం ఇంటిపై దాడి చేశారు. యువతులను అదుపులోకి తీసుకుని మసూద్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ద్విచక్ర వాహనాలు అపహరించే ముఠా అరెస్టు

బొల్లారం, న్యూస్‌టుడే: ఇంటి ముందు నిలిపి ఉంచే ద్విచక్ర వాహనాలను అపహరించే ముఠాను బొల్లారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై చంద్రయ్య కథనం ప్రకారం.. లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన షేక్ మోహీద్, మహ్మద్ షమీ, మహ్మద్ అహ్మద్‌షా, మహ్మద్ సమీర్ ముఠాగా ఏర్పడి బైక్‌లను రాత్రి సమయాల్లో అపహరిస్తున్నారు. గోపాల్‌పురం, తిరుమలగిరి, నార్సింగి, చందానగర్ ఠాణా పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. 2న బొల్లారంలోని డౌటన్‌బజార్‌లో వాహనాన్ని తస్కరించడంతో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం రాత్రి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి ఏడు వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు పరారీలో ఉన్నారు.

బల్కంపేట దేవస్థానానికి పోటెత్తిన భక్తులు



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు రద్దు చేశారు. ఈఓ బి.కృష్ణ స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షించి భక్తులకు త్వరగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూశారు.

పెండింగ్‌లో ఉన్న పనులపై కలెక్టర్‌కు వినతి



సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల విషయంలో చొరవ తీసుకుని పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్ నేతృత్వంలో పలువురు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

సాలెగూడును తలపిస్తున్న విద్యుత్తు స్తంభాలు



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: వివిధ రకాల కేబుళ్లతో విద్యుత్తు స్తంభాలను ఆయా సంస్థల నిర్వాహకులు అల్లేస్తున్నారు. దీంతో అవి సాలెగూడును తలపిస్తున్నాయి. బల్కంపేటలో ఓ స్తంభం ఇలాగే దర్శనమిస్తుంది. వీటివల్ల ఒక్కోసారి షార్ట్‌సర్క్యూట్ అవుతోంది. విద్యుత్తు స్తంభాలకు ఇతర కేబుళ్లను పెట్టొద్దని నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

అధ్వానం.. దుర్గంధం



సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తా చెదారం. ప్రాంతమంతా దుర్వాసనతో అధ్వానంగా తయారైంది. అటుగా వెళ్లే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వెంటనే శుభ్రం చేయాలని కోరుతున్నారు.

విద్యుత్తు రంగ ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన విద్యుత్తు ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్తు రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీలు గుప్పించారని, చివరకు ఆర్టిజన్‌లు అనే ముద్దు పేరుతో కార్మికుల జీవితాలను చీకట్లోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లు పదోన్నతులు లేకుండా, చాలీచాలని జీవితాలతో నెట్టుకొస్తున్నారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైన ఆర్టిజన్ కార్మికులు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ గిరి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఐటీలో రెండు వర్గాల మధ్య వివాదం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ మహబూబ్ కళాశాల ఆవరణలోని ఎస్వీఐటీలో రెండు వర్గాల మధ్య వివాదంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎస్వీఐటీ కళాశాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వెంకట నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులుగా కొనసాగుతున్న కేవీకే రావు బాధ్యతలతో పాటు కళాశాలను 6లోపు ఖాళీ చేసి వెళ్లాలని మహబూబ్ కళాశాల అధ్యక్షుడు పీఎల్ శ్రీనివాస్ నోటీసులు ఇచ్చాడు. ఒప్పందం మేరకు డబ్బు చెల్లించకపోవడంతో వాళ్ల లైసెన్సు రద్దు చేశామని మంగళవారం ఉదయం కమిటీ సభ్యులతో ఎస్వీఐటీ కళాశాలలోకి వెళ్లి తాను కరస్పాండెంట్‌గా, డైరెక్టర్లు, కమిటీని ప్రకటించారు. దీంతో అక్కడికి చేరుకున్న కేవీకేరావు వారితో వాగ్వివాదానికి దిగారు. కోర్టులో కేసులు నడుస్తుండగా ఎలాంటి హక్కులేకున్నా అక్రమంగా ప్రవేశించడం నేరమని దీనిపై మార్కెట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

డిమాండ్ కోర్సులను ఎంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డా.పృథ్వియాదవ్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని సర్ పడంపత్ సింఘానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.పృథ్వియాదవ్ అన్నారు. అమీర్‌పేటలోని ఎంపీఎం మాల్‌లో నూతనంగా ఏర్పాటైన యూనివర్శిటీ దక్షిణ భారత ప్రాంతీయ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తూ మంచి కోర్సుల్లో ప్రవేశానికి అర్హత కల్పిస్తున్నామని చెప్పారు. యూనివర్శిటీలో కాంబినేషన్ కోర్సులు, డెటా సైన్స్, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ ఎ.సంజీవ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (మంగళవారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 63, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 47, ఆలు 37, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 90, గోరుచిక్కుడు 35, చిక్కుడు 55, దోస 28, బీర 45, కాకర 38, చామగడ్డ 37, కీర 40, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, కందగడ్డ 55, చిలకడదుంప 35, మామిడి 115, మునగ 75, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.63, వంగ 35, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 45, క్యాబేజీ 21, బీన్స్ 90, క్యారెట్ 40, దొండ 47, చిక్కుడు 55, క్యాప్సికం 70, ఆలు 37, కీర 22, దోస 28, చామగడ్డ 37, అరటి 9, బీట్‌రూట్ 25, సొర 19, గోకర 35, చిలకడదుంప 36, మామిడి 115, మునగ 76.

తెల్లవారుజామున రహదారిపై జులాయిల హల్‌చల్

కాప్రా, న్యూస్‌టుడే: కుషాయిగూడలో జులాయిలు హల్‌చల్ చేశారు. ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శివసాయినగర్‌లోని డీమార్ట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు ముఠాలుగా ఉన్న జులాయిలు పరస్పరం ఘర్షణకు దిగారు. రాళ్లతో దాడులు చేసుకున్నారు. అరుస్తూ, కేకలు వేస్తూ అలజడి సృష్టించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురై డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు వచ్చే సరికి జులాయిలు పారిపోయారు. ఓ యువకుడు రోడ్డుపై తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీధుల్లో జులాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, పోలీసు గస్తీ పెంచాలని సీసీఎస్ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం వారు కోరుతున్నారు.

ప్రహరీ ఏర్పాటుకు వినతి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ విమలాదేవీనగర్‌లో మంగళవారం కార్పొరేటర్ వి. శ్రవణ్‌కుమార్ పర్యటించారు. కాలనీ సమస్యలపై స్థానికులతో చర్చించారు. కాలనీలో రైల్వే ట్రాక్ మార్గంలో ప్రహరీ లేకపోవటంతో కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నార న్నారు. సర్కిల్, రైల్వే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ వనజ, సూపర్‌వైజర్ నజీరుద్దీన్, కాలనీ వాసులు రవికిరణ్ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. సమాచారమివ్వండి

దసరా పండగ నేపథ్యంలో అప్రమత్తత అవసరం అంటున్న పోలీసులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన వారు భారీ సంఖ్యలో స్థిరపడ్డారు. వారంతా దసరా పండగకు ఊరెళ్తుంటారు. ఒకటి రెండు రోజులు ఇంట్లో లేకుంటేనే రాత్రి, పగలు అనే తేడా లేకుండా దొంగలు పేట్రేగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. రోజుల తరబడి తాళాలు వేసుంటే చోరీలకు అవకాశం ఉంది.

మల్కాజిగిరి ఠాణా పరిధిలోని నాలుగు డివిజన్లలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు పోలీసు శాఖ ఆరు సెక్టార్లుగా విభజించింది. మల్కాజిగిరి, తూర్పు ఆనంద్‌బాగ్, గౌతంనగర్, మౌలాలి డివిజన్ల పరిధిలోని సుమారు 126 కాలనీలున్నాయి. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో ఎస్సై స్థాయి అధికారిని బాధ్యులుగా నియమించారు. చోరీల నియంత్రణ, నేరాల అదుపు, సొత్తు రికవరీకి ప్రత్యేక విభాగం ఉంటుంది. దీనికి డీఐ బాధ్యుడిగా వ్యవహరిస్తారు.



మల్కాజిగిరి ఠాణా

సెక్టార్ ఎస్సైల ఫోన్ నంబర్లు

మిర్జాలగూడ	–	87126-62141
ప్రశాంత్‌నగర్	–	87126-62142
మౌలాలి	–	87126-62143
మల్కాజిగిరి	–	87126-62144
ఆనంద్‌బాగ్	–	87126-62145
గౌతంనగర్	–	87126-62146

ఇలా చేస్తే మేలంటూ..

- ఇంటికి తాళం వేసి స్వగ్రామాలకు వెళ్తున్నప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో రాత్రి వేళ గస్తీ పెంచుతారు.
- ఇంట్లో నగదు, నగలు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలోగాని, తెలిసిన వారి వద్దగాని దాచి వెళ్లడం మంచిది.
- కరెంటు ఆదా పేరుతో ఇంటిని చీకటిగా ఉంచకూడదు. గదిలోనో, వరండాలోనో విధిగా రాత్రివేళ దీపాలు వెలిగేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఇంటి మెయిన్ డోర్‌కు వేసిన తాళం కన్పించకుండా చేసుకోవాలి. సాధ్యమైనంత మేరకు ముందు డోర్‌కు లోపలి నుంచి తాళం వేసుకుని వెనుక తలుపులకు తాళం వేయడం మంచిది.
- ప్రతి ఇంటికి సెక్యూరిటీ అలారం అమర్చుకోవాలి.
- తిరిగి వచ్చేవరకు తమ ఇరుగు పొరుగువారికి ఫోన్‌చేసి తమ ఇంటి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది.
- యువజన సంఘాలు, మైత్రి సంఘాలు సొంతంగా గస్తీ ఏర్పాటు చేసుకోవడం మేలు.
- అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం అందించాలి.

ఇంటి లొకేషన్ షేర్ చేయండి..



-సత్యనారాయణ, సీఐ, మల్కాజిగిరి

పండగకు ఊరెళ్తున్న వారు తమ ఇంటి లొకేషన్‌ను మాకు షేర్ చేస్తే ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేస్తాం. ఎక్కువగా తెల్లవారుజామున దొంగలు చోరీలకు పాల్పడతారు. కాలనీల్లో 24/7 పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అనుమానాలున్నా స్థానికులు వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

డిఫెన్స్‌కాలనీ, మల్కాజిగిరి, అల్వాల్, గౌతంనగర్, న్యూస్‌టుడే:

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి జేజేనగర్- డిఫెన్స్ కాలనీ ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. బాటసారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - శ్రీపెన్, డిఫెన్స్‌కాలనీ

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలిస్తాం. -నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

? తూర్పుఆనంద్‌బాగ్ ఉప్పరిగూడ రాజానగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. - ప్రసాదరావు, కాలనీవాసి

✓ సమస్యను పరిశీలించి వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్, పర్యవేక్షకుడు, సర్కిల్ వీధిదీపాల విభాగం

? వెస్ట్‌వెంకటాపురంలోని దినకర్‌నగర్ రోడ్డు నంబరు 17 వీధిలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకొస్తూ వీధిలోకి పారుతోంది. అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. -హరికృష్ణ, స్థానికుడు

✓ సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. - కృష్ణమోహన్, మేనేజర్, జలమండలి

? గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్ ప్రధాన మార్గంలో ఎండిపోయిన వృక్షం స్థానికుల రాకపోకలకు అడ్డుగా ఉంది. - అచ్యుతరావు, కాలనీ సంఘం కోశాధికారి



✓ ఎండిన వృక్షాన్ని తొలగిస్తాం. -వెంకటేష్, ఉద్యానశాఖ అధికారి, మల్కాజిగిరి

లయన్స్ క్లబ్ సేవా దినోత్సవం



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అల్వాల్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సేవా దినోత్సవం నిర్వహించారు. అల్వాల్, హైదరాబాద్ క్లబ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం అందించి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జయంతి, సత్యనారాయణరావు, మారుతిప్రసాద్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: వినాయక నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ ప్రధాన రోడ్డులో రూ.70 లక్షల నిధులతో చేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఏడాది కాలంగా నిధులు మంజూరు కాక కాకతీయనగర్ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఏఈ సత్యలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ డీఈ రాజ్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాగర్, భాజపా నాయకులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలను పునరుద్ధరించాలని వినతి



విద్యా కమిషన్ ఛైర్మన్ మురళికి వినతి పత్రం అందజేస్తున్న డైట్ కళాశాలల సంఘం ప్రతినిధులు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్‌లోని హైదరాబాద్ జిల్లా డైట్ కళాశాలను పునరుద్ధరించాలని రాష్ట్ర డైట్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు రామిరెడ్డి, ఉపాధ్యక్షులు జహీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి రవీందర్ కోరారు. డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సీట్లను కన్వీనర్ కోటాలో మంజూరు చేయాలని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరు మురళిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. డైట్ కళాశాల ప్రాధాన్యాన్ని వివరించారు. 2024- 25 విద్యా సంవత్సరానికి డైట్‌లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరిగేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని.. డైట్ కళాశాలలో వెబ్ కౌన్సిలింగ్ అనుమతులు ఇచ్చి పునరుద్ధరించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

వారసత్వ భూమిని రికార్డుల్లో నమోదు చేయాలి

మౌలాలి, న్యూస్‌టుడే: తమకు వారసత్వంగా వచ్చిన పూర్వీకుల ఆస్తిని తమ పేరుపై నమోదు చేయాలని, దాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని అత్తాపూర్‌కు చెందిన మాజిద్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మౌలాలి డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'ఉప్పరిగూడలోని మద్దత్ ఏ మాష్ దర్గా నిర్వహణ కోసం సయ్యద్ రజా అలీ హుస్సేనీకి ఆర్టీసీ కాలనీలోని సర్వే నంబర్లు 398, 399, 409లతో పాటు ఇతర సర్వే నంబర్లలో 315 ఎకరాలు ఇస్తూ నిజాం ఉత్తర్వులు (ముంతకాబ్) ఇచ్చారు. ఆయన కుమార్తె తాజ్ ఉన్నీసాబేగం నుంచి మా అమ్మమ్మ యూసఫ్‌బేగంకు 1966లో హైకోర్టు ద్వారా ఆ భూములపై హక్కులు వచ్చాయి. 1990లో నాటి కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి ఎమ్మార్వో ఉత్తర్వులిచ్చినా కిందిస్థాయి సిబ్బంది రికార్డుల్లో(పహాణీ) నమోదు చేయలేదు. దీంతో తప్పుడు ధ్రువపత్రాలతో మల్కాజిగిరి మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి దానిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు' అని ఆరోపించారు. ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో న్యాయవాది రత్నాకర్ పాల్గొన్నారు.

మండపంలో నిద్రిస్తున్న భక్తుడి చరవాణి చోరీ

మహిళ నుంచి స్వాధీనం చేసుకున్న యువకులు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: అమ్మవారి మండపంలో నిద్రిస్తున్న ఓ భక్తుడి చరవాణిని మహిళ దొంగిలించిన ఘటన నేరేడ్‌మెట్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. న్యూ విద్యానగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఓ మహిళ(35) ఇళ్లల్లో పని చేస్తోంది. రామబ్రహ్మ నగర్‌లో అమ్మవారి మండపంలో కొందరు భక్తులు నిద్రపోతున్నారు. ఉదయం అటుగా వెళ్తున్న ఆ మహిళ వారిని గమనించింది. పక్కన పెట్టుకున్న ఓ ఫోన్‌ను దొంగిలించి అక్కడి నుండి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా యువకులు ఆమె ఆచూకీ కనుగొని చరవాణిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయొద్దని వేడుకోవడంతో మందలించి వదిలేశారు.

పరమేశి జగన్మాత.. మహాలక్ష్మి నమోస్తుతే



అనంత సరస్వతీనగర్‌లో మహాలక్ష్మిగా..



గౌతంనగర్ దుర్గాభవాని ఆలయంలో కరెన్సీ నోట్లతో..



వాణీనగర్ ఆలయంలో లక్ష్మీదేవిగా..



మధురానగర్ రాజరాజేశ్వరి ఆలయంలో..

గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, నేరేడ్‌మెట్, అల్వాల్, మల్కాజిగిరి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌతంనగర్ రైల్వేగేటు సమీపంలోని దుర్గాభవాని ఆలయంలో అమ్మవారిని రూ.2లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. సంతోషిమానగర్ మండపం వద్ద భవానీలు పూజలు నిర్వహించారు. ★ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేరేడ్‌మెట్ విద్యానగర్‌లో నవదుర్గ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపాన్ని, దీన్‌దయాల్ నగర్‌లో మహిళా సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు తుపాకుల జనార్దన్ ఆయన్ని శాలువాతో సత్కరించారు. ★ ఉమాచంద్రమౌళీశ్వర ఆలయంలో లలితామహాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో విశేష అభిషేకం, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

గౌతంనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా కూచిపూడి నృత్య భారతి అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరిలో ఆరుముగమ్ ఆలపించిన త్యాగరాజ, దీక్షితార్ కీర్తనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ పసుమర్తి శేషుబాబు, చంద్రబాల, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ గాంధీపార్కులో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపాన్ని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు దర్శించుకుని పూజలు నిర్వహించారు.



గాంధీపార్కులోని మండపంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



న్యూ విద్యానగర్‌లో ఎంపీ ఈటల రాజేందర్



అనంత సరస్వతీనగర్‌లో కుంకుమార్చన..



సంతోషిమానగర్‌లో..

వైభవంగా ధ్వజారోహణం

గౌతంనగర్, న్యూస్‌టుడే: మిర్జాలగూడ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం వేద పండితులు సంపత్‌కుమార్, శ్రీధరాచారిల బృందం ఆధ్వర్యంలో ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, ఉత్సవ స్వామికి అభిషేకం, హోమం, శృంగార డోలోత్సవ కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న పూజారి



వేంకటేశ్వరస్వామి

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాలను మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మారుతీనగర్ ఆంజనేయస్వామికి వడమాలలతో అలంకరించారు. ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయస్వామిని తమలపాకులు, అరటిపండ్లతో అలంకరించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



'వారసత్వ భవనాలు కూల్చివేయడం దుర్మార్గం'

అబిడ్స్, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లో భాజపా సర్కారు అభివృద్ధి పేరిట వారణాసిలోని గాంధీ సామాజిక సేవా సంస్థ అఖిల భారత సర్వ సేవా సంఘ్‌కు చెందిన 12 వారసత్వ భవనాలను కూల్చివేయడం దుర్మార్గమని సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ అన్నారు. కట్టడాల కూల్చివేతలను నిరసిస్తూ తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నాంపల్లి గాంధీభవన్ ఆవరణలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కొవ్వొత్తులు వెలిగించి మౌన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సినారె శ్రుతిలయ పురస్కార ప్రదానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రుతిలయ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్‌కు ఆదర్శ సినారె పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం చిక్కడపల్లిలోని ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నిర్వహణ సంస్థ వ్యవస్థాపకురాలు ఆమని, కోశాధికారి సుదర్శన్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరా నేల చూపు..



జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి కమిషనర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. సిబ్బందిలో జవాబుదారీతనం పెంచాలని, కార్యాలయంలో భద్రతను దృష్టిలో ఉంచుకొని రూ.లక్షలు వ్యయం చేసి విభాగాల వారీగా ఏర్పాటు చేశారు. ఇందులో చాలా వరకు పనిచేయడం లేదు. కొన్ని విరిగిపోయాయి. దీంతో సీసీ కెమెరా వ్యవస్థ పడకేసింది.


– న్యూస్‌టుడే, అల్వాల్

దొరకని రిజర్వేషన్... జనరల్ టిక్కెట్లకు డిమాండ్

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పెరిగిన రద్దీతో కౌంటర్ల పెంపు

కాచిగూడ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ దొరకకపోవడంతో జనరల్ టిక్కెట్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దసరా పండగకు నాలుగు నెలల ముందుగానే నగరవాసులు టిక్కెట్లను బుక్ చేసుకున్నారు. దీంతో అన్ని రైళ్లలో నిరీక్షణ జాబితానే దర్శనమిస్తోంది. ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితిలో జనరల్ టిక్కెట్లను తీసుకుని సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యా సంస్థలకు ప్రభుత్వం పండగ సెలవులను ఇప్పటికే ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కౌంటర్లు: రైల్వే స్టేషన్లో టిక్కెట్ కౌంటర్లు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2 నుంచి రాత్రి 10 గంటలు, తిరిగి రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులలో పనిచేస్తున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కౌంటర్ల సంఖ్యను పెంచారు.



ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ప్రయాణికులు

సాధారణ రోజుల్లో

జనరల్ టిక్కెట్ల విక్రయం	:	9 వేలు
ప్రస్తుతం దసరా పండగకు	:	12 వేలు
రోజువారి టిక్కెట్ కౌంటర్లు	:	4
ప్రస్తుతం	:	6

ధర తక్కువగా ఉండడంతో.. మరుగుదొడ్లు, కేటరింగ్ వసతులు ఉండటంతో ప్రజలు రైలు ప్రయాణానికే ఇష్టపడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఛార్జీలతో పోల్చుకుంటే టిక్కెట్ ధర చాలా తక్కువగా ఉండటంతో పండగకు నగవాసులు రైలు ప్రయాణానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. టిక్కెట్ల రిజర్వేషన్ దొరకకున్నా జనరల్ బోగీలలో వెళ్లడానికి సమాయత్తమవుతున్నారు.

పక్కన పెట్టారు.. తరలించడం మరిచారు



నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్- డిఫెన్స్‌కాలనీ ప్రధాన మార్గంలో గాంధీ పార్క్ సమీపంలో రోడ్డు పక్కన ఉపయోగం లేని పైపులు కొన్ని నెలల క్రితం పెట్టారు. అనంతరం వాటిని పట్టించుకోవడం మరిచారు. వాటిని అక్కడ నుంచి తరలించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

ముషీరాబాద్

● ముషీరాబాద్ ● అంబర్‌పేట

హామీలు నెరవేర్చే వరకు పోరాడుతాం: తెదేపా



మాట్లాడుతున్న సాయిబాబా. చిత్రంలో కిషోర్ తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆరు హామీలకు పూర్తిస్థాయిలో అమలుకావడంలేదని తెదేపా సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా విమర్శించారు. దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా గత ప్రభుత్వం చేసిన తప్పులనే కాంగ్రెస్ పార్టీ చేస్తోందని ఆరోపించారు. మూసీ నదిని అభివృద్ధి చేస్తామంటూ రూ.లక్షన్నర కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిషోర్, బాలరాజు గౌడ్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

'నాలా ప్రాంతంలోని ఇళ్లను కూల్చొద్దు'



మాట్లాడుతున్న శ్రీనివాస్

బాగ్‌లింగంపల్లి: నాలా పరివాహక ప్రాంత వాసులకు అన్యాయం జరగకుండా మూసీ సుందరీకరణకు చర్యలు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మూసీ వాసుల ఇళ్ల కూల్చివేతపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ అభివృద్ధి పేరిట పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. వారి అంగీకారం మేరకు ఇళ్లను ఇచ్చిన తర్వాతే చర్యలు చేపట్టాలన్నారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ పేదల ఇళ్లను అకారణంగా కూల్చి వేసి రోడ్డున పడేయొద్దన్నారు. నేతలు మహేందర్, వరలక్ష్మి, అనురాధ, భారతి తదితరులు పాల్గొన్నారు.

సినారె శ్రుతిలయ పురస్కార ప్రదానం



శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సుదర్శన్, నవీన్‌కుమార్

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రుతిలయ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్‌కు ఆచార్య సినారె పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం చిక్కడపల్లిలోని ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు సంస్థ వ్యవస్థాపకురాలు ఆమని, కోశాధికారి సుదర్శన్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహానంద సరస్వతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

రాంనగర్, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లో మహమ్మద్ ప్రవక్తపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన పూజారి నర్సింహానంద సరస్వతిపై కేసు నమోదు చేయాలని పఠాన్‌బస్తీకి చెందిన మహ్మద్ నయీంతోపాటు ఇమ్రాన్, ఎండీ గౌస్, ఆరిఫ్, జావీద్‌ఖాన్‌లు మంగళవారం సాయంత్రం ముషీరాబాద్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు ఫిర్యాదు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ పగిలి.. తాగునీరు కలుషితం

● నెల రోజులుగా సమస్య ● జీహెచ్ఎంసీ, జలమండలి పరస్పర ఆరోపణలతో సరి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలోనూ అంబర్‌పేటలోని పలు బస్తీల ప్రజలు కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులకు పైగా తాగునీళ్లు కలుషితమవుతున్నా.. సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. జలమండలి, జీహెచ్ఎంసీ తప్పును ఒకరిపై మరొకరు నెట్టి వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి తీరుతో నల్లా నీళ్లతోపాటు బోర్ల నుంచి వచ్చే భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి.



నాలా విస్తరణ పనులు

నాలా విస్తరణ వ్యయం: రూ. 23 కోట్లు
పొడవు: 5 కిలోమీటర్లు
ఇబ్బందులు పడుతున్నవారు: 3వేల మంది

నత్తనడకన విస్తరణ

అంబర్‌పేటలో ముంపు సమస్య నివారణకు ఓయూ నుంచి వచ్చే మోయిన్ చెరువు నాలా విస్తరణ పనులను జీహెచ్ఎంసీ చేపట్టింది. కొన్నేళ్లుగా నాలా విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బాపూనగర్‌లో పనుల సందర్భంగా మూడు నెలల క్రితం జలమండలి డ్రైనేజీ పైపులైన్ పగులగొట్టారు. నాటి నుంచి బాపూనగర్ పక్కనే ఉన్న చెన్నారెడ్డినగర్ బస్తీ వాసులకు కష్టాలు మొదలయ్యాయి.



బాత్రూమ్‌ల వద్ద నిలిచిన మురుగు

స్తంభించిన డ్రైనేజీ

నాలా విస్తరణ పనుల సందర్భంగా పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టలేదు. పైపులో మట్టి నిండడంతో బాపూనగర్, చెన్నారెడ్డినగర్‌లోని ఇళ్లలోని మురుగు బయటకు వెళ్లలేని పరిస్థితి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోవడంతో మురుగు నిలిచి జలమండలి తాగునీటిలో కలిసి కలుషితమవుతోంది. భూగర్భ జలాలు సైతం కలుషితమై బోర్ల నుంచి కూడా మురుగు వస్తోంది. డ్రైనేజీ పైపులైన్‌ను పగులగొట్టిన జీహెచ్ఎంసీ వారే మరమ్మతులు చేపట్టాలని జలమండలి వారు.. డ్రైనేజీ వ్యవస్థ మా పరిధిలోకి రానందున పనులను జలమండలి వారే చేపట్టాలని జీహెచ్ఎంసీ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నారు.

పరిష్కరించకుంటే ఆందోళన

– గౌతంరావు, అధ్యక్షుడు, భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా

కలుషిత తాగునీరు, డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలి. లేకుంటే జీహెచ్ఎంసీ, జలమండలి కార్యాలయాల ముందు బస్తీవాసులతో ఆందోళన చేపడతాం.

భాజపా సభ్యత్వ నమోదుపై ప్రచారం



కార్యక్రమంలో కృష్ణాయాదవ్, వినోద్ యాదవ్, ఉమారాణి తదితరులు

అంబర్‌పేట: భాజపా సభ్యత్వ నమోదుపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ అన్నారు. మంగళవారం పటేల్‌నగర్ చౌరస్తాలో భాజపా ఓబీసీ మోర్చా అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదును ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేటర్ ఉమారాణి, జిల్లా ఇన్‌ఛార్జి రామోజీ, రమేష్, అజయ్‌కుమార్, కృష్ణాగౌడ్, భిక్షపతి, యశ్వంత్, మల్లేష్, మైలారంరాజు, దయాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

'పనితీరుకు ఎన్నికల ఫలితాలే నిదర్శనం'




గీతామూర్తి

కాచిగూడ, న్యూస్‌టుడే: హరియాణా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాలు కేంద్రంలోని భాజపా ప్రభుత్వ పనితీరుకు నిరద్శనమని భాజపా మహిళా మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో 30 స్థానాల్లో విజయం సాధించి భాజపా సత్తాను చాటిందని అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ హరియాణాలోనూ ముచ్చటగా మూడోసారి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని పేర్కొన్నారు.

బతుకమ్మకుంటను ప్రభుత్వమే కాపాడాలి: వీహెచ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: అంబర్‌పేట బతుకమ్మకుంటను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. బతుకమ్మకుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాస నాయకులు నగరంలో 20 చెరువులను కబ్జా చేశారని, అందులో బతుకమ్మ కుంట మొదటిదని ఆరోపించారు. కవిత అక్కడ బతుకమ్మ ఆడారని, కానీ చెరువును కాపాడలేకపోయారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బతుకమ్మకుంటను సందర్శించాలని కోరారు. కబ్జాకు సంబంధించిన అన్ని ఆధారాలను అడ్వకేట్ జనరల్‌కు అందచేస్తానన్నారు. వచ్చే సంవత్సరం మహిళలు బతుకమ్మ కుంట చెరువులోనే బతుకమ్మ ఆడాలన్నారు.

సుప్రభాత భావనలు వ్యాస సంపుటి ఆవిష్కరణ



సంపుటిని ఆవిష్కరిస్తున్న వంశీ రామరాజు, వెంకటదాసు, సుబ్బారావు, రమణ, రమణాచారి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్, త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో రచయిత పొత్తూరి సుబ్బారావు రచించిన సుప్రభాత భావనలు వ్యాస సంపుటి ఆవిష్కరణ మంగళవారం రాత్రి కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆవిష్కరించిన గ్రంథాన్ని పెద్దూరి వెంకటదాసుకు అంకితమిచ్చారు. తొలుత విజయీభవ అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు తమ స్వీయ కవితలను చదివారు. కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, రమణ వెలమకన్ని, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ: కోదండరాం

రాంనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ పండగ అని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. ఇందిరాపార్కులోని చిల్డ్రన్స్ పార్కులో జీహెచ్ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఐకాస అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలను టూరిజం శాఖ ద్వారా మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలన్నారు. ప్రపంచంలో పూలను గౌరవించి పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. విశ్రాంత ఆచార్యులు రమా మేల్కొటే, ప్రొ.జయధీర్ తిరుమల్‌రావు, వెన్నెల గద్దర్, కోదండరాం సతీమణి సుశీల, గాయకురాలు అంబిక, తెజాస గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, జీహెచ్ఎంసీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఐకాస నాయకులు జహీర్, జగదీశ్, తెజస నాయకులు బైరి రమేశ్, జయ్‌పాల్‌రెడ్డి, జశ్వంత్, రాంచందర్ పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న కోదండరాం, నర్సయ్య తదితరులు

బస్తీలను శుభ్రంగా ఉంచుదాం

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్ బుర్జుగల్లీలోని నియంత్రిక ఆవరణలో చెత్త, చెదారం వేయవద్దని కార్పొరేటర్ బి.పద్మ స్థానికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానికుడు ఎస్. వెంకటసాయికృష్ణారెడ్డి నియంత్రిక వద్ద సీసీ కెమెరాలు, చెత్త వేసేటప్పుడు హెచ్చరించే స్పీకర్‌ను తన నిధులతో ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ పద్మ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీలను శుభ్రంగా ఉంచుకుందామన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్‌తో కలిసి దాతను సన్మానించారు. జీహెచ్ఎంసీ వైద్య అధికారి డాక్టర్ హేమలత, స్థానికులు పాల్గొన్నారు.

జగములనేలె.. జగదాంబ

అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, గాంధీనగర్, విద్యానగర్, బర్కత్‌పుర, కాచిగూడ, అంబర్‌పేట, గోల్నాక, న్యూస్‌టుడే: ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు, స్థానికులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చండీ హోమం నిర్వహించారు. అన్నదాన ప్రసాద వితరణను కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



చిక్కడపల్లిలో కాళికామాత అవతారంలో అమ్మవారు



శంకరమఠంలో గజలక్ష్మి రూపంలో శారదాంబ



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళగౌరిగా..



బతుకమ్మకుంటలో రాజరాజేశ్వరి దేవిగా ..



అంబర్‌పేట మహంకాళి దేవికి నోట్లతో అలంకరణ



అంబర్‌పేట మహంకాళి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు సన్మానం



డీడీ కాలనీలో చండీహోమంలో భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు, గోవర్ధన్‌రెడ్డి,




అంబర్‌పేట దేవాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, పద్మ, మహిళలు



కాచిగూడలో వి.హనుమంతరావు, దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ నేతలు



అంబర్‌పేటలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



ముషీరాబాద్‌లో పూజలు చేస్తున్న భారాస నేత ముఠా జైసింహ తదితరులు



ముషీరాబాద్ మహంకాళి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎడ్ల భాగ్యలక్ష్మీయాదవ్ తదితరులు



ముషీరాబాద్‌లోని మండపం వద్ద ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాంబాబు తదితరులు

భాషలను పరిరక్షించాలి



అభివాదం చేస్తున్న వివేకానందస్వామి, విజయ మోహన్, అమీద్‌ఖాన్, హుస్సేన్ అమీర్ తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: తెలుగుతోపాటు ఇతర భాషలను పరిరక్షించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య కళానిలయంలో భాషా సంరక్షణ సమితి, తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఆంగ్ల భాషా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఆయా భాషా సంఘాల బాధ్యులు కలిసి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగు భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బి.వివేకానందస్వామి, ప్రధాన కార్యదర్శిగా విజయమోహన్, హిందీ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ అమీర్, ప్రధాన కార్యదర్శిగా ఎంఎన్ విజయ్‌కుమార్, ఉర్దూ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ అమీద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా హుస్సేన్ అమీర్, మరాఠీ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా పోనే రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించాలన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయండి

గోల్నాక, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ నేపథ్యంలో పాడైన రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. మంగళవారం శంకర్‌నగర్‌లోని కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రధాన ప్రాంతాలు, అనేక బస్తీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయని అన్నారు. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

రైలు ఢీకొని వెల్డర్ దుర్మరణం

కాచిగూడ: రైలు ఢీకొని వెల్డింగ్ పనిచేసే యువకుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ చిన్నానాయక్ కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన ఎండీ బోలా కుమారుడు ఎండీ ముస్తాక్(19) నగరంలోని బుద్వేల్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి అతను బుద్వేల్ స్టేషన్ వద్ద పట్టాలను దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు.

వీధి దీపాల ఏర్పాటు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకొని కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం వీధి దీపాల ఏర్పాటు పనులను పర్యవేక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. నేతలు తిరుపతి, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (మంగళవారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట 50, ఆలుగడ్డ 45, వంకాయ 40, బెండ 60, దొండ 40, కాకర 50, బీర 60, సోర 30, క్యాబేజి 35, క్యాప్సికం 50, బీన్స్ 70, చిక్కుడు 60, క్యారెట్ 45, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 40.

బతుకమ్మను పేర్చి.. భక్తితో కొలిచి

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్‌లోని ముషీరాబాద్, భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు బతుకమ్మ ఆడి పాడి సందడి చేశారు. పండగలు, ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను, స్నేహభావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతాయని వైద్యాధికారి డా.మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. పీహెచ్ఎన్ ఫెల్లిస్, హెచ్‌వీ శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్లు రత్నమాల, శీల, ఏఎన్ఎంలు విజయకుమారి, సునీత, పద్మలత, సంతోషి, అనురాధ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అదనపు కమిషనర్ గంగాధర్, అధికారులు నీలమ్మ, సునీత, శ్యామ్‌సుందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ★ గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని భాజపా మహిళామోర్చా నాయకురాలు విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో సంబరాల కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. సంధ్యారాణి, స్వప్న, పూర్ణ, సంయుక్తరాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట సీపీఎల్ హెడ్‌క్వార్టర్‌లో బతుకమ్మ సంబరాలను ప్రారంభిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు



కార్మికశాఖ కమిషనర్ కార్యాలయ ఆవరణలో మహిళా ఉద్యోగులు



ఇందిరాపార్కులో జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్, ఐఎన్‌టీయూసీ..



గాంధీనగర్‌లో కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు



భోలక్‌పూర్‌లో ఆరోగ్య కేంద్రం సిబ్బంది



ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రం ముందు బతుకమ్మ ఆడుతున్న వైద్యుడు, వైద్య సిబ్బంది

ఉపాధి పనులు పూర్తి చేయడమే లక్ష్యం: అదనపు కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్:ఉపాధి హామీ పథకంలో అన్ని రకాల పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పథకం అమలు-ప్రణాళికలు..చేపట్టాల్సిన పనులపై అవగాహన సదస్సు జరిగింది. కార్మికుల సమీకరణ, ఉద్యానపంటల సాగు రైతులను గుర్తించడం, నర్సరీల్లో మొక్కలు పెంపకంలో జాగ్రత్తలు, భూగర్భ జలాలను పెంపుపై చర్చించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు, డీపీవో వెంకయ్య, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కీసర: మరమ్మతుల కారణంగా బుధవారం 11 కేవీ కరీంగూడ ఫీడర్ పరిధిలో ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తారక్ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, కాకతీయ డైమండ్, కరీంగూడ, గోధుమకుంట, కుందన్‌పల్లిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు.

రాంపల్లి రామాలయం ఫీడర్ పరిధిలో.. రాంపల్లి, సాహితి హరహర వెంచర్, శుభం ఎన్‌క్లేవ్, జైభవానికాలనీ, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, వీఎస్‌టి కాలనీ, అయ్యప్పనగర్, రోజ్ గార్డెన్, నీలగిరి ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, సిలికాన్ మెడోస్, ఎలిఫాంట్ ఎన్‌క్లేవ్, ఎన్ఎస్ఆర్ లోటస్ కాలనీలో సరఫరా ఉండదు.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యాభినయం



ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకొంటున్నాయి. మంగళవారం అడపా భరణి శిష్య బృందం కూచిపూడి నృత్యం అలరించింది. కళాకారులు అక్షర, అఖిల, ప్రణవి, సర్వజ్ఞ, మనోజ్ఞ, వర్షిణి, కీర్తన, హాసిని, రోహిత, సహస్ర, రామహృదయ, పలు అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

భగాయత్ లేఅవుట్..

ఎవరికీ పట్టని వైనం!

కనీస సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో కాలనీవాసులు

విలీనం చేస్తామన్న హెచ్‌ఎండీఏ.. షరతులు పెట్టిన జీహెచ్ఎంసీ



అధికారుల తీరుపై ఐబీవీల నిరసన తెలిపిన స్థానికులు

న్యూస్‌టుడే, ఉప్పల్: నగరంలోనే ప్రతిష్ఠాత్మకంగా హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన ఉప్పల్ భగాయత్ లేఅవుట్ సమస్యలకు నిలయంగా మారింది. నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు హెచ్ఎండీఏ ప్రయత్నిస్తున్నా.. విలీనానికి జీహెచ్ఎంసీ పలు షరతులు పెట్టడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. పలుమార్లు రెండు సంస్థల అధికారులు సంయుక్తంగా లేఅవుట్‌ను పరిశీలించి.. పలు అంశాలపై చర్చలు జరిపారు. అయినప్పటికీ విలీనానికి అడుగులు మాత్రం పడటం లేదు. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐబీవీల ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అధికారుల తీరుపై నిరసన కూడా తెలిపారు.



లే అవుట్ ముఖ ద్వారం

రోడ్లు.. మురుగు.. అన్నీ సమస్యలే

లేఅవుట్‌లో కనీస సదుపాయాల గురించి హెచ్ఎండీఏ పట్టించుకోవడం మానేసింది. ఆరంభంలో వేసిన రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. వర్షపు నీరు పోయేందుకు ఎలాంటి ఏర్పాట్లూ లేవు. రోడ్ల మీదనే నిలిచి ఉంటుంది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. వాటిలో కుటుంబాలు ఉంటున్నా హెచ్ఎండీఏ సదుపాయాలు కల్పించడం లేదు. విలీనానికి బల్దియా పెట్టే షరతులతో వెనుకడుగు వేస్తోంది.

జోరుగా అక్రమ నిర్మాణాలు..

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ రెండు విభాగాల అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడి ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. అనుమతులు లేకుండా పెద్ద నిర్మాణాలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ కేవలం కొన్ని షెడ్లను మాత్రమే కూల్చుతోంది. మిగతా అక్రమ నిర్మాణాల గురించి పట్టించుకోవడం లేదు.

అమలు కాని హామీలు..

భగాయత్ రైతులకు లేఅవుట్ ఏర్పాటు సమయంలో హెచ్ఎండీఏ పలు అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చింది. వివిధ ప్రజావసరాలకు స్థలాలనూ కేటాయించారు. వాటర్ ట్యాంక్ మినహా ఏ పనులనూ చేపట్టలేదు.

- 2500 గజాల్లో అసోసియేషన్ కమ్యూనిటీహాల్ నిర్మాణం
- 5 ఎకరాల్లో శ్మశాన వాటిక ఏర్పాటు
- 8 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణం, పార్కు, ఈతకొలను, క్లబ్‌హౌస్, ఓపెన్ జిమ్, రైతు బజారు ఏర్పాటు. వీటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు.

మౌలిక సదుపాయాలు లేవు: మేకల మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్, ఉప్పల్ భగాయత్ యజమానుల సంఘం

నిర్వహణ లేక లేఅవుట్‌లోని రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. కనీస మరమ్మతులు లేవు. రోడ్లను ఊడ్చడం లేదు. ఫాగింగ్ ఊసే లేదు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. హెచ్ఎండీఏ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో విలీనానికి జీహెచ్ఎంసీ ఆసక్తి చూపడంలేదు.

చర్చలు జరుగుతున్నాయి: ఆంజనేయులు, ఉప కమిషనర్, ఉప్పల్ సర్కిల్

జీహెచ్ఎంసీలో హెచ్ఎండీఏ లే అవుట్ విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలపై ఇప్పటికే ఉన్నత స్థాయిలో పలుమార్లు చర్చలు జరిగాయి. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపైనే ప్రధానంగా చర్చిస్తున్నాం. వీటికి నిధులు కావాలి. ఈ నేపథ్యం లోనే ఇంకా పూర్తి స్థాయిలో ఒప్పందాలు జరగలేదు.

ఉచితంగా వైద్యం .. తాగునీరివ్వాలని వినతి

నాగారం, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా దమ్మాయిగూడ పుర భూభాగం మొత్తం కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దమ్మాయిగూడ ఐకాస బృందం మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. భూగర్భ జలమంతా విషతుల్యం కావడంతో కనీస అవసరాలకూ వాడుకోలేక పోతున్నామని వివరించారు. తమకు ఉచితంగా తాగునీరు, వైద్యం అందించాలని కోరారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కూడా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణపై గోడపత్రిక ఆవిష్కరణ

కాప్రా: వృత్తిలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందేందుకు బీసీ నిరుద్యోగులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుషాయిగూడ భవానీనగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహనకు రూపొందించిన గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఘట్‌కేసర్ సీఐగా పరశురాము.. జవహర్‌నగర్‌కు సైదయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ సీఐగా పరశురామును నియమిస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఘట్‌కేసర్ ట్రాఫిక్ సీఐగా ఉన్నారు. ఎల్‌బీనగర్ సీసీఎస్ సీఐ వై.రవీందర్ ఘట్‌కేసర్ ట్రాఫిక్ సీఐగా, ఘట్‌కేసర్ క్రైమ్ ఎస్సై డి.అశోక్ ఎల్‌బీనగర్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. జవహర్‌నగర్: జవహర్‌నగర్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.సైదయ్య నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న జి.నాగరాజు సైబర్ క్రైం విభాగానికి వెళ్లడంతో ఆ స్థానంలో కుషాయిగూడ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సైదయ్య రానున్నారు.

నాచారంలో భాజపా సభ్యత్వ నమోదు

నాచారం: మహిళల సంక్షేమం లక్ష్యంగా భాజపా పనిచేస్తోందని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి తెలిపారు. మంగళవారం హెచ్ఎంటీనగర్ బస్సుస్టాప్ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, మోర్చా డివిజన్ అధ్యక్షురాలు మంజులవాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏఐఆర్ఎఫ్ కృషి

ఘట్‌కేసర్: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆల్‌ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) కృషి చేస్తోందని మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పి.రవీందర్ పేర్కొన్నారు. యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఘట్‌కేసర్ స్టేషన్ వద్ద సమావేశంలో మాట్లాడారు. రైల్వేలో ఖాళీలను భర్తీచేసి కార్మికులకు పని భారం తగ్గించాలన్నారు.



దమ్మాయిగూడ.. బండ్లగూడలో | రామంతాపూర్‌లో | చీర్యాలలో | మేడ్చల్‌లో | తూంకుంట శ్రీగాయత్రి మహాక్షేత్రంలో | కీసరగుట్టలో | చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ ఆలయంలో

జగన్మాతా.. నమోస్తుతే

శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం ఆలయాలు, మండపాల్లో అమ్మవారు భిన్న రూపాల్లో కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు.

చిలుకానగర్ మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి | ఏఎస్‌రావునగర్‌లో కుంకుమార్చన | అన్నోజిగూడలో | బోడుప్పల్‌లో | విష్ణుపురికాలనీలో | నాచారం శ్రీనగర్‌కాలనీలో | నాచారం మహంకాళి | ఉప్పల్ వెలుగుగుట్టలో

83 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ నేడు

మేడ్చల్ కలెక్టరేట్: జిల్లాలోని ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ-2024లో ఎంపికైన 83 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా బుధవారం సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో అందించనున్నట్లు డీఈవో ఐ.విజయకుమారి తెలిపారు. ఎంపికైన వారు మల్కాజిగిరి జడ్పీ బాలుర పాఠశాలలో ఉ. 10 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. స్టేడియంకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

యునైటెడ్ ఎస్సీ సంఘం నూతన కమిటీ

పోచారం(ఘట్‌కేసర్)న్యూస్‌టుడే: పోచారం యునైటెడ్ ఎస్సీ సంఘం నూతన కమిటీకి మంగళవారం ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ఎం.సంజీవ, అధ్యక్షుడిగా టి.నరేష్, ఉపాధ్యక్షుడిగా బి.రామచందర్, ప్రధాన కార్యదర్శిగా ఇ.హరిబాబు, కార్యదర్శిగా బాలు, కోశాధికారిగా జోగు సామ్యూల్ ఎన్నికైనట్లు అధ్యక్షుడు నరేష్ పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మ ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ శాంతిగౌడ్ తెలిపారు. మంగళవారం చెన్నాపురం సమీపంలోని బతుకమ్మ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నిమజ్జనం సాఫీగా జరిగేలా చెరువును శుభ్రం చేయించారు.

చెంగిచర్లలో డ్రైనేజీ పనుల పరిశీలన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ చెంగిచర్లలోని ద్వారకానగర్ ఫేజ్-2 నుంచి క్రాంతి కాలనీ రోడ్డు నెంబరు-4 వరకు నిర్మిస్తున్న భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ పనులను ఏఈ రాజశేఖర్ మంగళవారం కార్పొరేటర్ జంగయ్యయాదవ్‌తో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని గుత్తేదారును ఆదేశించారు.

తెల్లవారుజామున రోడ్డుపై జులాయిల హల్‌చల్

కాప్రా: కుషాయిగూడలో జులాయిలు హల్‌చల్ చేశారు. ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం. . శివసాయినగర్‌లోని డీమార్ట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున రెండు ముఠాలుగా ఉన్న జులాయిలు పరస్పరం ఇటుకలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. కేకలు వేస్తూ అలజడి సృష్టించారు. స్థానికులు భయాందోళనకు గురై డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు వచ్చే సరికి జులాయిలు పారిపోయారు. 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యువకుడు రోడ్డుపై తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీధుల్లో జులాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, పోలీసు గస్తీ పెంచాలని సీసీఎస్ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల వారు కోరుతున్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామా..



మేడ్చల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో..



నాచారంలోని ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో..



నాచారం సాధన మానసిక దివ్యాంగుల పాఠశాలలో



ఉప్పల్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో డా.రఘునాథస్వామి, ఉద్యోగులు

కాలుష్య రహిత రవాణా

దిల్లీలో 'డస్ట్ ఫ్రీ డ్రైవ్' విజయవంతం
నగరంలోనూ అనుసరణీయం



దేశ రాజధాని దిల్లీలో కాలుష్య నియంత్రణకు చేపట్టిన 'డస్ట్ ఫ్రీ డ్రైవ్' సత్ఫలితాలిస్తోంది. సెప్టెంబరు 20నుంచి 30రోజులు చేపట్టిన డ్రైవ్‌లో ధూళికణాలు విస్తృతంగా గాల్లోకి చేరకుండా మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ చర్యలు తీసుకుంది. 6,156 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను(దుమ్ము, నిర్మాణరంగంలో వ్యర్థాలు) తొలగించింది. ఇది విజయవంతం కావడంతో మరింత కాలం కొనసాగించాలని.. శీతాకాల కార్యాచరణ చేపట్టింది. దిల్లీ తరహాలో నగరంలోనూ ధూళి కాలుష్యం అధికమైన నేపథ్యంలో 'డస్ట్ ఫ్రీ డ్రైవ్' అమలుచేయాలని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ(రెడీమిక్స్ కాంక్రీట్ యూనిట్లు) తొలగింపు, స్వీపింగ్ మెషిన్ల సామర్థ్యం పెంపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణలో కట్టుదిట్టమైన నిబంధనలు, 15 ఏళ్ల దాటిన వాహనాల నియంత్రణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

దిల్లీలో అమలు ఇలా...

దిల్లీ మున్సిపల్ కౌన్సిల్, జలమండలి, వరద నియంత్రణశాఖ, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో ప్రణాళిక రూపొందించాయి. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టిన నిర్మాణదారులంతా 'సీ అండ్ డీ' పోర్టల్‌లో నమోదును తప్పనిసరిచేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష నుంచి రూ.5లక్షల జరిమానా విధిస్తోంది. రోడ్లపై దుమ్మును తొలగించడానికి 85 మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషిన్లు, 500 వాటర్ స్ప్రింకర్లను ఉపయోగిస్తోంది. 3 షిఫ్టుల్లో 200 మొబైల్ యాంటీ స్మోగ్‌గన్లను వినియోగిస్తోంది.

(ప్రాణ(పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ అటైన్‌మెంట్ సిటీస్) లెక్కల ప్రకారం పీఎం 10 సూక్ష్మ కణాల స్థాయి..

2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
110	96	86	88	88	83	81

(నిర్దేశిత స్థాయి 60 కన్నా తక్కువ ఉండాలి)

ఈనాడు, హైదరాబాద్

మన నగరంలో ఇదీ పరిస్థితి..

● పీసీబీ 'సోర్స్ ఆఫ్ అపాయింట్‌మెంట్' స్టడీ ప్రకారం 50శాతం పర్టిక్యులేట్ మ్యాటర్ (ధూళి కణాలు పీఎం 10, పీఎం 2.5) వాహనాలు, రోడ్లపై రేగే దుమ్ము కారణం. దుమ్ము రేగకుండా 38 స్వీపింగ్ యంత్రాలు తీసుకొచ్చినా, నిర్వహణకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా సత్ఫలితాలు లేవు.
● 15 ఏళ్లకు పైబడిన వాహనాలు 10లక్షలకు పైగా ఉంటాయని అంచనా. వాటిని గుర్తించే సంచార కాలుష్య తనిఖీ కేంద్రాలు తూతూమంత్రంగా పనిచేస్తున్నాయి.
● వాహనాల ఇంధన వినియోగం పెరగడం, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగించకపోవడంతో కాలుష్యం పెరుగుతోంది.
● ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణ ప్రాజెక్టుల్లో ఆర్ఎంసీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ధూళి కణాల ప్రభావం ఉంటోంది.

'ప్రాణ' నివేదిక ప్రకారం ఆర్థిక సంఘం నుంచి మంజూరైన నిధులు, జీహెచ్ఎంసీ ఖర్చు చేసింది (రూ.కోట్లలో)

మంజూరైన నిధులు	సంవత్సరం	ఖర్చు చేసింది
10.8	2019-20	7.48
234	2020-21	18.26
118	2021-22	187.73
91.5	2022-23	161.84
96.75	2023-24	30.66

సెలవుల వేళ.. సేద తీరేందుకు



దసరా సెలవులొచ్చాయి. సొంతూరుకు వెళ్లని వారు సరే.. స్థానికంగా ఉన్నవారి కోసం నగరంలో పార్కులు, సందర్శనీయ ప్రదేశాలు కిటకిటలాడుతున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో కనిపించిన దృశ్యం.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు నేడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోఉంటాయని నగర అదనపు పోలీసుకమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్ తెలిపారు. ● ఏఆర్ పెట్రోల్‌బంకు నుంచి బీజేఆర్ విగ్రహం కూడలి వైపు వచ్చే వాహనాలను నాంపల్లి స్టేషన్ వైపు మళ్లిస్తారు. ● బషీర్‌బాగ్ నుంచి ఏఆర్ బంకు వైపు వచ్చే వాహనాలు బీజేఆర్ విగ్రహ కూడలినుంచి గన్‌ఫౌండ్రి ఎస్‌బీఐ, అబిడ్స్, నాంపల్లి స్టేషన్ వైపు వెళ్లాలి. ● సుజాత స్కూల్ లేన్ నుంచి ఖాన్‌లతీఫ్‌ఖాన్(కేఎల్‌కే) భవనం వైపువచ్చే వాహనాలను నాంపల్లివైపు పంపిస్తారు.

రాచకొండలో 27 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్ పరిధిలో 27 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలాపూర్, నాగోల్, చైతన్యపురి, జవహర్‌నగర్, బీబీనగర్, మంచాల, ఘట్‌కేసర్, వనస్థలిపురం, ఆత్మకూరు తదితర స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు.

మాట వినడంలేదని మట్టుబెట్టాడు

భార్యను సుత్తితో బాది చంపిన భర్త



క్రిష్ణవేణి

నార్సింగి, న్యూస్‌టుడే: భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని, తన మాట వినడం లేదని కక్ష పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెను సుత్తితో కొట్టి హత్య చేశాడు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరిక్రిష్ణారెడ్డి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస సాగర్, క్రిష్ణవేణి(32) దంపతులు వలసవచ్చి హైదర్షాకోట్‌లో ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనను నిర్లక్ష్యం చేస్తోందని, చెప్పిన మాట వినటం లేదని భార్యపై శ్రీనివాస సాగర్ ద్వేషం పెంచుకున్నాడు. మంగళవారం నిద్రిస్తున్న భార్య తలపై సుత్తి కొట్టి చంపేసి పిల్లలను తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

సైబర్ మోసానికి అడ్డుకట్ట

రూ.21.55 లక్షలను కాపాడిన పోలీసులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు బాధితులు పోగొట్టుకున్న రూ.21.55 లక్షలను హైదరాబాద్ సైబర్ పోలీసులు కాపాడారు. డీసీపీ (సైబర్ క్రైమ్) ధార కవిత వివరాల ప్రకారం.. సీబీఐ, ట్రాయ్ అధికారులమని బెదిరించి మోసం చేసి రూ.8.05 లక్షలు దోచేశారంటూ బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నువామా సెక్యూరిటీస్‌లో పెట్టుబడులు పెట్టి భారీ లాభాలు ఇప్పిస్తామని నమ్మించి మరో బాధితుడి నుంచి రూ.13.50 లక్షలు దండుకున్నారు. ఏసీపీలు శివమారుతి, చాంద్‌బాషా పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు మధుసూధన్‌రావు ఎస్. నరేష్ బృందం.. సాంకేతిక ఆధారాలతో బాధితులు పోగొట్టుకున్న డబ్బు ఏ ఖాతాలో జమ అయ్యిందో తెలుసుకుని స్తంభింపజేశారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

ధన్వంతరి ఫౌండేషన్ బాధితులు

గోల్నాక, న్యూస్‌టుడే: అధిక వడ్డీ ఆశ చూపి రూ.1500 కోట్ల మేరకు మోసగించిన ఘటనలో ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం జరిగేలా చూడాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈనెల 13న నిర్వహించనున్న సమావేశంలో కోర్టు బయట కేసును సెటిల్‌మెంట్ చూసుకుందామంటూ మరో మోసానికి తెరలేపారని పేర్కొంది. మంగళవారం కాచిగూడలో బాధితులు ఆత్రేయశర్మ, రవికుమార్‌శర్మ, విజయ్‌కుమార్, రోహిత్, ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ మాట్లాడారు.

విశ్వవ్యాప్తంగా ట్రిపుల్‌ఐటీ
హైదరాబాద్ ఘనత

● సత్తాచాటుతున్న పూర్వ విద్యార్థులు

ఈనాడు, హైదరాబాద్



వివేక్‌ను సత్కరిస్తున్న జయేష్ రంజన్

విశ్వవ్యాప్తంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంటోంది. పాతికేళ్ల క్రితం ఇక్కడ చదువుకున్న విద్యార్థులు విదేశాల్లో తమ సత్తా చాటుతున్నారు. కొందరు సొంతంగా సాఫ్ట్‌వేర్ సంస్థలు స్థాపించగా.. మరికొందరు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి బహుళజాతి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అత్యున్నతంగా ఎదిగిన పదిమంది విద్యార్థులను రజతోత్సవం సందర్భంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఇటీవల అవార్డులతో సత్కరించింది. ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ట్రిపుల్‌ఐటీ సంచాలకులు పీజే నారాయణన్ వారిని అభినందించారు. ● 1998లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో చేరిన వివేక్ మండవ.. ప్రస్తుతం వాషింగ్టన్‌లోని సర్వీస్‌నౌ అనే బహుళజాతి సంస్థలో సీనియర్ మేనేజర్‌గా ఉన్నారు. 2003లో వివేక్, విపుల్ కేడియా, సుభాష్, జయచంద్ర కలిసి పూర్వవిద్యార్థుల మండలిని ప్రారంభించారు. ● వారి వేతనాల్లో 10-30 శాతం వరకూ విరాళంగా ఇస్తున్నారు. ● 1999 బ్యాచ్‌కు చెందిన సంతోష్ కొడిపాక మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్నారు. ● 2000లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో చేరిన జయచంద్ర సుంకర హైదరాబాద్‌లో అమెజాన్‌లో ఇంజినీరింగ్ విభాగం అధిపతి. ● ఉమాశంకర్ అగ్రి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులుగా ఉన్నారు. ● పూర్వవిద్యార్థుల నిధులతో ప్రతిభ కలిగిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ● 2002లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన మనోహర్ పాలూరి మెటాలోని కృత్రిమమేధ విభాగం ఉపాధ్యక్షుడు. ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి ఐదేళ్లలో రూ.కోటి విరాళం ఇస్తామన్నారు.

ఆ గుత్తేదారులు.. నల్ల జాబితాలోకి

ఏఎంఎస్ పనుల్లో అవకతవకలు ● కమిటీ నివేదిక అనంతరం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: వార్షిక నిర్వహణ పనులపై జలమండలి దృష్టి పెట్టింది. ముఖ్యంగా పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వని గుత్తేదారుల జాబితా రూపొందించి తదుపరి వారికి పనులను నిలుపుదల చేయడమే కాకుండా నల్ల జాబితాలో పెట్టాలని ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన సమీక్షించారు. అవుటర్ రింగ్‌రోడ్డు వరకు తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ చేపట్టనున్న సంగతి తెలిసిందే. మొత్తం 25 డివిజన్లు, 160 సెక్షన్లు ఉన్నాయి. నిర్వహణకు నెలకు ప్రతి డివిజన్‌కు రూ.10-20 లక్షలు కేటాయిస్తోంది. పనులు చేయకుండానే తప్పుడు ఎస్టిమేట్లు సృష్టించి నిధులు దిగమింగిన ఉదంతాలు అనేకం. ఏఎంఎస్‌లో ప్రతి డివిజన్‌ను ఒక గుత్తేదారుడికి రెండేళ్లకు లీజుకు ఇచ్చారు. అనేక డివిజన్లలో పనులు చేయకుండానే నిధులు దిగమింగినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఏఎంఎస్ కొనసాగించాలా లేదా అని ఆలోచిస్తోంది.

ద్విచక్ర వాహనాల కొనుగోలు పేరిట టోకరా



స్వాధీనం చేసుకున్న వాహనాలు

సైదాబాద్, న్యూస్‌టుడే: స్నేహితులు, పరిచయస్థుల గుర్తింపు పత్రాల ద్వారా విద్యుత్తు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి బురిడీ కొట్టించిన ఘరానా మోసం బయటపడింది. సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, మలక్‌పేట పోలీసులు మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. రూ.44.80 లక్షల విలువ చేసే 27 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు కథనం ప్రకారం.. డబీర్‌పురాకు చెందిన మిర్జా బాఖర్ అలీబేగ్ (45), బహదూర్‌పురా ప్రిన్స్ కాలనీ నివాసి సయ్యద్ తన్వీర్ హుస్సేన్ రజ్వీ (53), జాఫర్ అలీ మూస్వీ అలియాస్ పిట్టు.. సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలు, అమ్మకం చేస్తుంటారు. మలక్‌పేటకు చెందిన సచిన్(48)తో పరిచయం ఏర్పడి ఓ ప్రణాళిక రూపొందించారు. సకాలంలో ఫైనాన్స్ వాయిదాలు చెల్లించి, లాభాలు ఇస్తామని నమ్మబలికి కొందరి గుర్తింపు పత్రాలతో ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకొని 27 వాహనాలు కొనుగోలు చేశారు. అనంతరం వాటిని తక్కువ ధరలకు విక్రయించారు. ఆ వాహనాలను ఫైనాన్స్ కంపెనీలు స్వాధీనం చేసుకున్నాయని, ఫైనాన్స్ క్లియర్ చేసి వాటిని వారి పేరిట బదిలీ చేస్తామని నమ్మించారు. సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎన్ ప్రసాద్‌వర్మ పర్యవేక్షణలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, ఎస్సైలు పి.సాయిరామ్, షేక్ కవియుద్దీన్, ఎం.మధు తదితరులు కేసు ఛేదించారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఈనాడు, హైదరాబాద్: ఉచిత వైద్య శిబిరాలతో వ్యాధులను ముందస్తుగానే గుర్తించొచ్చని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆమె సందర్శించారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా త్వరితగతిన చికిత్స చేయించుకోవచ్చని అన్నారు. సుమారు 250 మంది ఉద్యోగులు, కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ విమలాకర్ రెడ్డి, కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల యాజమాన్యం, డాక్టర్లకు, సిబ్బందికి మేయర్, డిప్యూటీ మేయర్ ధన్యవాదాలు తెలిపారు. ఉప మేయర్ శ్రీలత, అదనపు కమిషనర్(హెల్త్) పంకజ, చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు పాల్గొన్నారు.

వాన నీటిని ఒడిసి పట్టాలి: మంత్రి పొన్నం



సమీక్ష చేస్తున్న మంత్రి పొన్నం

ఈనాడు, హైదరాబాద్: నగరంలో వరద నీటి సమస్యలను ఎదుర్కోవడం, వాన నీటిని ఒడిసిపట్టే వ్యవస్థలను మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిషోర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వాన నీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు ఎక్కువ స్థాయిలో ఇంకుడు గుంతలను నగరంలో ఏర్పాటు చేయాలన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. 150 వార్డుల కార్పొరేటర్లను భాగస్వాములను చేసి జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. 141 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీటి నిల్వ లేకుండా చేయనున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు శ్రీనివాస్, నర్సింహ

మాదాపూర్, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు, సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో మొత్తం 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 2 కిలోల బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి, 8.5 లక్షల నగదు, 6 కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీపీ నర్సింహ వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన కరన్ మనోహర్ బాబర్(23), ప్యారేసింగ్ బవుల(27), డెబ్రాబవుల(37), కడక్‌సింగ్(38), చిరాడ్ గ్రామానికి చెందిన ఠాకూర్ ఈడియ(30), కుమన్ ఈడియ(30) 2 ముఠాలుగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. గతనెల 19, 20, 21న మియాపూర్, బాచుపల్లి, సూరారం, పేట్‌బషీర్‌బాద్ ఠాణాల పరిధుల్లో చోరీలకు పాల్పడ్డారు. సోమవారం కరన్ మనోహర్‌బాబర్ తన బృందంతో కలిసి మియాపూర్‌లో ఆయుధాలు, కట్టర్లున్న సంచులతో సంచరిస్తూ పట్టుబడ్డారు. వారు వివరాలు చెప్పడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు.

పూజలు చేసి..: మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉంటున్న వీరంతా గిరిజనులు. చోరీ సఫలం కావాలని, పెద్దమొత్తంలో సొత్తు లభించాలని స్వగ్రామంలో గ్రామదేవతకు పూజలు చేసి ప్రైవేటు బస్సుల్లో ఇక్కడికి చేరుకుంటారు. అర్ధరాత్రి తర్వాత చోరీలు చేస్తుంటారు. అడ్డమొస్తే హతమారుస్తారు.



భూగోళం.. కళా విహీనం

సుందరీకరణలో భాగంగా కూడళ్లలో అందమైన ఆకృతులైతే ఏర్పాటు చేశారు. తరువాత నిర్వహణను పట్టించుకోవడం లేదు. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా కూడలిలో రంగులు వెలిసిన ఈ భూగోళమే అందుకు ఉదాహరణ.


వివక్ష లేని సమాజానికి బతుకమ్మ ఆడుదాం



సీపీఐ ఆధ్వర్యంలో డప్పు దరువులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: వివక్షలేని సమాజం కోసం 'బతుకమ్మ ఆడుదాం.. పాడుదాం' అంటూ తెలంగాణ ఆడపడుచులకు సీపీఐ మహిళా నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి నేతృత్వంలో 'వేపకాయల బతుకమ్మ'ను నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం నుంచి నిలోఫర్ కెఫే పార్కింగ్ స్థలం వరకు డప్పు చప్పుళ్లు, కోలాటాలతో బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లారు.

అభివృద్ధికి కలిసి పనిచేస్తా: ఎంపీ కొండా



రేవంత్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న విశ్వేశ్వర్ రెడ్డి

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల ప్రాంత అభివృద్ధి విషయంలో రాజకీయాలకతీతంగా కలిసి పని చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొనడానికి దిల్లీ వెళ్లిన ఆయన న్యూదిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల అంశాలపై చర్చించారు. జీవో 111 ప్రాంతాన్ని స్థిరాభివృద్ధి జోన్‌గా మార్చాలని, భారాస ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న షాబాద్ మండలం సీతారాంపురం దేవాలయ భూములను తిరిగి దేవాలయానికే అప్పగించాలని కోరారు.



రోడ్డున పడ్డాం.. చేయందించరూ!

గౌలిగూడ రోడ్డులో వాహనాల మధ్య తన భర్త శ్రీనివాస్‌ను(50) వీల్‌చైర్‌పై తీసుకొస్తున్న ఈ మహిళ పేరు వాణి. వీరు ఉస్మాన్ షాహీలో నివాసముంటున్నారు 2020 మార్చి17న కూలీపని చేసుకొని ఇంటికి తిరిగొస్తుండగా రోడ్డుపై పడిపోయిన శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరో 4రోజులకు (కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల్లో) అతడి ఎడమ కాలు, చెయ్యితో పాటు నోటి మాట పడిపోయాయి. సకాలంలో ఆసుపత్రికి వెళ్లలేక చికిత్స అలస్యమై మంచానికే పరిమితమయ్యాడు. వాణి కూడా అతడి బాగోగులు చూసుకోవడానికి ఇంట్లోనే ఉండటంతో పూట గడవడం కష్టమైంది. ఇంటి అద్దె కట్టలేక కమ్యూనిటీ హాల్‌లో ఉంటూ స్థానికుల సహాయంతో బతుకీడుస్తున్నారు. ప్రభుత్వం పింఛను మంజూరుచేయాలని వేడుకుంటున్నారు.

పదో తరగతి మెమోలో తప్పుల సవరణకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: 2023-24 విద్యా సంవత్సరంలో పది పాసైన విద్యార్థుల మార్కుల జాబితాలో తప్పులుంటే సవరణలు చేస్తున్నామని ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు ఎ.కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన అనంతరం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మార్కుల జాబితాలో స్వల్పంగా తప్పులున్నాయని దరఖాస్తు చేసుకోగా రెండు దశల్లో 11,387 అభ్యర్థనలను పరిష్కరించామని, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 2,681 మార్కుల జాబితాలను సవరణ చేశామన్నారు. ఇప్పటికీ మార్కుల జాబితాలో అక్షర దోషాలుంటే పాఠశాల తనిఖీ అధికారి ద్వారా తమ కార్యాలయానికి పంపితే సవరణలు చేస్తామని తెలిపారు.

జీఐఎస్ సాంకేతికతతో.. మురుగుకు అడ్డుకట్ట

● ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రణాళిక
● ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షణ



మురుగు నిర్వహణపై ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తున్న జలమండలి అధికారి

గ్లోబల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్) సాయంతో మురుగుపై పర్యవేక్షణతోపాటు ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారానికి జలమండలి దారి చూపుతోంది. గ్రేటర్ వ్యాప్తంగా 7-8 వేల కిలోమీటర్ల మేరకు మురుగు నీటి వ్యవస్థ ఉంది. వీటిపై 3లక్షల వరకు మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో మురుగు సమస్య స్థానికులకు తలనొప్పిగా మారింది. నెలలో కేవలం మురుగు సమస్యపైనే జలమండలికి 30-40 వేల ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా జీఐఎస్ సాయంతో పైపులైన్లు, మ్యాన్‌హోళ్లను ప్రాంతాలను మార్క్ చేసింది. ఈ సాంకేతికతను జలమండలి వినియోగదారుల సేవా కేంద్రానికి అనుసంధానం చేశారు. మురుగు సమస్యపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఏ ప్రాంతం నుంచి ఫిర్యాదు వచ్చిందనే సమాచారం అధికారులకు అందిస్తారు. వెంటనే స్థానిక సిబ్బంది అక్కడకు చేరుకొని ఎయిర్‌టెక్ యంత్రాలతో శుభ్రం చేస్తారు. క్షేత్రస్థాయి వరకు పూర్తి పర్యవేక్షణ ఉండటంతో ఎప్పటికప్పుడు మురుగుకు అడ్డుకట్ట వేయవచ్చునని అధికారులు చెబుతున్నారు.

సిల్టు తరలింపుపైనా...

చాలా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి చెత్తాచెదారం తొలగిస్తున్నా అక్కడే రోజుల తరబడి విడిచిపెడుతున్నారు. ఈలోపు వర్షం పడితే మళ్లీ చెత్తకరిగి మ్యాన్‌హోల్‌లోకి చేరుతోంది. ఇకనుంచి మ్యాన్‌హోళ్ల నుంచి చెత్త తరలింపును కూడా జీఐఎస్ విధానంతో పర్యవేక్షిస్తారు. గ్రేటర్‌లో ఇప్పటికే 160 వరకు సిల్ట్‌కార్టింగ్ వాహనాలు ఉన్నాయి. వీటికి కూడా జీపీఎస్ అందుబాటులోకి తెచ్చారు. ఎక్కడెక్కడ ఎన్ని కి.మీ. తిరుగుతున్నాయో కచ్చితంగా అంచనా వేయవచ్చు. సిల్టు తొలగించిన తర్వాత ఫొటోతీసి అప్‌లోడ్ చేస్తారు. వెంటనే సిల్టుకార్ట్ వాహనం చేరుకొని ఆ చెత్త తొలగించి ఫొటోతీసి అప్‌లోడ్ చేయాలి. దాన్ని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు కూడా చూసేలా ఏర్పాటుచేశారు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బందిలో జవాబుదారీతనం పెరిగి ఎప్పటికప్పుడు చెత్త తొలగించనున్నారు. ఈ సాంకేతికతతో మంచి ఫలితాలు కన్పించడంతో.. రానున్నరోజుల్లో మంచి నీటి సరఫరా, పైపులైన్ల లీకేజీలపై కూడా దృష్టి సారిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

ఈనాడు, హైదరాబాద్

ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ..

నగరంలో సందడిగా బతుకమ్మ ఉత్సవాలు



నార్సింగిలోని తెలంగాణ పోలీసు అకాడమీలో డైరెక్టర్ అభిలాష బిస్ట్, పోలీసుల కుటుంబ సభ్యులు



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ హైకోర్టులో మహిళా ఉద్యోగుల కోలాటం



ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వద్ద జరిగిన ఉత్సవాల్లో తిరునగరి జ్యోత్స్న, కాట్రగడ్డ ప్రసూన, గడ్డి పద్మావతి తదితరులు



మేడ్చల్ కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ మారథాన్ నవంబరు 17న



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, క్రీడా విభాగం సహకారంతో గ్రాన్యూల్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 15వేల మొక్కలు పెంచే లక్ష్యంగా నవంబరు 17న గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ మారథాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమీర్‌పేటలో గ్రాన్యూల్స్ ఇండియా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ.. కన్హా శాంతివనంలో మారథాన్ జరుగుతుందన్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, ఒలంపిక్స్ క్రీడాకారిణి జ్యోతిక శ్రీదండి, గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ ట్రస్టీ సంజయ్ సెహగల్ పాల్గొన్నారు

సంస్కృతిని చాటేలా బతుకమ్మ సంబరాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌతంరావు, సి.కృష్ణాయాదవ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్లు భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు తెలిపారు. ఈ నెల 9న అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో నిర్వహించే వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, గాయని మంగ్లీ తదితరులు హాజరవుతారని చెప్పారు. మంగళవారం బతుకమ్మ ఏర్పాట్లను మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్‌తో కలిసి పరిశీలించారు.



ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ వద్ద ప్రమాదకరమైన మలుపు ఇది. రాత్రిళ్లు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటిని అరికట్టేందుకు ఓయూ ఉద్యోగి వెంకట్ వాహనదారుల అవగాహన కోసం.. ప్రమాదాలు జరిగిన చోటే ఇలా ఆటోపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

బాబోయ్.. బాంబూచీ!

పోలీసులకు తలనొప్పిగా నకిలీ ఫోన్‌కాల్స్



ఈనాడు, హైదరాబాద్ - న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్: అప్పటి వరకు కలిసి జంటగా తిరిగిన ప్రేమికుల మధ్య గొడవ తలెత్తింది. ప్రేయసి సొంతూరికి వెళ్లేందుకు రైలెక్కిందన్న కోపంతో ప్రియుడు ఆమె ప్రయాణిస్తున్న రైల్లో బాంబు ఉందంటూ పోలీసులకు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు రైలును నిలిపి తనిఖీ చేసి తప్పుడు సమాచారంగా తేల్చారు.

పలు కారణాలతో.. ప్రియురాలిపై కోపం వచ్చినా.. ప్రత్యర్థిపై ప్రతీకారం తీర్చుకోవాలన్నా.. మానసిక ఒత్తిడి చిత్తు చేస్తున్నా.. మద్యం మత్తు తలకెక్కినా.. కొందరు వ్యక్తులు పోలీస్ కంట్రోల్‌రూంకు ఫోన్ చేస్తున్నారు. మరికొందరు మెయిల్ ఐడీకి సమాచారం చేరవేస్తున్నారు. బాంబు బెదిరింపులతో పోలీసులను పరుగులు పెట్టిస్తున్నారు. కంట్రోల్‌రూంకు వచ్చిన సమాచారం ఆధారంగా 5-7 నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుతుంటారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడిన సందర్భాలూ ఉన్నాయి. అత్యవసర సమయంలో సంజీవనిగా ఉపకరించే సదుపాయాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. వ్యక్తిగత అంశాలను వేదికగా మలచుకుంటున్నారని పోలీసు అధికారి ఒకరు ఆవేదన వెలిబుచ్చారు. చార్మినార్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఐటీ కంపెనీలు, బస్‌స్టేషన్లు, ట్యాంక్‌బండ్, సినిమా థియేటర్లలో బాంబు అమర్చారంటూ వచ్చే బెదిరింపు ఫోన్‌కాల్స్ ఎక్కువగా ఉంటున్నాయి.

ఇదీ లెక్క..

- గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లకు వివిధ నేర ఘటనలపై డయల్ 100కు ఏటా 4 లక్షలకు పైగా ఫోన్‌కాల్స్ వస్తుంటాయి.
- పోలీసులను ఆటపట్టిద్దామన్న ఉద్దేశంతో 10 శాతం మంది ఫోన్ చేసి సమయాన్ని వృథా చేస్తున్నారని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.
- రెండేళ్ల వ్యవధిలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు 4 బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఇవన్నీ ఆకతాయిలు చేసిన పనిగానే పోలీసుల దర్యాప్తులో తేలింది

ఉదంతాలివి..

- చార్మినార్ వద్ద ఒక యువతి మానవ బాంబుగా మారి మారణహోమం సృష్టించబోతుందంటూ ఫోన్‌కాల్. జాగిలాలు, డాగ్ స్క్వాడ్స్‌తో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఆ యువతిపై కోపంతో అలా చేసినట్లు నిందితుడు చెప్పాడు.
- సికింద్రాబాద్ అల్ఫా హోటల్‌లో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో పోలీసులు సోదాలు జరిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆకతాయి ఫోన్ చేసినట్లు గుర్తించారు.
- సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలులో అగంతకులు ఉన్నారంటూ ఒక వ్యక్తి సమాచారమిచ్చాడు. బోగీలో ఉన్న నిందితుడు సినిమాల్లో చూసినట్టుగా ప్రమాద సమయంలో పోలీసులు ఎలా వస్తారనేది తెలుసుకునేందుకు చేశానంటూ చెప్పడం గమనార్హం.
- శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు ఉందంటూ బిహార్‌కు చెందిన వ్యక్తి రెండు నకిలీ మెయిల్స్ పంపాడు. కరోనా సమయంలో ఉద్యోగం పోవడంతో తప్పుడు సమాచారాన్ని చేరవేసినట్లు గుర్తించారు.

అంకుర సంస్థల వేగవంత వృద్ధే లక్ష్యం



కార్యక్రమంలో సోనీ మొహంతి, మహంకాళి శ్రీనివాస్‌రావు

రాయదుర్గం, న్యూస్‌టుడే: భారత వెబ్ 3 అంకుర సంస్థలకు ప్రపంచ స్థాయి బ్లాక్ చెయిన్ సాంకేతికత, వనరులు అందించడం ద్వారా వాటి వృద్ధిని మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రముఖ బ్లాక్ చెయిన్ నెట్‌వర్క్ సంస్థ ఎక్స్‌డీసీ.. రాయదుర్గం టీహబ్ మంగళవారం వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈమేరకు టీహబ్ సీఈవో మహంకాళి శ్రీనివాస్‌రావు, ఎక్స్‌డీసీ నెట్‌వర్క్ వెంచర్, ఎకోసిస్టమ్ బిల్డింగ్ హెడ్ సోనీ మొహంతి అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకుని మార్చుకున్నారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. భారత్‌లో బ్లాక్ చెయిన్ సాంకేతికత గణనీయ ఉపాధి అవకాశాలు కల్పించనుందని, భవిష్యత్‌లో ఈ రంగం 5 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించగలదనే అంచనా ఉన్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యానికి కమాండ్ కంట్రోల్ సెంటర్



సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు, హైదరాబాద్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)ని ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి స్పష్టం చేశారు. అందులో భాగంగా ఐసీసీసీ నిర్వహణ, లక్ష్యాలను చేరుకొనేందుకు అవసరమైన పద్ధతులను ఎంచుకునేందుకు ఆమె మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిపుణుల సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 11 కన్సల్టెన్సీలు వారి సాంకేతిక విధానాలను కమిషనర్‌కు వివరించాయి. సమావేశంలో ఆస్కి ప్రతినిధులు పాల్గొన్నారు.

లాట్ మొబైల్స్‌లో ప్రత్యేక ఆఫర్లు

ఈనాడు, హైదరాబాద్: దసరా, దీపావళితో పాటు 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లాట్ మొబైల్స్ సంస్థ వినియోగదారుల కోసం 9 ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. రూ.9,999 వరకు విలువ చేసే ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతులు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్స్, ఏసీలపై 40శాతం తగ్గింపు, 10శాతం తక్షణ నగదు వాపసు, సున్నా ముందస్తు చెల్లింపు, నోకాస్ట్ ఈఎంఐ ఆప్షన్ సదుపాయాలను కల్పిస్తోంది. వీటితో పాటు ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు కస్టమర్లకు 5శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 80శాతం వరకు తగ్గింపు, ప్రతి ఒప్పో మొబైల్ కొనుగోలుపై లక్కీడ్రా ద్వారా రూ.10లక్షల నగదు గెలుచుకునే అవకాశం కల్పిస్తోంది. మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సంబరాల సౌభాగ్యం.. బతుకమ్మల వైభవం



నగరమంతా బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వాటి ప్రాశస్త్యం తెలిపేలా కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు వెదురు కర్రలు, కాగితాలతో బతుకమ్మల్ని తయారు చేస్తున్న ఈ దృశ్యం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వద్ద కనిపించింది.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీసీసీ అధ్యక్షుడు



ఆలయం వద్ద మహేష్‌కుమార్ గౌడ్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు చారిత్రాత్మకం



మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ, న్యూస్‌టుడే: ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. రూ.5 వేల కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో సీఎం రేవంత్‌రెడ్డి వాటిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంగళవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కోలా జనార్దన్, నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, ఉదయ్, శివమ్మ పాల్గొన్నారు.

గ్రాండ్ వివాంతా వెకేషన్స్‌కు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: డబ్బు రీఫండ్ విషయంలో ఇబ్బంది పెట్టిన గ్రాండ్ వివాంతా వెకేషన్స్‌కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. నానక్‌రాంగూడకు చెందిన ఐశ్వర్యశ్రీ, సుప్రీత్‌కుమార్ ఫిర్యాదును విచారించిన కమిషన్.. వీరి నుంచి వసూలు చేసిన రూ.3 లక్షలు 9శాతం వడ్డీతో పాటు రూ.30వేలు పరిహారం, రూ.10 వేలు కేసు ఖర్చులు చెల్లించాలని ప్రతివాద సంస్థను ఆదేశించింది.

సహారా ఇండియా లిమిటెడ్‌కు.. డిపాజిట్ డబ్బు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన సహారా ఇండియా లిమిటెడ్‌కు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయలు వేసింది. మెచ్యూరిటీ గడువు తీరినా మొత్తం చెల్లించడం లేదని నేరేడ్‌మెట్‌కు చెందిన రాజ్‌కుమారి కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన కమిషన్ రూ.7,05,240 రీఫండ్ చేయడంతో పాటు రూ.10వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలి



గణేష్‌చారిని సన్మానించిన మధుసూదనాచారి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకోవాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం తెలంగాణ బీసీ కుల సంఘాల ఐకాస ఛైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని కుందారం గణేష్‌చారి అన్నారు.

నాకౌట్‌కు హైదరాబాద్

రాజ్‌కోట్: బీసీసీఐ జూనియర్ మహిళల అండర్-19 టీ20 ట్రోఫీలో హైదరాబాద్ నాకౌట్‌లో అడుగుపెట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఆరు పరుగుల ఆధిక్యంతో ఉత్తరాఖండ్‌పై విజయం సాధించింది. సంధ్య గోరా (43 నాటౌట్) రాణించడంతో తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 121 పరుగులు రాబట్టింది. బదులుగా ఉత్తరాఖండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 115 పరుగులు చేయగలిగింది. సృజన (2/21), దీక్షిత (2/5) రాణించి హైదరాబాద్‌కు విజయాన్ని అందించారు. లీగ్ దశలో అయిదు మ్యాచ్‌లాడిన హైదరాబాద్ నాల్గింట్లో నెగ్గి గ్రూపు-సిలో రన్నరప్‌గా నిలిచింది.

లలితాదేవిగా..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లి ఈ నెల 7న సోమవారం లలితాదేవిగా దర్శనమిచ్చారు. త్రిపురాత్రయంలో లలితాదేవి రెండో శక్తిగా, ఉపాసకులకు ముఖ్యదేవతగా నిలుస్తుంది. లక్ష్మీసరస్వతులు ఇరువైపులా వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్టాన శక్తిగా కొలువుదీరుతుంది. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించి భక్తులకు వరాలిస్తుంది. కనకాంబరం చీరలో అమ్మవారి రూపం అద్భుతంగా సాక్షాత్కరిస్తుంది.



జయ శుభకారిణి.. విజయ రూపిణి

పెద్దమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తోంది. నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. అమ్మవారికి చేపట్టే అలంకార విశేషాలను తెలుసుకుందాం.

- జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే



రాజరాజేశ్వరీదేవిగా..

అలంకారరూపిణి అయిన అమ్మవారు 8వ తేదీన మంగళవారం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భువన బ్రహ్మాండాలకు ఆరాధ్య దేవత అయిన రాజరాజేశ్వరీదేవిని జ్ఞాన, క్రియా శక్తులను ప్రసాదించే తల్లిగా భక్తులు కొలుస్తారు. త్రిమూర్తులను పరిపాలించే దేవతగా ఆకుపచ్చ ముఖ వర్ణంలో అమ్మవారు కొలువుదీరుతారు. ఆకుపచ్చ రంగు చీరలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారికి ఇష్టమైన పులిహోర, గారెలు ప్రసాదంగా చేసి పెడతారు.

దుర్గాదేవిగా..

పులిపై ఆసీనురాలై దుర్గాదేవి తల్లిగా అమ్మవారు ఈ నెల 10న గురువారం భక్తులకు దర్శనమిస్తుంది. ఆయుధధారిణిగా అమ్మవారు భక్తులకు కనిపిస్తుంది. దుర్గముడనే రాక్షసుడిని అమ్మవారు సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అమ్మవారి ఉగ్రరూపంతో నుదుట ఎర్రని కుంకుమతో పసుపు పచ్చని ముఖవర్చస్సుతో దర్శనమిస్తుంది. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మకు ఎరుపు రంగు వస్త్రాన్ని ధరింపజేస్తారు. ఎర్రటి పుష్పాలతో పూజిస్తారు.





సరస్వతి దేవిగా..

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న బుధవారం అమ్మవారు సరస్వతిదేవీ అలంకారంలో భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తనుంది. సరస్వతి నమస్తుభ్యం.. వరదే కామరూపిణి.. విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా.. అంటూ ప్రతీ భక్తుడు ఇష్టారాధ్యంగా పిలుచుకొనే తల్లి బుద్ధిని, విద్యను, జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. భక్తులు ముందుగానే ఆలయంలో సంప్రదిస్తే వారికి అవకాశం కల్పిస్తారు. చిన్నారులతో సరస్వతి దేవి ఒడిలో అక్షరాలు దిద్దిస్తారు. ధవళ వర్ణ వస్త్రాలు, అక్షర మాల ధరించి అభయముద్రతో, వీణను చేత బట్టి చందన చర్చిత దేహంతో నెమలి వాహనంపై దర్శనమిస్తుంది.



మహిషాసుర మర్దినిగా..

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు 9వ రోజున శుక్రవారం మెరూన్ రంగు చీరలో మహిషాసుర మర్దినీ దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. లోక కంటకుడైన మహిషాసురుడిని సంహారం చేసిన మహోగ్రరూపంగా కనిపిస్తుంది. సకల దేవీదేవతల శక్తులు ఈ తల్లిలో మూర్తీభవించి ఉంటాయి. దివ్య తేజస్సుతో, అనేక ఆయుధాలు ధరించి సింహ వాహినియై దర్శనమిస్తుంది. మహిషాసురుడిని త్రిశూలదండనం చేస్తూ కనిపించే అమ్మవారి ఉగ్రరూపాన్ని భక్తులు దర్శించుకోవచ్చు.

పెద్దమ్మతల్లిగా..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి అంకం ఇది. పదో రోజున పెద్దమ్మతల్లిగా నిజరూప అలంకారంలో దర్శనమిస్తుంది. ఎర్రని ముఖవర్చస్సుతో చేతిన త్రిశూలం, పులివాహనంపై అమ్మవారు భక్తులకు కనిపిస్తుంది. ఉత్సవాల చివరి రోజున ఈ వేడుకను మహాఘట్టంగా నిర్వహిస్తారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని కోరిన కోర్కెలు తీర్చే పెద్దమ్మతల్లి ప్రసాదాన్ని స్వీకరిస్తారు.



ప్రత్యేక వేడుకలు


దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి దేవాలయంలో ఈ నెల 10న ఆలయంలో అమ్మవారి దుర్గాదేవి అలంకారం సందర్భంగా ఇక్కడ రాత్రి 9.30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తారు. వేదపండితులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. 11న ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో బలిప్రదానం, పూర్ణాహుతి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.



విభిన్న రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు


రాజరాజేశ్వరీదేవిగా పెద్దమ్మ తల్లి - న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్


రాజరాజేశ్వరిగా ఉజ్జయిని మహాకాళి - న్యూస్‌టుడే, రాణీగంజ్


మంగళగౌరిగా బల్కంపేట ఎల్లమ్మ - న్యూస్‌టుడే, సంజీవరెడ్డి నగర్


సరస్వతీ దేవిగా ప్రత్యంగిరా మాత -న్యూస్‌టుడే, ఆర్కేపురం

అద్వితీయం మదురై మీనాక్షమ్మ ఆలయం

- ఏడాదిలో 274 రోజులు ఉత్సవాలే
- మైమరపించే కళా సంపదకు నిలయం

ప్యారిస్ (చెన్నై), న్యూస్‌టుడే: మదురై అనగానే గుర్తు వచ్చేది మీనాక్షి అమ్మవారి ఆలయం. ఏడాదిలో ఎక్కువ భాగం ఉత్సవాలు జరిగే పుణ్యస్థలం ఇది. చిత్తిరై ఉత్సవాల సమయంలో మీనాక్షి అమ్మవారి పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. ఎన్నో అద్భుతాలను కలిగి ఉన్న హిందూ దేవాలయాల్లో మీనాక్షి ఆలయం ఒకటి. మానవ శక్తికి అందని అద్భుతాలు, ఆశ్చర్యకర అంశాలు దీని సొంతం. మీనాక్షి అమ్మవారి ఆలయం, మీనాక్షీ సుందరేశ్వరుడి ఆలయం అని వివిధ పేర్లతో పిలిచే ఈ ఆలయం మదురైలోని వైగై నదీ తీరంలో ఉంది. ఈ ఆలయం శక్తి పీఠాల్లో ఒకటి. మీనాక్షి అమ్మ మదురైలో జన్మించినట్లు విశ్వసిస్తారు. పార్వతీదేవీ అవతారమైన మీనాక్షి అమ్మవారిని వివాహం చేసుకునేందుకు పరమేశ్వరుడు సుందరేశ్వరుడి రూపంలో మదురైకి వచ్చినట్లు స్థల పురాణం. ఆలయంలో అమ్మవారే ప్రధాన దేవత. అమ్మవారిని పూజించాకే శివపెరుమాళ్‌ని పూజించే సంప్రదాయాన్ని పాటిస్తారు. చిత్తిరై, ఆవని, తెప్పోత్సవం, ఆడిపూరం అత్యంత విశిష్ఠంగా జరుగుతాయి.


మీనాక్షి అమ్మవారి ఆలయం


మీనాక్షీదేవి, సుందరేశ్వరుడు

తాళంపు కుంకుమ ప్రసాదంగా..

మీనాక్షి అమ్మవారికి ఏడాదిలో సుమారు 274 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఏడాదిలో రుషభ వాహనంలో శివపెరుమాళ్ 16 సార్లు దర్శనమిస్తారు. చిత్తిరై తిరునాల సమయంలో 1, 12వ రోజున భక్తులకు దర్శనం ఇస్తారు. చిత్తిరై తిరునాల 4వ రోజున స్వామి, అమ్మవారితో విల్లాపురం పావక్కాయ్ మండపంలో దర్శనమిస్తారు. చిత్తిరై మాసంలో మీనాక్షి, సుందరేశ్వరుడి తిరుకల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఆలయంలో తాళంపు కుంకుమ ప్రసాదంగా ఇస్తారు. ఈ ప్రసాదం మరే ఆలయంలో లభించదు. అష్టశక్తి మండపం మధ్యన నిల్చొని అమ్మవారి సన్నిధిని చూస్తే లోపల జరిగే కర్పూర హారతిని చూడవచ్చు.

కామకోటి శక్తి పీఠం.. కామాక్షి అమ్మ క్షేత్రం

ప్యారిస్ (చెన్నై), న్యూస్‌టుడే: ఆలయాల నగరంగా పేరుగాంచిన కాంచీపురంలో అత్యంత ప్రధానమైనది కామాక్షి అమ్మ ఆలయం. 51 శక్తి పీఠాల్లో ఒకటిగా, మోక్షాన్ని ప్రసాదించే పుణ్య స్థలాల్లో ఒకటిగా, కామకోటి శక్తి పీఠంగా ఉంది. కాంచీపురం కామాక్షి అమ్మ ఆలయం పరాశక్తి నాభి పడిన ప్రాంతంగా భక్తులు భావిస్తారు. కాంచీపురంలో ఉన్న శివాలయాలన్నింటికీ శక్తి పీఠంగా కామాక్షి అమ్మ ఆలయం ఉంది. కాంచీపురంలో శివాలయాలు ఎన్నిఉన్నా వాటికి అమ్మవారి సన్నిధి ఉండదు. అన్ని ఆలయాలకు ఏకైక శక్తి కామాక్షి అమ్మవారు. ఏ ఆలయంలో ఉత్సవం జరిగినా ఉత్సవ మూర్తి ఉన్న ఆలయం చుట్టు కాకుండా కామాక్షి అమ్మ ఆలయం చుట్టూ ఊరేగింపు జరుగుతుంది.



పద్మాసనంలో దర్శనం: బంగారు గోపురం కింద ఉన్న గర్భగుడిలో అమ్మవారు రెండు కళ్లు మూసుకుని పద్మాసనంలో కూర్చుని దర్శనమిస్తారు. నాలుగు చేతులతో కనిపించే అమ్మవారు ముందు రెండు చేతుల్లో చెరకు, తామర పువ్వుతో, వెనుక చేతుల్లో ఆప్యాయత, అంకుశంతో ఉంటారు. భుజంపై చిలుకతో మంగళ రూపిణిగా, పరబ్రహ్మ స్వరూపిణిగా దర్శనమిస్తారు. ప్రారంభంలో ఉగ్రరూపంగా ఉన్న అమ్మవారి ముందు శ్రీచక్రాన్ని ఆది శంకరుడు ప్రతిష్ఠించిన తర్వాత శాంతరూపంగా మారారు. గాయత్రి మండపంలో ఉన్న అమ్మవారి గర్భగుడి వద్ద శివుడు, విష్ణువు, బ్రహ్మ రూపాలున్నాయి. గర్భగుడి చుట్టూ బంగారు కామాక్షి, ఆది శంకర్, సరస్వతి సన్నిధులున్నాయి.

ఎనిమిదో శతాబ్దంలో నిర్మాణం: ఐదు ఎకరాల విస్తీర్ణంలోని ఆలయంలో తవ కామాక్షి, అంజనా కామాక్షి, స్వర్ణ కామాక్షి, ఉత్సవ కామాక్షి.. ఇలా భిన్న రూపాల్లో ఉన్న కామాక్షమ్మను దర్శించుకోవచ్చు. 108 దివ్య దేశాల్లో తిరుకల్వనూర్ పెరుమాళ్ ఆలయం శిథిలం కావడంతో అక్కడి వస్తువులను ఇక్కడికి తీసుకొచ్చారు. అందుకే దివ్య దేశాల్లో ఒకటిగా చెబుతారు.




ధనలక్ష్మీ నమోస్తుతే!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉప్పుగూడ మహంకాళి మాతను మంగళవారం రూ.1.11 లక్షల నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట



భారీ దుర్గామాత విగ్రహానికి గుర్తింపు

సుల్తాన్‌బజార్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇసామియాబజార్‌లోని నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ వీపీజీ మైదానంలో 65 అడుగుల భారీ దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహానికి 'హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డు'లో చోటు దక్కింది. ఉత్సవ సమితి నిర్వాహకుడు గులాబ్ శ్రీనివాస్‌కు అమ్మవారి మండపం వద్ద త్రిదండి రామానుజ జీయర్‌స్వామి, సంస్థ ప్రతినిధి సుమన్ పురస్కారం అందజేశారు.





ఎల్.బి.నగర్

● ఎల్.బి.నగర్ ● మలక్‌పేట

భక్తిశ్రద్ధలతో శ్రీహరి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: సచివాలయనగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండుగగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం తిరువారాధన, సువర్ణ పుష్పార్చన, బాల భోగ నివేదన, తీర్థప్రసాద వితరణ, అభిషేకం, తిరువీధి ఉత్సవం, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ లక్ష్మయ్య, రామలక్ష్మి, శ్యామల, సత్యనారాయణ, పాపారావు, గణపతి పాల్గొన్నారు.



స్వామి ఊరేగింపులో భక్తులు, ఆలయ ప్రతినిధులు

వంద రోజుల్లో ఆయుష్ విజయాల పరంపర

● అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి డాక్టర్ జీపీ ప్రసాద్

సైదాబాద్, న్యూస్‌టుడే: వంద రోజుల లక్ష్యంతో చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) పలు విజయాలు సాధించిందని హైదరాబాద్ ప్రాంతం అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి డాక్టర్ జీపీ ప్రసాద్ తెలిపారు. మలక్‌పేట పరిధి గడ్డిఅన్నారంలో మంగళవారం ఆయన, అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జి.సాకేత్‌రామ్, డాక్టర్ సంతోష్ మానే, డాక్టర్ బిశ్వ రంజన్ దాస్ తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఆయుష్ వైద్య విధానానికి సంబంధించిన రాతప్రతులు, పుస్తకాలు సేకరించి భద్రపరిచేందుకు సంస్థ అంకితమై ఉందన్నారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఎన్ఐఐఎంహెచ్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యపురి ఎస్‌హెచ్‌వోగా జి.వెంకటేశ్వర్‌రావు



నాగోలు, న్యూస్‌టుడే: చైతన్యపురి ఠాణా ఎస్‌హెచ్‌వో జి.వెంకటేశ్వర్లు కుషాయిగూడ ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. నూతన ఎస్‌హెచ్‌వోగా నియమితులైన ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ఆయన నిజామాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నగరంలోని కంచన్‌బాగ్, నల్లకుంట, సైదాబాద్‌లో పనిచేశారు. రాచకొండ పోలీస్ కంట్రోల్ రూంలో పనిచేస్తూ.. తాజాగా ఇక్కడకు బదిలీ అయ్యారు.

వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురం నూతన సీఐగా నియమితులైన శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అశోక్ రెడ్డి సీసీఎస్ క్రైం బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



మాట్లాడుతున్న కిరణ్మయి, వేదికపై అధికారులు

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: గురుకుల విద్యాలయాలు విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక విలువలు నేర్పుతాయని విద్యాసంస్థల ఆర్థిక అధికారి కిరణ్మయి అన్నారు. ఇటీవల నూతనంగా ఎంపికైన అధ్యాపకులకు చైతన్యపురిలోని గురుకుల మహిళా న్యాయ కళాశాల ఆవరణలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. అధ్యాపకులు విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి, దేశ నిర్మాణంలో భాగస్వాములు చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ఇంటి వాతావరణాన్ని కల్పించాలన్నారు. సంస్థ సంయుక్త కార్యదర్శులు అనంతలక్ష్మి, సక్రునాయక్, జోనల్ అధికారి నిర్మల, న్యాయకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మానస, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రభ పాల్గొన్నారు.

బతుకమ్మా.. సాగనంపేదెలాగమ్మా!

● మొదలుకాని తాత్కాలిక కుంటలు, నీటి తొట్ల పనులు

పువ్వులను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు మహిళలంతా ఒక్కచోట చేరి, ఆడి పాడే సంబురం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం. మహిళలు, యువతులు సంతోషంగా తీరొక్క పూలతో అందంగా పేర్చి.. ఆడి పాడి నిమజ్జనం చేస్తారు. అయితే సద్దులు సమీపిస్తున్నా.. అందుకు అవసరమైన తాత్కాలిక కుంటలు, నీటి తొట్ల ఏర్పాటు పనులు కాలనీల్లో ప్రారంభం కాలేదు.

– న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్, ఎల్బీనగర్, సైదాబాద్

చెరువుల వద్దే..

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మూడు సర్కిళ్లలో దాదాపు 800 కాలనీలు ఉన్నాయి. గతంలో సరూర్‌నగర్ చెరువు, బైరామల్‌గూడ చెరువు, మన్సురాబాద్ పెద్ద చెరువు, నాగోలు చెరువు, సాహెబ్‌నగర్ కప్పల చెరువుతో పాటు కాలనీల్లోని కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేవారు. ప్రస్తుతం ఇవన్నీ మురుగుమయంగా మారాయి. ఈ నేపథ్యంలోనే గత కొన్నేళ్లుగా అక్కడక్కడ కాలనీల్లో బతుకమ్మల నిమజ్జనానికి తాత్కాలికంగా నీటి తొట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ ఈసారి వరకూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నేటికీ ఏవిధమైన ఏర్పాట్లు మొదలుకాలేదు. నాగోల్, మన్సురాబాద్, సరూర్‌నగర్ చెరువుల వద్ద మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కాలనీవాసులే తమ తమ ప్రాంతాల్లో తాత్కాలిక నీటి తొట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎంగిలి పువ్వు సందర్భంగా జడ్జీ రోడ్డు వెంకటేశ్వర కాలనీవాసులు ఖాళీస్థలంలో జేసీబీతో గుంత తవ్వించి.. తాత్కాలిక కుంటను ఏర్పాటు చేసుకొని బతుకమ్మలను నిమజ్జనం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే, కాలనీల్లో తగిన ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నారు.



ఏకలవ్యనగర్ హనుమాన్ ఆలయంలో ఏర్పాటుచేసిన కొలను



జడ్జీరోడ్డు వెంకటేశ్వరకాలనీలో ఎంగిలిపువ్వు సందర్భంగా స్థానికులే తవ్వుకున్న గుంత

సైదాబాద్‌లో ప్రత్యేక కొలను..

మలక్‌పేట నియోజకవర్గ మహిళలు గతంలో ఐఎస్ సదన్ డివిజన్ ధోబీఘాట్ వద్ద ఉన్న ఎర్రకుంటలో, సరూర్‌నగర్ చెరువు వద్ద బతుకమ్మను నిమజ్జనం చేసేవారు. ఎర్రకుంటలో వ్యర్థాలతో నిండిపోయింది. సరూర్‌నగర్ దూరభారం కావడంతో స్థానికులు ఎక్కడికక్కడే డ్రమ్ములు, బకెట్లలో నిమజ్జనం చేసేవారు. తాజాగా నిధులు మంజూరు కావడంతో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ పర్యవేక్షణలో సైదాబాద్ ఏకలవ్య నగర్‌లోని హనుమాన్ మందిర ప్రాంగణంలో కొలను నిర్మించారు. రెడ్డి బస్తీ, పూసల బస్తీ, ఏకలవ్య నగర్, మాతృశ్రీ కాలనీ, ఎల్ఐసీ, ఎల్బీహెచ్, మాధవ నగర్ మహిళలకు కొత్త కొలను అందుబాటులో ఉంటుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్:	76759 19030
మలక్‌పేట:	80085 73284
హయత్‌నగర్:	98336 64897
కర్మన్‌ఘాట్:	94400 32872
బండ్లగూడ:	96034 78579
మూసారాంబాగ్:	79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్

? సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి గ్రీన్‌ల్యాండ్ కాలనీ వైపునకు వెళ్లే మార్గంలో టూఆర్టీ ప్రాంతంలో చేతిపంపు వృథాగా ఉంది. మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి. లేనిపక్షంలో అక్కడి నుంచి తొలగించాలి. – ముజీబ్, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, తదనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం. – శ్రవణ్‌కుమార్, మేనేజర్, జలమండలి

స్పందనకు వందనం

చెట్ల కొమ్మల తొలగింపు

సైదాబాద్, న్యూస్‌టుడే: సైదాబాద్ లోకాయుక్త కాలనీ ఉద్యానం వెనక పాదబాటలపై చెట్ల కొమ్మలు పడేశారు. పక్షం రోజులు దాటినా తరలించలేదు. సమస్యను స్థానికులు ఈ నెల 7న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. మలక్‌పేట ఏఎంవోహెచ్ డాక్టర్ పిల్లి అనురాధ స్పందించి, క్షేత్రస్థాయి సిబ్బందితో కొమ్మలు తొలగింపజేశారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సైదాబాద్, న్యూస్‌టుడే: అక్బర్‌బాగ్ పరిధి పల్టాన్ పోస్టాఫీస్ సమీపంలో గత నాలుగు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు సమస్యను ఈ నెల 6న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. బల్దియా వీధి దీపాల విభాగం ఏఈ రాజు స్పందించి, సిబ్బందితో మరమ్మతులు చేయించారు.



మార్కెట్ గల్లీ.. మురుగుతో లొల్లి!

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని రహదారులన్నీ బురదమయంగా మారాయి. మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకొచ్చి రోడ్లపై పారుతుండటం.. ఆపై వాహనాల రాకపోకలతో అధ్వానంగా తయారయ్యాయి. మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, అక్బర్‌బాగ్

మూసీ పరీవాహక ప్రజలకు అండగా ఉంటా



వినతిపత్రం స్వీకరిస్తున్న మధుయాస్కీ

నాగోలు: మూసీ ప్రాంత ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటానని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీగౌడ్ తెలిపారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద సోమవారం రాత్రి స్థానికులతో ఆయన సమావేశమయ్యారు. స్థానికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోతామనే భయాన్ని స్థానికులు వీడాలని సూచించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరం లోపల మూసీ వేరు, ఎల్బీనగర్ పరిధిలో మూసీ వేరన్నారు. ఇక్కడ మూసీ విశాలంగా ఉందన్నారు. ఇళ్లు లేని వైపు భూసేకరణ చేసేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని తెలిపారు. స్థానికులకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్దకు తీసుకెళ్లి మాట్లాడిస్తానని చెప్పారు.

రోడ్లు కబ్జా చేస్తే కఠిన చర్యలు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: రహదారులను కబ్జా చేసి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. టీచర్స్ కాలనీ ఫేజ్-2, ఫేజ్-3లో ఓ వ్యక్తి రోడ్లను కబ్జా చేసి గేదెల షెడ్ నిర్మించి, మురుగును బయటకు వదులుతుండటంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ స్థానికంగా పర్యటించి, సమస్యను పరిశీలించారు. నివాసాల మధ్య నుంచి షెడ్‌ను వెంటనే ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన గోడను తొలగించాలని పేర్కొన్నారు. కాలనీ ప్రతినిధులు జలంధర్‌రెడ్డి, శివ ముదిరాజ్, సాయిరెడ్డి, భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు

ఇంకుడు గుంతలతో జలసంరక్షణ



ప్రచార రథం ప్రారంభంలో కృష్ణాదిశేషు, సురేందర్

వనస్థలిపురం: ఇంకుడు గుంతలతో భూగర్భజల మట్టాలు పెరుగుతాయని కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు అన్నారు. జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీకృష్ణదేవరాయనగర్‌లో మంగళవారం జలసంరక్షణ ప్రచార రథాన్ని కృష్ణాది శేషు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపన ఛైర్మన్ డా.టి.సురేందర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాని సూచించారు. వాసవీక్లబ్ సభ్యులు అచ్యుతరావు, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలి

నాగోలు: దివ్యాంగులకు ఆసరా పింఛన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. నాగోలు డివిజన్ జైపూర్ కాలనీలోని దివ్యాంగుల సామాజిక భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సంఘానికి చెందిన పలువురు నాయకులు మాట్లాడారు. పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమితి ప్రతినిధులు గోపాల్, అందె రాంబాబు, జంగయ్య, సుజాత, మంగమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

వరద కాల్వ పనుల పరిశీలన

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: కాలనీల్లో ముంపు సమస్య లేకుండా చర్యలు చేపడుతామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. ద్వారకాతిరుమల కాలనీ నుంచి పీఎన్ఆర్ కాలనీ రెడ్డి కాలనీ వరకూ చేపట్టిన వరద కాల్వ పనులను మంగళవారం ఆమె, ఏఈ మల్లికార్జున్, ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద సమస్య పరిష్కారానికి చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

సుందర రూపిణి.. సుమధుర భాషిణి



మన్సూరాబాద్ పరిధిలోని సాయినగర్‌లో మహాలక్ష్మీగా..



వెంకటేశ్వర కాలనీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రశాంత్‌నగర్‌లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి



హరిహరక్షేత్రం అయ్యప్ప ఆలయంలో కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో పలు ఆలయాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారు మంగళవారం ప్రత్యేక అలంకరణలో భక్తకోటికి దర్శనమిచ్చింది. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, కాలనీ సంఘాల బాధ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. – న్యూస్‌టుడే యంత్రాంగం



సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లో కార్పొరేటర్ అరుణ



రాఘవేంద్రకాలనీలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, స్థానికులు

యువకుడిపై నుంచి వెళ్లిన లారీ

● కాలు తొలగించిన వైద్యులు

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. మలక్‌పేటకు చెందిన కేశబోయిన అఖిలేశ్ (23) డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు. స్నేహితులతో కలిసి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం నిమజ్జనానికి లారీ అవసరం కావడంతో స్నేహితులతో కలిసి పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నాడు. అక్కడ లారీలను ఆపే క్రమంలో.. విజయవాడ వైపు మార్గంలో టోల్‌బూత్ దాటగానే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి అఖిలేశ్‌ను ఢీకొట్టాడు. అతని కాలు పైనుంచి లారీ టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అఖిలేశ్ కాలును తొడభాగం వరకు తొలగించారు. ఎస్సై లక్ష్మయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ఒకరి అరెస్టు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు చంపుతానంటూ బెదిరించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 28 రాత్రి కానిస్టేబుల్ ఆర్.రాజేందర్‌రెడ్డి ఠాణా పరిధిలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్నాడు. ఆ సమయంలో కుంట్లూర్ ప్రియదర్శిని కాలనీ ప్లాట్ నంబర్-11 వద్ద టిప్పర్లతో మట్టి రవాణా చేస్తున్నట్లు కంట్రోల్ రూంకు ఫిర్యాదు వచ్చింది. విధి నిర్వహణలో ఉన్న రాజేందర్‌రెడ్డి ఘటనాస్థలానికి వెళ్లాడు. అక్కడే ఉన్న పసుమాముల గ్రామానికి చెందిన మోడెపు శ్రీనివాస్ గౌడ్(44) సహా శివ, మధు అనే వ్యక్తులు.. రాయి పట్టుకొని చంపుతానంటూ బెదిరిస్తూ రాజేందర్‌రెడ్డిని దుర్భాషలాడారు. కానిస్టేబుల్ రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాస్‌గౌడ్‌ను రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ఆఫర్లకు ఆశపడితే ఆగమే

● పండుగ వేళ అప్రమత్తత అవసరం

హయత్‌నగర్ న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉంది. సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరకే ఖరీదైన ఫోన్లు, దుస్తులు, ద్విచక్ర వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు అంటూ ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తుంటారు. ఆఫర్లు ఉన్నాయని.. తక్కువ ధరకే వస్తుందని ఆశపడి, లింక్‌లు నొక్కితే.. మొదటికే మోసం వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు

ధర తక్కువంటే ఆలోచించాల్సిందే..

పండుగ సందర్భంగా ప్రత్యేక అవకాశం... ముందుకు స్పందించిన వారికే అవకాశం.. భారీ డిస్కౌంట్లు అంటూ సైబర్ మోసగాళ్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మార్కెట్‌లో ఐఫోన్ ధర రూ.లక్షకు పైగా ఉంటే, 60-70 శాతం తగ్గింపునకే ఇస్తామని ప్రకటనలు ఇస్తున్నారు. కొందరు నేరగాళ్లు.. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌లు రూపొందించి ప్రజలను మోసం చేస్తున్నారు. మరికొందరు టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి, అందులో అమాయకులను చేర్చి.. మోసం చేస్తున్నారు.

హయత్‌నగర్ ఠాణా పరిధిలో..

నమోదైన కేసులు	67
పోగొట్టుకున్న డబ్బు	56,61,961
రికవరీ చేసిన నగదు	4,75,133

(జనవరి నుంచి అక్టోబరు వరకు 8 వరకు..)



యువతకు అవగాహన కల్పిస్తున్న అధికారి

బాధితులు మోసపోయారిలా..


బ్రాహ్మణపల్లికి చెందిన ఓ వ్యక్తికి రూ.5 లక్షల రుణం ఇస్తామని సైబరు నేరగాళ్లు ఫోను చేశారు. అంతకు ముందు అతడి నుంచి బీమా, ఇతర ఖర్చుల పేరిట పలు దఫాలుగా రూ.50 వేలు కట్టించుకున్నారు. అనంతరం ఫోను చేసినా, స్పందించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

● హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీకి చెందిన యువకుడికి మే 22న సామాజిక మాధ్యమాల్లో అమ్మకానికి బైక్ ఉందనే ప్రకటన కనిపించింది. తక్కువ ధరకే వస్తుందనే ఆశపడి, నేరగాళ్లు పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, రూ.13 వేలు పంపి మోసపోయాడు.

● హయత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి పీఎంవై కింద రూ.8 లక్షల రుణం ఇస్తామంటూ ఫోను వచ్చింది. అవతల వ్యక్తులు చెప్పిందంతా నమ్మిన అతడు, ఆన్‌లైన్‌లోనే రూ.98వేలు చెల్లించాడు. అనంతరం మోసపోయినట్లు గ్రహించాడు.

1930కి ఫిర్యాదు చేయాలి..:

–పి.నాగరాజుగౌడ్, సీఐ, హయత్‌నగర్



విద్యాసంస్థలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో ప్రతి నెల నాలుగు సార్లు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. పండుగల సీజన్‌లో ఆన్‌లైన్‌లో అనేక రకాల ప్రకటనలు కనిపిస్తుంటాయి. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ఇస్తామంటే.. ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఈ తరహా ప్రకటనలను నమ్మి, యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు. మోసపోతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెంటనే 1930 నంబరుకు ఫోను చేసి ఫిర్యాదు చేయాలి.

కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో గత పదిహేనేళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.నరసింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. జిల్లా నుంచి పల్లె వరకు అన్నిస్థాయిలో రాష్ట్రంలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 17,541 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 16న ఎన్‌హెచ్‌ఎం డైరెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా, నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత పీఆర్సీ సందర్భంగా రావాల్సిన ఏడు నెలల పీఆర్సీ ఎరియర్స్ నేటికీ అందలేదన్నారు. సంఘం నాయకులు దేవనబోయిన బాపు యాదవ్, సారంగుల బాలసుబ్రహ్మణ్యం, సరికొండా సురేశ్ గౌడ్, నూర సంపత్‌కుమార్, టి.రోహిణి, సింధుజ, జనగామ జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, ప్రధాన కార్యదర్శి గణేశ్ పాల్గొన్నారు.

పోలీసులమని బెదిరిస్తూ వసూళ్లు.. ఇద్దరి అరెస్టు

మద్దిపాడు, న్యూస్‌టుడే: పోలీసులమంటూ బెదిరిస్తూ పలువురి నుంచి రూ.లక్షలు వసూలు చేసిన ఇద్దరు నిందితులను ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అపరిచితవ్యక్తులు తనకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ దొడ్డవరప్పాడు సర్పంచి బెజవాడ రాము గత నెల 20న పోలీసులకు ఫిర్యాదుచేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం బాపట్ల జిల్లా అద్దంకి పట్టణం మారంవారి వీధికి చెందిన పెరుసోముల వీరనారాయణ, పెరుసోముల సత్యనారాయణను అరెస్టు చేశారు. వారిని విచారించగా.. డీజీపీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని, ఫోన్ చేసి బాధితులను బెదిరించి డబ్బులు తీసుకుంటున్నట్లు తేలింది. సినిమా అవకాశాల పేరిట విజయనగరం, ఒంగోలు, తెలంగాణ రాష్ట్రం రాచకొండ ప్రాంతాలకు చెందినవారి నుంచి నగదు వసూలుచేశారు. తమ వద్ద నుంచి రూ.40 లక్షల వసూలు చేశారంటూ ఒంగోలు నగరానికి చెందిన దంపతులు మద్దిపాడు స్టేషన్‌కు వచ్చి వాపోయారు. విజయనగరానికి చెందిన ఓ యువతి నుంచి రూ.9 లక్షల వరకూ వసూలు చేశారు. నిందితులను మంగళవారం సీతారామపురం కొష్టాలు వద్ద అరెస్టు చేశామని, విచారణ నిర్వహించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

'నక్సలైట్లపై అమిత్‌షా ప్రకటన విడ్డూరం'

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: 2026 నాటికి దేశంలో నక్సలైట్లు ఉండరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించటం ఆశ్చర్యంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నుంచి అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని చెప్పారని, నక్సల్ ప్రభావితం లేని ఇతర ప్రాంతాల్లో వెనుకబడిన వారికి కూడా సమానంగా నిధులు కేటాయిస్తామని చెప్పకపోవటం దుర్మార్గమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాజ సమగ్రాభివృద్ధి గురించి ఆలోచించకుండా, కేవలం నక్సలైట్లు ఉన్న అడవి ప్రాంతంపై కేంద్రీకరించడం ఎందుకో చెప్పాలన్నారు. గిరిజనులకు చెందాల్సిన అటవీ సంపదను బడాబాబులకు అప్పగించాలని కేంద్రం కుట్రచేస్తోందన్నారు. భూ కేంద్రీకరణ, ఆర్థిక కేంద్రీకరణ, ఆర్థిక అసమానతలు, దోపిడీ లాంటి సామాజిక రుగ్మతలను పరిష్కరించకుండా నక్సలైట్లను రూపుమాపుతామని ప్రకటించటం అర్థరహితమని పేర్కొన్నారు.

దేవాదాయశాఖ పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు దేవాదాయశాఖ పర్యవేక్షణలో నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఆలయంలో నిధులు దుర్వినియోగమవుతున్నాయని మేకలబండ ప్రాంతానికి గోవింద్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఈ నెల 4న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి, ప్రత్యేక అధికారి గుడిలో ఈ నెల 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలను పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే హుండీ ఆదాయం అసిస్టెంట్ కమిషనర్ బ్యాంకులో డిపాజిట్ చేయాలని సూచించారు. సింహవాహిని మహంకాళీ ఆలయ ట్రస్ట్ కార్యదర్శి, సభ్యులు ఉత్సవాల్లో జోక్యం చేసుకోకుండా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలయానికి సబంధించిన అన్ని పిటిషన్లపై ఈనెల 14న కోర్టులో విచారణ జరుగనుంది.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

శ్రీవారి బ్రహ్మోత్సవ సేవలో నగర కళాకారులు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నగరానికి చెందిన కళాకారుల భజన బృందం శ్రీవారి సేవలో పాల్గొంది. ఆగాపురానికి చెందిన విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సుక్క గణేష్, పోతరాజు అమృత్ కుమార్ నేతృత్వం నాలుగు కళాబృందాలు తిరుమల మాడవీధుల్లో నృత్యాలను ప్రదర్శించాయి.



తిరుమల బ్రహ్మోత్సవాల్లో మాధురి నృత్యం చేస్తున్న నగర కళాకారులు

విజేతలకు బహుమతుల ప్రదానం

గోషామహల్: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గర్బా, దాండియా ఉత్సవాల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంగళవారం బేగంబజార్ డీఐ ఎమ్‌కొండలు బహుమతులు అందజేశారు. ఉత్సవ సమితి చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ, సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ప్రతినిధి చంద్రజిత్‌సింగ్, ఉత్సవ సమితి నేతలు గిరిధారిలాల్ దాగా, మనోజ్‌జైస్వాల్ పాల్గొన్నారు.



చిన్నారికి బహుమతి అందజేస్తున్న డీఐ

బంగారు చీరతో మాత దర్శనం నేటి నుంచి

చాంద్రాయణగుట్ట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేకలబండ నల్లపోచమ్మ దేవాలయంలో ఈ నెల 9 నుంచి 12 వరకు అమ్మవారు బంగారు చీర, కిరీటం, కవచం ధరించి భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ తెలిపారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: గౌలిపురాలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అభిషేకం తిరుమంజనం, అలంకరణ, ప్రత్యేక పూజలు, అంకురార్పణ, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పుణ్యాహవచనం, వైనతేయ పటాధివాసం, మంగళశాసనం, తీర్థ ప్రసాదగోష్ఠి శాత్తుమోరై నిర్వహించారు. సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎం.వి.శేషాద్రి అయ్యంగార్, ప్రధాన పూజారి [illegible] అయ్యంగార్, భక్తులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు స్థానికులకు కేటాయించండి

చాంద్రాయణగుట్ట: జంగమెట్‌లో డబుల్ ఇళ్ల నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జంగమెట్ డివిజన్ కార్యదర్శి ఎ.కృష్ణానాయక్, నాయకులు కిషన్, రామ్‌కుమార్, శ్రీను, బాధితులు మంగళవారం బండ్లగూడ ఉప తహసీల్దార్ రాధికకు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్-మజ్లిస్ ఘర్షణలో పలువురిపై కేసులు

మెహిదీపట్నం, కార్వాన్, న్యూస్‌టుడే: ఆసిఫ్‌నగర్‌లోని ఫిరోజ్‌గాంధీనగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ విషయంలో సోమవారం కాంగ్రెస్-మజ్లిస్ పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు గ్రూపులపై మంగళవారం హుమాయున్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో గ్రూప్-ఏకు చెందిన జాఫర్, సోహెల్, ఇబ్రహీం, షాబాజ్, మజిద్‌హుస్సేన్, వసీం, అహ్మద్, యూసఫ్ అహ్మద్, అహ్మద్ జుబేర్, సయ్యద్ అబ్దుల్ వాహెద్ ఉన్నారు. గ్రూప్-బీలో రెహ్మాన్, మక్సూద్, వసీం, సలాం, ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ మహ్మద్‌ఖాన్, మురళీ, రమేష్, అర్షద్, షానుల్లా ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పిచ్చిమొక్కలు.. పందికొక్కులు

అధ్వానంగా హుడా కాలనీ ఉద్యానం

న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్

ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులోని హుడా కాలనీ ఉద్యానం అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలు, ఏపుగా పెరిగిన చెట్లతో చిట్టడవిని తలపిస్తోంది. పార్కు అభివృద్ధి కోసం ప్రతిపాదనలు ఉన్నా రికార్డులకే పరిమితమయ్యాయి. రెండు దశాబ్దాల కిందట ఏర్పాటైన హుడా కాలనీలో రెండు పార్కులు ఉన్నాయి. పార్కు-1 నిర్వహణ బాగానే ఉన్నా.. రెండో ఉద్యానం దయనీయంగా తయారైంది. ఇక్కడ మొక్కలు ఎండిపోయాయి. పాదబాట దెబ్బతింది. చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.



పార్కులో పాదబాట ఇలా..



కలుపు మొక్కలతో..

ట్రీపార్కు అన్నారు..!.. సుమారు 350 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.3.5 కోట్లు. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు అనేక ప్రయత్నాలు చేశారు. దాని అభివృద్ధిని అడ్డుకున్నారు. అప్పటి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాలనీ ప్రతినిధుల సహకారంలో గ్రేటర్ అధికారులు పార్కును కాపాడారు. దాని చుట్టూ ప్రహరీ, గేటును నిర్మించారు. పార్కులో మొక్కలు నాటి బెంచీలు ఏర్పాటు చేశారు. ఉద్యానం స్థలంపై కన్నేసిన కొందరు మొక్కలు తొలగించడంతో పాటు బోరు పనిచేయకుండా చేశారు. కాపలాదారును బెదిరించారు. దీంతో అయిదేళ్ల కిందట అధికారులు ఈ ఉద్యానాన్ని 'ట్రీ పార్కు'గా ప్రకటించి మొక్కలు నాటారు. కొత్తగా బోరు తవ్వారు. పాదబాటలోని టైల్స్‌ను తొలగించి నిర్వహణను గాలికి వదలిపెట్టారు. ప్రస్తుతం పార్కులో పిచ్చిమొక్కలు పెరిగాయి. పందికొక్కులు సంచరిస్తున్నాయి.

అసాంఘికశక్తులకు అడ్డా..

ఆసిఫ్‌నగర్ హుడాపార్కు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. చీకటి పడిదంటే ఆకతాయిలు ఉద్యానంలో హంగామా చేస్తున్నారు. గంజాయి, మద్యం తాగుతూ అర్ధరాత్రి వరకు ఉంటున్నారు. పార్కు రక్షణ కోసం నియమించిన కాపలదారు సాయంత్రం గేటుకు తాళం వేయగానే చీకటి కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. పార్కులో గంజాయి తాగుతున్న పలువురిని ఆసిఫ్‌నగర్ పోలీసులు గతంలో అరెస్టు చేశారు. మెహిదీపట్నం సర్కిల్ ఉద్యాన అధికారి దృష్టికి తీసుకెళ్లగా ట్రీ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

సుల్తాన్‌బజార్, గోషామహల్, న్యూస్‌టుడే

? ఇసామియాబజార్, సంతోషిమాత ఆలయం లేన్, మెహర్‌బాబా లేన్, బడీచౌడి, కుత్బిగూడ, రంగ్‌మహల్, గౌలిగూడ, ట్రూప్‌బజార్, హనుమాన్ టేక్డీ, పుత్లీబౌలి ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు.
– రాజేందర్‌కుమార్, రాజ్‌కుమార్ శ్రీవాత్సవ, పుట్ట యాదగిరిగౌడ్, స్థానికులు

✓ ఆయా ప్రాంతాల్లో పరిశీలించి పాడైపోయిన వాటికి మరమ్మతులు, కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– నాగమణి, డీఈ, వీధి దీపాల విభాగం

? పురానాపూల్ గాంధీ విగ్రహం నుంచి ధూల్‌పేట, మంగళ్‌హాట్ మీదుగా బోయిగూడకమాన్ వరకు ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టక ఇబ్బందులు పడుతున్నాం. **– మనోజ్‌సింగ్, జాలీహనుమాన్**

✓ రోడ్డు విస్తరణకు స్థానికుల సహకారం అవసరం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.
– మంజులాసింగ్, ఏసీపీ, పట్టణ ప్రణాళిక విభాగం

? హిందీనగర్‌లో ఆలయం ఎదుట, గోషామహల్ మద్యం దుకాణం ఎదురుగా నిత్యం మురుగు పొంగిపొర్లుతోంది. **– రవీందర్‌రెడ్డి, గోషామహల్**

✓ కొత్త పైపులైను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.
– జాన్‌షరీఫ్, జీఎం, జలమండలి

ఉత్సవాలకు నీటి కొలనుల ఏర్పాట్లు



కొలనును పరిశీలిస్తున్న కార్పొరేటర్

కార్వాన్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. కార్వాన్‌లోని గిర్నిపల్లి, కేసరి హనుమాన్ ఆలయ ప్రాంతాల్లో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు ఏర్పాటు చేస్తున్న నీటి కొలనులను మంగళవారం వారు పరిశీలించారు. జీహెచ్ఎంసీ ఈఈ వెంకటశేషయ్య, ఏఈ జె.శ్రీకాంత్‌గౌడ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ టి.వినోద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపించొద్దు

ఆకస్మిక తనిఖీల్లో కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం



రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్‌కు సూచనలు చేస్తోన్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు, హైదరాబాద్: రహదారులపై వ్యర్థాలు కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మరోమారు స్పష్టంచేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఆమె మంగళవారం చార్మినార్ జోన్‌లోని అత్తాపూర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్, మీరాలం చెరువు, బహదూర్‌పుర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులు ఉదయం క్షేత్రస్థాయిలో తిరుగుతూ రోడ్లపై చెత్త, వీధుల్లో అపరిశుభ్రత లేకుండా పని చేయించాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణలోని స్వచ్ఛ ఆటోలు, రోడ్లపై వ్యర్థాలను తొలగించే వాహనాలపై నిఘా పెట్టాలన్నారు. కార్మికులంతా విధుల్లో ఉండేట్టు హాజరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలను వేగంగా పూడ్చాలని, వ్యాపార కేంద్రాల్లోని వ్యర్థాలను రోజూ సేకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌ను ఆదేశించారు.

'వారసత్వ భవనాలు కూల్చివేయడం దుర్మార్గం'



కొవ్వొత్తుల ప్రదర్శనలో షేక్ హుస్సేన్, అజీజ్‌పాషా, శంకర్‌నాయక్

అబిడ్స్, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లో భాజపా సర్కారు అభివృద్ధి పేరిట వారణాసిలోని గాంధీ సామాజిక సేవా సంస్థ అఖిల భారత సర్వసేవా సంఘ్‌కు చెందిన 12 వారసత్వ భవనాలను కూల్చివేయడం దుర్మార్గమని సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ అన్నారు. కట్టడాల కూల్చివేతలను నిరసిస్తూ తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నాంపల్లి గాంధీభవన్ ఆవరణలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కొవ్వొత్తులు వెలిగించి మౌన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, కార్యదర్శులు రామ్మోహన్, రూప్‌సింగ్, ఉపాధ్యక్షుడు చందు, కోశాధికారి గోపాల్‌రావు, యువ విభాగం అధ్యక్షుడు భాస్కర్, మహిళా విభాగం అధ్యక్షురాలు యాదమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సామరస్యంగా సంప్రదాయ ఉత్సవాలు



మీర్‌చౌక్‌లో ప్రసంగిస్తున్న డీసీపీ స్నేహామెహ్రా

చార్మినార్, న్యూస్‌టుడే: పాతనగరంలో సామరస్యంగా సంప్రదాయ ఉత్సవాలు కొనసాగుతాయని దక్షిణ మండలం డీసీపీ స్నేహామెహ్రా పేర్కొన్నారు. ఉత్సవాలు శాంతియుత వాతవరణంలో కొనసాగడానికి ప్రజలు పోలీసులకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా వేడుకలకు అవసరమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు. మీర్‌చౌక్ బడాబజార్‌లోని సంజరీ హాల్‌లో సోమవారం రాత్రి దక్షిణ మండలం పోలీసులు, శాంతిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయ ఉత్సవాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో డీసీపీని శాంతి సంఘం ప్రతినిధులు సన్మానించారు. అదనపు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్, మీర్‌చౌక్, ఫలక్‌నుమా, చత్రినాక ఏసీపీలు పి.చంద్రశేఖర్, ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.ఎ.జావీద్, సీహెచ్ చంద్రశేఖర్, శాంతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాజా అబ్దుల్‌మోహిద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రామరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీకృష్ణశర్మ, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడలో..



కాత్యాయిని దేవి అలంకరణలో



ఫలక్‌నుమా కాళీమాత



చాంద్రాయణగుట్టలో దేవీదేవాలయ మాత



జియాగూడలో నోట్లతో..



చాంద్రాయణగుట్టలో జాగరణ్‌లో..

కుంకుమార్చనలు.. ప్రత్యేక పూజలు

పాతనగరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అన్నదానాలు జరిపారు.

– న్యూస్‌టుడే, బృందం



దేవీ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



కార్వాన్‌లో.. ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, పరమేశ్వర్‌రావు



ఛత్రినాక వివేకానందనగర్‌లో...



గౌలిపుర ఆలయంలో..



చాంద్రాయణగుట్ట నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

చిత్రం దిగి.. సందడి చేసి



చార్మినార్ ఎదుట మేకల హర్షిణి, హన్నా రాథోడ్



బాడీబిల్డర్లు షఫక్, ఇంతియాజ్‌ఫారూఖ్, రియాజ్, సిద్దిఖ్

చార్మినార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ మోతీనగర్‌కు చెందిన మేకల హర్షిణి, స్పెయిన్‌లో ఉండే అనంతపూర్‌కు చెందిన తన స్నేహితురాలు హన్నా రాథోడ్‌తో కలిసి మంగళవారం చార్మినార్‌కు వచ్చారు. ఇక్కడ షాపింగ్ చేసి చార్మినార్ ఎదుట 'మిస్ యూనివర్స్' ట్రంక్ షాహస్ పట్టీని ధరించారు. ఫొటోలకు ఫోజులిచ్చారు. నవంబరులో దిల్లీలో జరిగే మిస్ యూనివర్స్ అంతర్జాతీయ అందాల పోటీల్లో పాలుపంచుకోవడానికి తన స్నేహితురాలు హన్నా రాథోడ్‌తో పాటు సిద్ధంగా ఉన్నానని మేకల హర్షిణి తెలిపారు. ● ఖతర్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన మిత్రులు చార్మినార్ సందర్శనకు వచ్చారు. దాన్ని వీక్షించిన అనంతరం ఫొటోలకు ఫోజులిచ్చారు. వారిలో ఖతర్‌కు చెందిన షఫక్, ముంబాయికి చెందిన మోడల్ ఆర్టిస్టు ఇంతియాజ్‌ఫారూక్, బెంగళూరుకు చెందిన షూటర్ రియాజ్, కేరళకు చెందిన సిద్ధిక్ ఉన్నారు.

హరియాణాలో గెలుపు.. నాంపల్లిలో సంబరం



ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా అత్యధిక అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించడంతో నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కొండేటి శ్రీధర్, ప్రేంసింగ్‌రాథోడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొని మిఠాయిలు పంపిణీ చేశారు. పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ హరియాణాలో కాంగ్రెస్ దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి భాజపాకు హ్యాట్రిక్ విజయాన్ని అందించారని తెలిపారు. కశ్మీర్‌లో సైతం కాషాయ జెండా రెపరెపలాడిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోనూ భాజపా అధికారంలోకి వస్తుందన్నారు. భాజపా సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ హరియాణాలో ప్రజలు అభివృద్ధికి ఓటేశారని, ఇది నరేంద్రమోదీ విజయంగా అభివర్ణించారు. ఈసీపై కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు అసంబద్ధమైనవని, రానున్న రోజుల్లో జమ్మూ కశ్మీర్‌లో మార్పులు వస్తాయని తెలిపారు.

చెరువులుంటేనే భావి తరాలకు బతుకమ్మ

టీజీవో భవన్‌లో సంబరాల్లో మంత్రి సీతక్క



నాంపల్లి టీజీవో భవన్‌లో మంత్రి సీతక్క



టీఎన్‌జీవో కార్యాలయంలో..



జీహెచ్ఎంసీ కార్యాలయ ఆవరణలో.. మేయర్

ఈనాడు, హైదరాబాద్: మన పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతి బతుకమ్మ అని, భవిష్యత్తు తరాలకు ఈ పండగను అందించాలని నీటి వనరులైన చెరువులు, కుంటలను రక్షించాలని రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నాంపల్లిలోని టీజీవో భవన్‌లో మంగళవారం జరిగిన బతుకమ్మ సంబరాల్లో మంత్రి ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. హైదరాబాద్‌లోని వివిధ శాఖల నుంచి మహిళా అధికారులు వందల మంది బతుకమ్మలతో వచ్చి భక్తిశ్రద్ధలతో గౌరమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నీటి వనరులను కబ్జాల నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. కార్పొరేషన్ ఛైర్‌పర్సన్లు బండ్రు శోభారాణి, కాలువ సుజాత, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దీపారెడ్డి, ప్రతినిధులు శిరీష, సుజాత, పూనమ్, జయశ్రీ, రేవతి, లావణ్య, సబిత తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో కార్యాలయంలో.. టీఎన్‌జీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఘనంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి మహిళా అధికారులు పాల్గొన్నారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, సహ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, మహిళా నేతలు ఉమాదేవి, శైలజ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

● పాతనగరంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆటాపాటలతో సందడి చేశారు.



కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ వైద్యకేంద్రంలో...



ఆసిఫ్‌నగర్ రవీంద్రనగర్ అంగన్‌వాడీలో..



ఆబ్కారీ భవన్‌లో.. ఈఎస్ కృష్ణప్రియ

వంద రోజుల్లో ఆయుష్ విజయాల పరంపర

సైదాబాద్: వంద రోజుల లక్ష్యంతో చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) విజయాలు సాధించిందని హైదరాబాద్ ప్రాంతం అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి డాక్టర్ జీపీ ప్రసాద్ తెలిపారు. మలక్‌పేట పరిధి గడ్డిఅన్నారంలో మంగళవారం అధికారులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

ఎసైన్డ్ భూముల్లో బోర్డులు తొలగించిన స్థిరాస్తి వ్యాపారులు

శంషాబాద్: శంషాబాద్ మండలం మదనపల్లి రెవెన్యూ సం50లోని ఎసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని జీవీల రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో ప్రభుత్వానివి అంటూ బోర్డులు పాతారు. అనుమతి లేకుండా ఆ భూముల్లో ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలను సైతం అందులో రాశారు. వెనక్కి తగ్గాల్సిన స్థిరాస్తి వ్యాపారులు కొందరు తాజాగా వాటిని తొలగించి వారికి చెందినవిగా బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికంగా కలకలం రేగుతోంది. ప్రభుత్వ భూముల్లో పాతిన బోర్డులను తొలగించిన స్థిరాస్తి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంలో అంతర్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్యాక్రాంతం అవుతున్న మదనపల్లి ఎసైన్డ్ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై శంషాబాద్ తహసీల్దార్ 'రవీందర్‌దత్తు'ను సెల్‌ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అభివృద్ధి పేరుతో ఇబ్బంది పెట్టం: వీర్లపల్లి



దర్గా రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టే పని కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరులోని జేపీ దర్గా, కమ్మరిగూడ రహదారులను మంగళవారం ఆయన పరిశీలించారు. హెచ్‌ఎండీఏ కింద జేపీ దర్గా రోడ్డుకు రూ.18 కోట్లు, కమ్మరిగూడ రోడ్డుకు రూ.32 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు రహదారి విస్తరణ ఇటీవల సర్వే పనులు చేపట్టారు. 100 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించడం వల్ల ఇళ్లు, స్థలాలు కోల్పోవాల్సి వస్తుందని బాధితులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఆయన పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా వీర్లపల్లి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, దేవేందర్, జనార్దన్‌చారి, నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు అమలు చేశాకే ఉద్యోగ భర్తీ చేపట్టాలి: ఎమ్మార్పీఎస్

శంషాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు అమలు చేశాకే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జన సమీకరణలో భాగంగా మంగళవారం ఆయన శంషాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే మాదిగ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కె.రమేశ్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన వంతెన నిర్మాణం.. అవస్థల్లో జనం

కొండుర్గు మండలం వెంకిర్యాల, తంగెళ్లపల్లిల మధ్య..

కొందుర్గు, న్యూస్‌టుడే: కొందుర్గు మండలంలో వెంకిర్యాల, తంగెళ్లపల్లి గ్రామాల మధ్య వాగుపై నిర్మించనున్న వంతెన పనులు నిలిచిపోవడంతో అటుగా ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో కష్టాలు మరీ తీవ్రంగా ఉంటున్నాయి. వెంకిర్యాల, తంగెళ్లపల్లిల మధ్య పాతవంతెన నిర్మాణం కుంగి పోవడంతో కొత్తది నిర్మించడానికి అప్పటి భారాస సర్కారు రూ.3.20 కోట్లను మంజూరు చేసింది. దీంతో 2023 జూన్23న నాటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆ పనులకు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే వర్షాలు తీవ్రం కావడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఆపై వంతెన నిర్మాణ డిజైన్ మార్పుతో అర్ధాంతరంగా నిలిచింది. ఈ వర్షాకాలం సీజన్‌లో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు రెండు పర్యాయాలు వాగు ఉద్ధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. వాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు సైతం కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఏళ్లుగా వంతెన నిర్మాణం కాకపోవడంతో వర్షాకాలంలో ఈ రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఇప్పటికైనా పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నూతన డిజైన్ ప్రకారం చేపట్టిన పనులు (పాత చిత్రం)

రీడిజైనింగ్ మార్పులు ఇలా..

వంతెన నిర్మాణానికి మొదట అనుకున్న డిజైన్‌లో సమూల మార్పులు చేసి రోడ్డుకు సరైన ఎత్తులో వంతెన ఉండేలా కొత్తడిజైన్ రూపొందించారు. 40 మీటర్ల పొడవు ఏడు మీటర్ల ఎత్తు ఉండేలా మార్పులు చేశారు. అప్పటి ఈఎన్సీ మోహన్‌నాయక్ వంతెన డిజైన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ప్రస్తుత ఈఎన్సీ రవీందర్‌రావు పనుల పురోగతిని సమీక్షించినట్లు, వర్షాలు తగ్గగానే పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని షాద్‌నగర్ ఆర్‌అండ్‌బీ డీఈ రవీంద్ర కుమార్ తెలిపారు.

వర్షం వస్తే బాలాజీ నగర్‌వాసులకు జాగారమే

నార్సింగిలో ఇళ్లలోకి వరద



వర్షం పడినపుడు బాలాజీనగర్ కాలనీ రహదారి ఇలా వరదతో నిండిపోతున్న దుస్థితి

నార్సింగి, న్యూస్‌టుడే: ఇటీవల రోజూ ఏదో ఓ సమయంలో వర్షం కురుస్తుండటంతో జనం పలురకాలుగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల రహదారులపై వరద నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండగా మరికొన్ని చోట్ల ఇళ్లలోకి నీరు చేరి నివాసితులు అవస్థలు పడుతున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధి మంచిరేవుల బాలాజీనగర్ కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం కురిసిన ప్రతిసారీ కాలనీలోని రోడ్లు వరదతో నిండిపోతున్నాయి. ఒక్కోమారు వరద ఇళ్లలోకి చేరుతుండడంతో నివాసితులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి వేళలో అయితే జాగారం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. నార్సింగి పట్టణానికి సంబంధించి డ్రైనేజీ, వర్షపు నీరు ఒకే కాలువ ద్వారా దిగువకు వస్తుండటంతో అది కాలనీలోకి చేరుతోంది. నాలుగైదేళ్లుగా ఈ సమస్య నెలకొందని స్థానికులు చెబుతున్నారు.

ఎగువ నుంచి వచ్చే వరద ఎక్కడికక్కడ రెండు మూడు చోట్ల నుంచి మూసీలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందంటున్నారు. ఇటీవల పలుమార్లు కురిసిన భారీ వర్షాలతో బాలాజీనగర్ కాలనీలో వీధులన్నీ జలమయమయ్యాయని, ఇళ్లలోకి నీరు చేరిందని స్థానికుడైన దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డీఈ నరసింహారాజును 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా.. బాలాజీనగర్ కాలనీలో వరద సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2లో రూ.7.63 కోట్లు జీహెచ్ఎంసీ ద్వారా మంజూరయ్యాయన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బండ్లగూడజాగీర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బండ్లగూడజాగీర్ మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. మంగళవారం అయిదో డివిజన్‌లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులున్నారు.

షాదీఖానా నిర్మాణానికి స్థల పరిశీలన

జిలేడుచౌదరిగూడెం: జిల్లేడు చౌదరిగూడెం మండల కేంద్రంలో షాదీఖానా నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ నిర్మాణాన్ని మైనార్టీ కార్పొరేషన్ ద్వారా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. స్థల పరిశీలనలో ఆయన వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈ వంశీకృష్ణ, మైనార్టీ నాయకులు ఎండి ఎజాస్‌అలీ, మహమూద్, సలీం తదితరులున్నారు.



శంషాబాద్ మండలం నర్కూడలోని అమ్మపల్లి సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నీరటి తన్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడి సందడి చేశారు.

–న్యూస్‌టుడే, శంషాబాద్

ఆలయ స్థలం మూసివేతపై భాజపా నేతల ఆందోళన

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ డివిజన్ శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో శివాలయంలోకి వెళ్లకుండా ఉద్యాన కళాశాల అధికారులు గోడ నిర్మించడాన్ని నిరసిస్తూ భాజపా నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బాల్‌రెడ్డి, బాబురావు, మల్లేష్‌యాదవ్ తదితరులు శివరాంపల్లి నుంచి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ ఉద్యాన కళాశాల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... పురాతనకాలం నుంచి ఉన్న ఆలయాన్ని తెరిపించాలని డిమాండ్ చేశారు. అక్కడినుంచే వర్సిటీ ఉన్నతాధికారులతో సెల్‌ఫోన్‌లో చర్చించారు. గోడను తొలగించి వీకర్‌సెక్షన్ కాలనీ వాసులు ప్రతిరోజు ఆలయంలో పూజలు చేసేలా అక్కడ గేటు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. దీనిపై విశ్వవిద్యాలయ అధికారులంతా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, బాలకృష్ణ, జోగిరవి, సోల్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీకర్‌సెక్షన్ కాలనీకి ర్యాలీగా వెళ్తున్న భాజపా నాయకులు

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

నార్సింగి: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని నార్సింగి ఎస్సై మురళి అన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా నార్సింగి డివిజన్ ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఖానాపూర్‌లో వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఇన్‌స్పెక్టర్ హరి క్రిష్టారెడ్డి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అజీజ్‌నగర్ జట్టు విన్నర్‌గా, వట్టినాగులపల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఖానాపూర్ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచి నర్సింహులతో కలిసి ఎస్సై మురళి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, యూత్ సభ్యులు హరికాంత్, బంటి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి చర్యలు: ఎమ్మెల్యే

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: నూతన విద్యా విధానం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన గండిపేట మండల విద్యావనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.లత, ఎంఈవో విజయ్‌కుమార్, బొర్రరాందాస్‌ముదిరాజ్, లంకల నిఖిలాసంగారెడ్డి, శ్రీలతాసురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, మల్లేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపించొద్దు: ఆమ్రపాలి



రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌కు సూచనలు చేస్తున్న కమిషనర్

ఈనాడు, హైదరాబాద్: రహదారులపై వ్యర్థాలు కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మరోమారు స్పష్టం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఆమె మంగళవారం చార్మినార్ జోన్‌లోని అత్తాపూర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్, మీరాలం చెరువు, బహదూర్‌పుర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులు ఉదయం క్షేత్రస్థాయిలో తిరుగుతూ రోడ్లపై చెత్త, వీధుల్లో అపరిశుభ్రత లేకుండా పని చేయించాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణలోని స్వచ్ఛ ఆటోలు, రోడ్లపై వ్యర్థాలను తొలగించే వాహనాలపై నిఘా పెట్టాలన్నారు. కార్మికులంతా విధుల్లో ఉండేట్టు హాజరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలను వేగంగా పూడ్చాలని, వ్యాపార కేంద్రాల్లోని వ్యర్థాలను రోజూ సేకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌ను ఆదేశించారు.

కరుణ చూపమ్మా.. లక్ష్మీదేవమ్మ




బండ్లగూడజాగీర్‌లో మహాలక్ష్మీదేవి రూపంలో..

మణికొండ, బండ్లగూడజాగీర్, కాటేదాన్, షాద్‌నగర్ న్యూటౌన్, నందిగామ, కొందుర్గు, న్యూస్‌టుడే: కరుణ చూపమ్మా లక్ష్మీదేవమ్మా అంటూ భక్తులు అమ్మవారిని కొలిచారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పలు చోట్ల సామూహిక కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని రూ.29,77,777 నగదుతో, శివమారుతీ గీతామందిరంలో రూ.1,11,111 నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. కాటేదాన్‌లోని బాబుల్‌రెడ్డి నగర్‌లో నవదుర్గ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, నందిగామ మండలం రంగాపూరు, కొందుర్గు మండలం మహదేవపూర్‌లలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌లు పాల్గొని పూజలు చేశారు.



షాద్‌నగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో



షాద్‌నగర్‌లోని శివమారుతి గీతా మందిరంలో



కొందుర్గులోని దర్గామాత మండపం వద్ద నవీన్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌లకు సత్కారం



పద్మశాలిపురం శివమార్కండేయ సీతారామాంజనేయ ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు



మణికొండలోని శివాజీనగర్ మండపంలో వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు



షాద్‌నగర్ బైపాస్ రోడ్డులోని బంగారు మైసమ్మ దేవాలయంలో..

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

కొత్తూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ దివ్యాంగ యువతీయువకులకు సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐటీఈఎస్ (కంప్యూటర్, బీపీఓ, సాఫ్ట్ స్కిల్స్) కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ నల్లపు శ్రవణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు సైతం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18- 35 సంవత్సరాల వయస్సు కలిగి పదోతరగతి ఆపై చదివినవారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి మెమో, ఆధార్ కార్డు, సదరం, కులం, ఆదాయం పత్రాలతో నాగోల్‌లోని బండ్లగూడ సమర్థనం ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. మరింత సమాచారానికి 63648 67804 నంబరులో సంప్రదించాలని కోరారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఊరేగింపు ముందు మహిళల కోలాటం

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి శేష వాహన సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఊరేగింపులో మహిళల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మూసీపైనే కాంగ్రెస్ నాయకులకు మక్కువ: భారాస

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మకమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి పాతర పెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుందరీకరణ పేరిట మూసీలో మునిగి తేలుతున్నారని భారాస నాయకులు విమర్శించారు. షాద్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకుడు రాజీవరప్రసాద్ మాట్లాడుతూ.. హైడ్రా పేరిట నిరుపేదల ఇళ్లు కూలుస్తుంటే కమ్యూనిస్టులు, ప్రజాసంఘాల నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డగా పరిచయం చేసుకుని, ఇక్కడ 12 స్థానాలు గెలిచిన రేవంత్‌రెడ్డి రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే పాలమూరు ప్రాజెక్టును విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎంను విమర్శించే స్థాయి వారికి లేదు: కాంగ్రెస్

షాద్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి భారాస నేత రాజావర ప్రసాద్‌కు లేదని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా ఛైర్మన్ శీనునాయక్, నవీన్ తదితరులు మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్నా పాలమూరు ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును భారాస నాయకులు పూర్తి చేయలేకపోయారన్నారు. ఆక్రమణలను సీఎం తొలగిస్తుంటే భారాస నాయకులు వారిని వెనకేసుకొస్తున్నారన్నారు.

భాజపా వైపే ప్రజల చూపు: పీవీఆర్

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, అందుకే పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి అధిక సంఖ్యలో ప్రజలు ముందుకు వస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పురపాలిక చటాన్‌పల్లిలో మంగళవారం పార్టీ నాయకుడు అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చేందుకు ప్రజలు ముందుకు వస్తుండడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

కొత్తూరు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన శివకుమార్(30) గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపంతో తనువు చాలించినట్లు తెలిసింది. తండ్రి యాదయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నవరాత్రి బొమ్మల కొలువు



నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఇంట్లో ఆకట్టుకొనే బొమ్మలకొలువును ఏర్పాటు చేసింది ఓ తమిళ కుటుంబ సభ్యులు. తమిళనాడులో నవరాత్రుల సందర్భంగా ఇలాంటి బొమ్మలకొలువు ఏర్పాటు చేస్తారని వారు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి రాయల్‌కాలనీలో నివాసం ఉండే శ్రీధరన్, పద్మావతి దంపతులు ఏటా నవరాత్రులసందర్భంగా ఇలాంటి బొమ్మల కొలువు ఏర్పాటుచేసి పూజలు చేస్తారు.

-న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

డంపింగ్ యార్డు నుంచి విముక్తి కల్పించాలని వినతి



కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం ఇస్తున్న సోలీపూర్ గ్రామస్థులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసన, వాయు కాలుష్యం నుంచి తమను కాపాడాలని షాద్‌నగర్‌లోని ఐదోవార్డు సోలీపుర గ్రామస్థులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం ఇచ్చారు. డంపింగ్‌యార్డ్ నుంచి కొంతకాలంగా వస్తున్న విష కీటకాలు, విపరీతమైన దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతోపాటు పాడి పశువులు, మూగజీవులు వింత రోగాల బారిన పడుతున్నాయన్నారు. మరోపక్క భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. డంపింగ్‌యార్డ్‌ను తమ వార్డు పరిసరాల నుంచి తొలగించాలని వారుకోరారు. కార్యక్రమంలో సింగపాగ జంగయ్య, వెంకటేష్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటేష్, నర్సింహులు, సోమ్లానాయక్, రమేష్‌పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి: సీఐటీయూ

షాబాద్, న్యూస్‌టుడే: అంతారం వాటర్‌గ్రిడ్‌లో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో అంతారం వాటర్‌గ్రిడ్ ఎదుట కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒప్పంద కార్మికులకు జీతాలు ఇవ్వాల్సిన ఏజెన్సీలు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. వాటిని తొలగించి వెంటనే కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

ప్రత్యంగిరా అమ్మవారికి మంగళసూత్రాల వితరణ

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన ప్రత్యంగిరా మాతకు భక్తులు డా.రాజశేఖర్, లీలా సరస్వతీ దంపతులు.. మంగళవారం అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు.. వారికి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు.



దాతలు రాజశేఖర్, లీలా సరస్వతీ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు

శివాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు

మహేశ్వరం, న్యూస్‌టుడే: మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట నియోజకవర్గ భాజపా బాధ్యులు అందెల శ్రీరాములు యాదవ్, కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్‌యాదవ్ ఉన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అశోక్‌కుమార్.. ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో ఈవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భాజపా నేతలు

సీఎం సహాయనిధి అందజేత

మంచాల, న్యూస్‌టుడే: మంచాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 68 మందికి రూ.2.27 కోట్ల సీఎం సహాయనిధి చెక్కులు అందించినట్లు మంచాల కాంగ్రెస్ అధ్యక్షులు విజమూరి రాంరెడ్డి తెలిపారు.

మంచాల ప్రత్యేకాధికారిగా సుజాత

మంచాల, న్యూస్‌టుడే: మంచాల మండల ప్రత్యేకాధికారిగా ఎం.సుజాత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులతో సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె చెప్పారు.

బదిలీపై వెళుతున్న ఇన్‌స్పెక్టర్లకు సన్మానం

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధు సోమవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం వారిని సత్కరించారు.

ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐగా కృష్ణంరాజు

యాచారం, న్యూస్‌టుడే: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐగా లిక్కి కృష్ణంరాజు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన మహేశ్వరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆధ్యాత్మిక కేంద్రం.. అయ్యసాగరం క్షేత్రం

పచ్చని పరిసరాల మధ్య ఇలవేల్పు



సీతారామాంజనేయస్వామి ఆలయం



యోగా శిక్షణ శిబిరంలో విద్యార్థులు

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లు మండలంలోని అయ్యసాగరం క్షేత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులకు ఆధ్యాత్మికను పంచుతోంది. ప్రకృతి సౌందర్యం మధ్య ఉన్న ఈ క్షేత్రానికి విచ్చేసే భక్తులు మరచిపోలేని అనుభూతిని సొంతం చేసుకుంటారు. భక్తులు, పర్యాటకులు, వేసవి విడిదికి వచ్చే విద్యార్థులు, సభలు, సమావేశాలు, ఆధ్మాతిక కార్యక్రమాలు నిర్వహించే వారిని ఈ ప్రాంతం ఆకర్షిస్తోంది. కొండపై అటవీ ప్రాంతంలో వీరభద్రస్వామి, సరస్వతీదేవి ఆలయాలు, కొండ దిగువ భాగంలో త్రిపురాంతకేశ్వర, సీతారామాంజనేయస్వామి ఆలయాలు కొలువై ఉన్నాయి. ఈ ఆధ్యాత్మిక క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. విద్యార్థులకు ప్రేరణ తరగతులు, యోగ శిక్షణ కేంద్రంగానూ గుర్తింపు పొందుతోంది. ఈ క్షేత్రంలో కొలువైన వీరభద్రస్వామి భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి. సంతానం లేని వారు ఇక్కడ పూజలు చేస్తే సంతానయోగం కలుగుతుందని భక్తులు నమ్ముతారు. ఇలా భక్తుల ఇలవేల్పుగా వీరభద్రస్వామి పూజలందుకుంటున్నారు.

హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిలో..

హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిలో నగరానికి 50 కిలోమీటర్ల దూరంలోని ఆమనగల్లుకు ఆరు కిలోమీటర్ల సమీపంలో అయ్యసాగరం క్షేత్రం ఉంది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ తదితర ప్రాంతాల భక్తులు, స్వచ్ఛంద సంస్థల సహాయంతో క్షేత్రంలో వృద్ధాశ్రమం, రామాలయం, వీరభద్రస్వామి, సరస్వతీదేవి, ఆంజనేయస్వామి తదితర ఆలయాలు, దేవతా మూర్తులను ప్రతిష్ఠించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఇక్కడి ఆలయ కమిటీ కల్పిస్తోంది. కల్యాణ మండపం, సత్రాలు, గదులు నిర్మించడంతో పాటు తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునేలా పెద్ద ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. మాజీ ఎంపీ మంద జగన్నాథం, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో తమవంతుగా క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కొండపై ఉన్న ఆలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన రూ.కోటి వెచ్చించి నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించారు. క్షేత్రంలోని త్రిపురాంతకేశ్వరస్వామికి నిత్యపూజలతో పాటు వీరభద్రస్వామి ఆలయంలో రోజు సామూహిక వ్రతాలు జరిగేలా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. క్షేత్రంలో ఆంజనేయస్వామి విగ్రహం, భారీ నందీశ్వరుడి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమనగల్, కల్వకుర్తి 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే

ఆర్కేపురం, కందుకూరు, తుర్కయాంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే:

? ఆర్కేపురం డివిజన్‌లోని హరిపురి కాలనీ, ఎన్టీఆర్ నగర్‌లో వీధి దీపాలు వెలుగుతున్నాయి. – ప్రజ్ఞ, ఎన్టీఆర్ నగర్
✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం– సుజాత, సరూర్‌నగర్ సర్కిల్, డీసీ
? కందుకూరులో ప్రతి ఆదివారం నిర్వహించే వారాంతపు సంతలో కనీస వసతులు లేక మహిళలు ఇబ్బందులుపడుతున్నారు. – వెంకటేశ్, కందుకూరు
✓ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతాం.– సరిత, ఎంపీడీవో
? రాగన్నగూడ సాయి టౌన్‌షిప్ కాలనీలో వీధి దీపాలు వెలగట్లేదు. –మల్లేష్, స్థానికుడు
✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ

మంచాల, మీర్‌పేట న్యూస్‌టుడే:

? బండలేమూర్ - పోల్కంపల్లి వరకు రహదారి అధ్వానంగా మారింది. –కృష్ణ, బండలేమూర్
✓ రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు రావాల్సివుంది. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం. –అబ్బాస్(డీఈ) ఇబ్రహీంపట్నం
? మీర్‌పేట పెద్దచెరువు కట్ట మీద రహదారి పక్కన వ్యర్థాలు పారేస్తున్నారు. దుర్గంధం వ్యాపిస్తోంది. – ఎం.రంజిత్‌కుమార్, శివసాయినగర్‌కాలనీ, మీర్‌పేట
✓ వ్యర్థాలు వెంటనే తొలగిస్తాం. – దుర్గదీప్‌లాల్, మేయర్, మీర్‌పేట

ఇజ్రాయెల్ దాడులు నిలిపేయాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంతో ఇప్పటికే 41వేల మంది పౌరులు మరణించారని.. ప్రధాని మోదీ కల్పించుకొని యుద్ధం ఆగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ తెలిపారు. మంగళవారం పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు పగడాల యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, సామేల్, జంగయ్య, జగదీష్, నర్సింహ, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూత



మజీద్‌పూర్‌లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఉపాధ్యాయులు, స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల స్థితిగతులను మార్చేందుకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ కార్పొరేట్ కంపెనీల సహకారంతో ముందుకొచ్చింది. పాఠశాలలోని తరగతి గదుల గోడలపై ఆయా సబ్జెక్టులకు సంబంధించిన చిత్రాలను వేయించే పనులు చేపట్టింది. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా హైదరాబాద్ చాప్టర్ మేనేజర్ అరవింద్, కార్పొరేట్ వాలంటీర్ కోఆర్డినేటర్ ప్రదీప్, స్థానిక వాలంటీర్ కోఆర్డినేటర్ చరణ్, కార్పొరేట్ కంపెనీల బృందం ప్రతినిధులు సౌరబ్, గౌరవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

మహేశ్వరం, మీర్‌పేట, ఆర్కేపురం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిభట్ల, మంచాల, న్యూస్‌టుడే: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రధాన ఆలయాలు, వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారు మండపాల్లో ప్రత్యేక పూజలు అందుకున్నారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



ఇబ్రహీంపట్నంలో లక్ష్మీదేవి రూపంలో దుర్గాదేవి



మహేశ్వరంలో



కొంగరరావిర్యాలలో..



మంగళపల్లిలో నెలకొల్పిన దుర్గామాత మండపంలో..



అల్మాపురి కాలనీ దుర్గామాత మండపంలో...



శివగంగరాజరాజేశ్వరస్వామి ఆలయంలో హోమం



మీర్‌పేట జైభవాని సేవా సమితి ఆధ్వర్యంలో..



అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి బీసీ కాలనీలో...



ఆమనగల్లు కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో..



మార్కండేస్వామి ఆలయంలో...



మైసిగండి శివాలయంలో.



పసుమామల గ్రామంలో..

భాజపా విజయోత్సవం

మహేశ్వరం, న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికలో భాజపా విజయం సాధించడంతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. నియోజకవర్గ భాజపా బాధ్యులు అందెల శ్రీరాములు యాదవ్‌లతో కలిసి మహేశ్వరంలో జరిగిన విజయోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కడారి జంగయ్య, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్‌యాదవ్, శ్రవణ్, శంకర్, మల్లేష్, పరమేష్, ప్రకాష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన సప్పిడి నవ్యకు ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. మంగళవారం నవ్యను మాజీ జడ్పీటీసీ వెంకటేష్ సన్మానించారు. ఆమె చదువుకు ఉప్పల ట్రస్టు సాయం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కె. రమేష్, రాజు, హుస్సేన్ కిషన్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్.. చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఠల్ శర్మ, హేమంత్ శర్మ, రామ శర్మ, నిఖిల్ శర్మ, అరుణ, శ్రీపతి, అశ్వంత్, పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: కొంగరకలన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత, సీపీఓ సౌమ్య, సంక్షేమ శాఖ అధికారిణి రమణ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అమెరికాలోని ఇండియానా పోలీస్ ప్రాంతంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఇండియానా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పరిణీత రాజేష్ మారిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణకు చెందిన అమెరికాలో స్థిరపడిన మహిళలు.. పాల్గొన్నారని వెల్లడించారు.

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని శ్రీరామ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ, దాండియా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



జాపాలలో ఆటపాటలతో..



అమెరికాలోని సంబరాల్లో ఇబ్రహీంపట్నం మహిళలు



ఆర్కేపురంలోని శ్రీరామ్ కళాశాలలో..



కలెక్టరేట్ వద్ద బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు



బతుకమ్మతో కలెక్టర్ శశాంక్



అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



అధ్వానంగా రోడ్డు.. వాహనదారులకు అవస్థలు

కందుకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కందుకూరు నుంచి దెబ్బడగూడ వెళ్లే తారు రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు.. ఏదీ కనువిప్పు?

● ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు ● పట్టించుకోని అధికారులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్‌కు వెళ్లే రహదారి నడిరోడ్డులో ఉన్న విద్యుత్తు స్తంభాలు వాహన చోదకులు, ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. నాలుగేళ్ల కిందట రూ.34 కోట్లతో ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్, ముకునూరు, దండుమైలారం మీదుగా తూప్రాన్‌పేట్ గేట్ విజయవాడ నేషనల్ హైవే వరకు రోడ్డును రెండు వరుసలుగా మార్చారు. ఇబ్రహీంపట్నంలో రోడ్డుకు అనుసరించి ఉన్న ఇళ్లకు నష్టపరిహారం ఇచ్చే వరకు కూల్చవద్దని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఇబ్రహీంపట్నం ఎస్సీ బస్తీలో రెండేళ్ల వరకు పనులు నిలిపివేశారు. అనంతరం ఏడాదిన్నర కిందట కొంతమేర ఇళ్లను కూల్చివేసి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 30 అడుగుల వెడల్పుతో సిమెంటు రోడ్డును నిర్మించింది. విద్యుత్తు స్తంభాలు పక్కకు మార్చాలని సంబంధిత అధికారులకు మున్సిపల్ ఉద్యోగులు విన్నవించారు. విద్యుత్తు శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో మున్సిపల్ అధికారులు అలాగే రోడ్డును నిర్మించారు.



ఈశ్వరాంజనేయస్వామి దేవాలయం వద్ద నడి రోడ్డులో విద్యుత్తు స్తంభాలు



ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ..

శాఖల మధ్య సమన్వయ లోపం

కొన్ని నెలల నుంచి విద్యుత్తు స్తంభాల సమస్య తీవ్రంగా మారింది. నిత్యం ఈ రహదారిలో పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ సమస్య కొనసాగుతోందని వారు వాపోతున్నారు.

మున్సిపాలిటీ డబ్బులు చెల్లించాలి

– శ్రీనివాస్‌రావు, ఏఈ ఇబ్రహీంపట్నం

రాయపోల్ రోడ్డు ఎస్సీ బస్తీలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉండడం వాస్తవమే. స్తంభాలు తొలగించడానికి అయ్యే ఖర్చును ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ భరించాల్సి ఉంటుంది. రోడ్డు వేస్తున్న సమయంలో డబ్బులు చెల్లించక పోవడంతో అలాగే వదిలేశాం. నగదు చెల్లిస్తే ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను వెంటనే తొలగించి రోడ్డు పక్కకు మార్చుతాం.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లులోని దుబ్బగుట్టపై మృతదేహం(35) ఉందని సమాచారం రావడంతో సీఐ ప్రమోద్‌కుమార్.. ఎస్సై వెంకటేశ్, సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లారు. ప్యాంటు, చొక్కా ధరించిన యువకుడి మృతదేహం.. చేతిలో పురుగుల మందు డబ్బా ఉంది. వారం రోజుల కిందట మృతి చెంది ఉంటాడని సీఐ తెలిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విధులకు ఆటంకం.. ఒకరి అరెస్టు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 28 రాత్రి కానిస్టేబుల్ ఆర్.రాజేందర్‌రెడ్డి ఠాణా పరిధిలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్నాడు. ఆ సమయంలో కుంట్లూర్ ప్రియదర్శిని కాలనీ ప్లాట్ నంబర్-11 వద్ద టిప్పర్లతో మట్టి రవాణా చేస్తున్నట్లు కంట్రోల్ రూంకు ఫిర్యాదు వచ్చింది. విధి నిర్వహణలో ఉన్న రాజేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడే ఉన్న పసుమాములకి చెందిన మోడెపు శ్రీనివాస్ గౌడ్(44) సహా శివ, మధు అనే వ్యక్తులు.. రాయి పట్టుకొని చంపుతానంటూ బెదిరిస్తూ ఆర్.రాజేందర్‌రెడ్డిని దుర్భాషలాడారు. శ్రీనివాస్‌గౌడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై తొమ్మిది కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.



నిర్మించారు - వదిలేశారు

మంచాల - జాపాల రహదారిలో ఎకరం స్థలంలో రూ.2 కోట్లతో గోదాం నిర్మించి వదిలేశారు. పనులు పూర్తయి 2 ఏళ్లు కావస్తున్న ఉపయోగించడం లేదు. వృథాగా వదిలివేయడంతో తాగుబోతులకు అడ్డాగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని వాడుకలోకి తీసురావలని పలువురు కోరుతున్నారు.

మంచాల, న్యూస్‌టుడే

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

మావోయిస్టులపై అమిత్‌షా ప్రకటన విడ్డూరం: సీపీఐ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టుల ప్రాణాలు కోల్పోయారని, దీనిపై స్పందించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా 2026 నాటికి ఈ దేశంలో మావోయిస్టులు అనేది ఉనికి లేకుండాచేస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. దీనికి సహకరించని మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల ఆయా ప్రాంత ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని చెప్పారని, ఇతర ప్రాంతాల్లో వెనుకబడిన వారికి కూడానిధులు కేటాయిస్తామని చెప్పకపోవటం దుర్మార్గమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం మావోయిస్టులు ఉన్న అటవీ ప్రాంతంపై కేంద్రీకరించడం సరికాదని చెప్పారన్నారు. గిరిజనులకు చెందకున్న అటవీ సంపదను బడాబాబులకు అప్పగించాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. సామాజిక అసమానతలను పరిష్కరించకుండా మావోయిస్టులను రూపుమాపుతామని ప్రకటించటం అర్థరహితమన్నారు.

జనం సమస్యలపై జలమండలి అధికారులకు మొర

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ఫిల్మ్‌నగర్ బస్తీల్లో జలమండలి ఈడీ విజయ్‌కుమార్, జీఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, బల్దియా ఏఈ వెంకటేష్‌లు మంగళవారం పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలేమైనా ఉన్నాయా అంటూ జలమండలి అధికారులు స్థానికులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పెరిగిన జనాభా అనుగుణంగా పైప్‌లైన్ వ్యవస్థలను మార్చాల్సిన అవసరాన్ని పలు ప్రాంతాల ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. జలమండలి పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు కూడా మంజూరయ్యాయని, ఆయా పనులు త్వరితగతిన చేపట్టాలని చూస్తామన్నారు. పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాలేదని స్థానికులు బల్దియా ఏఈ వెంకటేష్ దృష్టికి తీసుకురాగా.. ప్రారంభమయ్యేలా చూస్తానని చెప్పారు. కమ్యూనిటీహాళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని పలు బస్తీల ప్రజలు వివరించారు. కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగ్‌రావు, కాటూరి రమేష్, ఆకుల రాజు, అబ్దుల్ గని తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:

? శ్రీనగర్‌కాలనీ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్కు సమీపంలోని వీధి దీపాలు రెండు నెలల నుంచి వెలగడం లేదు. – లక్ష్మీప్రసాద్, ఎస్‌బీహెచ్ కాలనీ

✓ పార్కు సమీపంలో వెలగని వీధి దీపాలను వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. – సుష్మ, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఏఈ

ప్రజావాణికి 395 వినతులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 395 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్‌లు కార్యక్రమంలో పాల్గొని వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించారు.

నాగార్జున సర్కిల్.. జిగేల్!

దాదాపు రూ.రెండు కోట్ల వ్యయంతో కూడలి అభివృద్ధి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కాలుష్య కారకంగా ఉన్న ప్రాంతం నుంచి ఆహ్లాదాన్ని పంచే కొండలు, గుట్టల మధ్యకు దారిని చూపే నాగార్జున సర్కిల్ అందంగా అలంకరించుకుంటోంది. మొన్నటి దాకా ఈ కూడలిలో కనీసం సిగ్నల్ ఉండేది కాదు. పాదచారులు ఈ మార్గంలో వెళ్లేందుకు సరైన సదుపాయం లేదు. ఎక్కడ ఆగేందుకు వీలులేని పరిస్థితిలో వాహనాల మధ్యనే రోడ్డు దాటాల్సి వచ్చేది. ఈ సమస్యలు తీర్చేందుకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పలు పర్యాయాలు సందర్శించి ట్రాఫిక్కు, పాదచారులకు అంతరాయం లేకుండా చేయాల్సిన ఏర్పాట్లపై సమాలోచనలు చేశారు. ప్రస్తుతం అవి రూపుదిద్దుకుని తుది దశలో ఉన్నాయి.



కూర్చుని చదువుకుంటున్న బాలబాలికల విగ్రహాలు



చెట్టు ఆకారంలో విద్యుత్తు దీపాలతో అలంకరణ

ఆకట్టుకునేలా ఐలాండ్‌లు

రోడ్డు దాటుతున్న సమయంలో పాదచారులు మధ్యలో ఆగితే ఏ వాహనం ఎటువైపు నుంచి దూసుకొస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. సమస్య తీర్చటానికి రోడ్డుకు మధ్యలో ఐలాండ్‌లను ఏర్పాటు చేశారు. ఆయా ప్రదేశాల్లో ఒకచోట పరుగు తీసే జింకలను, మరో చోట ఇద్దరు విద్యార్థులు కూర్చుని చదువుకుంటున్న విగ్రహాలు, ఇంకో చోట విద్యుత్తు దీపాలతో వెలిగే చెట్టును ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు దాటుతున్న వారు ఎలాం అందాలు ఆస్వాదం కలిగించనున్నాయి. కాస్త ముందుకు వెళ్లి రోడ్డు దాటే అవకాశం ఉంది. ఈ ప్రదేశమంతా మొక్కలతో అలంకరిస్తారు. రాత్రి వేళ విద్యుత్తు దీపాల వెలుగులో కాసేపు సేదదీరేందుకూ అవకాశం ఉంది.



కూడలిలో జింకలు, ఇతర బొమ్మల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్ఈ రత్నాకర్

రూపుదిద్దుకుంటున్న పాదబాటలు

కాస్త ఇరుకైన రోడ్డు కావడంతో పాదబాటలు అందుబాటులో ఉండేవి కావు. వాటిని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పాదచారులకు ఇబ్బంది లేకుండా మూడు రోడ్లలోనూ (రోడ్డు నంబరు 1, రోడ్డు నంబరు 2, పంజాగుట్ట రోడ్డు) గ్రానైట్ ఫ్లోరింగ్, మార్బుల్ ఫ్లోరింగ్‌లతో తీర్చిదిద్దారు. పాదబాటలోనూ ఎక్కడ పడితే అక్కడ రోడ్డు క్రాసింగ్ చేసేందుకు వీల్లేకుండా దారి పొడవునా గ్రిల్స్ ఏర్పాటుచేశారు. దాదాపు రూ.2 కోట్ల మేర వెచ్చించి కూడలి సుందరీకరణ, సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ కూడలి అభివృద్ధిపై జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శ్రద్ధచూపడంతో జోనల్ ఎస్ఈ రత్నాకర్ తరచూ సందర్శించి పనులను పర్యవేక్షిస్తున్నారు. పది రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డీఈ కృష్ణ చైతన్య చెప్పారు.

సీఎం ఇంటి చుట్టూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు



సూచిక బోర్డుల వద్ద విశ్వప్రసాద్, రాహుల్ హెగ్డే, హరిప్రసాద్, ప్రవీణ్‌కుమార్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ట్రాఫిక్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సీఎం ఇంటి చుట్టూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌లు సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం.45లో పర్యటించారు. డీసీపీ సూచనల మేరకు పలు మార్పులు చేర్పులు చేపట్టారు. మాదాపూర్ వైపు నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనదారులు గతంలో రోడ్ నం.45లో బ్రిడ్జి దిగి ముందుకు వెళ్లేవారు. బ్రిడ్జి దిగగానే రహదారి కొంత ఇరుకుగా ఉండటంతో వాహనాలు పూర్తిగా నిలిచిపోయేవి. కేబుల్ బ్రిడ్జి దిగి కింది రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు రోడ్ నం.45లోని హార్ట్‌కప్ వద్ద ఎడమకు తిరిగి అటు నుంచి రోడ్ నం.36 మీదకు వెళ్లేవారు. తాజాగా అదనపు కమిషనర్ సూచనల మేరకు హార్ట్‌కప్ వద్ద ఎడమ దారిని మూసివేశారు. బ్రిడ్జి కింది నుంచి వచ్చే వాహనదారులు బ్రిడ్జి దిగగానే మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తిరిగి అక్కడి నుంచి సీఎం నివాస దారి మీదుగా రోడ్ నం.36లోని రంగోలి ప్రాంతానికి చేరుకోవచ్చు. సీఎం ఇంటి మీదుగా ఉన్న మార్గంలో నేరుగా ముందుకు వెళ్లి పెద్దమ్మగుడి మార్గంలోకి అక్కడి నుంచి రోడ్ నం.36కు వెళ్లొచ్చు. మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తీసుకొని నేరుగా న్యూయార్క్ అకాడమీ మీదుగా రోడ్ నం.36లోని క్రోమాకు వెళ్లేలా దారిని తీర్చిదిద్దారు. ఆయా దారుల్లో వాహనదారులకు అర్థమయ్యేందుకు బోర్డులు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. కేబుల్ బ్రిడ్జి, రోడ్ నం.45 బ్రిడ్జి దిగే వారు బ్రిడ్జి దిగగానే తరువాత వచ్చే ఎడమకు తిరిగి సైతం రోడ్ నం.36కు చేరుకొనేలా ఏర్పాట్లు చేశారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థనగర్‌లో బోర్ సీజ్

వెంగళ్‌రావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధి సిద్ధార్థనగర్‌కాలనీలో నాలుగున్నర అంగుళాలు సైజు పైపులతో బోరు వేసేందుకు అనుమతి తీసుకొని ఆరున్నర అంగుళాల పైపులు వేయడంతో ఖైరతాబాద్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రాజ్ మంగళవారం సీజ్ చేశారు. అనుమతులకు మించి ఎవరైనా బోరువేస్తే తప్పకుండా సీజ్ చేస్తామని ఆర్ఐ తెలిపారు.

నిమ్స్ అనుసంధాన అధికారిగా రాంబాబు

నిమ్స్, న్యూస్‌టుడే: పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రి అనుసంధాన అధికారి (లైజన్ ఆఫీసర్)గా రాంబాబును నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహించిన ఆయన ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆయన్ను ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన నియమించారు. ప్రభుత్వానికి, ఆసుపత్రికి మధ్య అనుసంధాన అధికారిగా వ్యవహరించనున్నారు.

శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవం నేడు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీవారికి సర్వభూపాల, గజవాహన సేవలను నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం

ఫిలింనగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లోని పోచమ్మ ఆలయంలో మహా చండీయాగాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి యాగంలో పాల్గొన్నారు.

బోరబండ: వెంకటేశ్వరనగర్ డివిజన్ గౌరీశంకర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు మంగళవారం వైభవంగా జరిగాయి. కార్పొరేటర్ పి.విజయారెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే



జీటీఎస్‌కాలనీలో మహాలక్ష్మిగా సీతలభవానీ అమ్మవారు



వెంగళరావునగర్‌లోని శ్రీరామాంజనేయస్వామి దేవస్థానంలో..



షేక్‌పేట ఓయూ కాలనీలో కనకదుర్గాలయంలో మహాలక్ష్మీదేవిగా..

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవార్ల మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు.

– న్యూస్‌టుడే బృందం

దసరా తర్వాత కమలానగర్ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జకియా సుల్తానా

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను దసరా తర్వాత కేటాయించేలా చర్యలు తీసుకుంటానని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉపకమిషనర్ జకియా సుల్తానా తెలిపారు. సర్కిల్-19 డీపీఓ వెంకటకిషన్, సిబ్బందితో కలిసి కమలానగర్ డిగ్నిటీ హౌసింగ్‌కాలనీని మంగళవారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ.. గతంలో ఇళ్లను కేటాయించగా మిగిలిన 46మందికి కచ్చితంగా ఇళ్లు లభిస్తాయని భరోసా కల్పించారు. దాదాపు తొమ్మిదేళ్ల క్రితం తమ ఇళ్లను కూలగొట్టించి స్థలాలను ప్రభుత్వానికి అప్పగించామని, ముందుగా తమకు రావలసిన 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించిన తర్వాతే మిగిలిన వాటిని ఇతరులకు అప్పగించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ తహసీల్దార్ ఎండీ.నయీముద్దీన్‌తో చరవాణిలో మాట్లాడిన ఉపకమిషనర్ త్వరలోనే లబ్ధిదారులందరికీ ఇళ్లను కేటాయిస్తామన్నారు. కమలానగర్‌లో మిగిలిన 64 ఇళ్లను మూసీ నిర్వాసితులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కేటాయించిన తర్వాతే మూసీ బాధితులకు కమలానగర్‌లో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టంచేశారు.

వివాదాస్పద స్థలాల పరిశీలన

బోరబండ, న్యూస్‌టుడే: కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాలను ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ మహాత్మానగర్, బోరబండ విజేత థియేటర్ ఎదురుగా ఉన్న సారథి సొసైటీ స్థలాలను మండల డీటీ లక్ష్మణ్‌రావు, ఆర్ఐ రాజిరెడ్డి, సర్వేయర్ భీమ్లా నాయక్, చైన్‌మ్యాన్ మెహతాబ్ పరిశీలించారు.

అభివృద్ధి పనులకు అడ్డుపడితే చట్టపరమైన చర్యలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: హిమాయత్‌నగర్ వీధి నెంబరు 16లో రెండు నెలలుగా సీసీ రోడ్డు పనులు నిలిచిపోవటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీగౌడ్ దృష్టికి రావడంతో మంగళవారం ఆమె జీహెచ్ఎంసీ ఈఈ రమేష్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, జలమండలి (నారాయణగూడ) జీఎం రామకృష్ణ, డీజీఎం కృష్ణ, శానిటైజింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్యలతో కలిసి వీధి నెంబరు 16కు వెళ్లారు. సీసీ రోడ్డు పనులు ఆగిపోవడం పట్ల ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదర్‌గూడ సెయింట్ పాల్ లేన్‌లో రోడ్డు పనులు జరగకుండా స్థానికంగా ఉండే ఓ మహిళ అడ్డుపడుతోందని అధికారులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసి, అభివృద్ధి పనులకు అడ్డుపడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జి.రామన్‌గౌడ్, నాయకులు వెంట ఉన్నారు.

కాంబినేషన్ కోర్సులకు మంచి డిమాండ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సైతం సరైన కోర్సులను ఎంపికచేసుకోవాలని ఉదయ్‌పుర్‌కు చెందిన సర్ పడంపట్ సింఘానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పృథ్వీ యాదవ్ అన్నారు. అమీర్‌పేటలోని ఎమ్‌పీఎమ్ మాల్‌లో విశ్వవిద్యాలయ దక్షిణ భారత ప్రాంతీయ కార్యాలయాన్ని అడ్మిషన్స్ డైరక్టర్ అలుగాని సంజీవతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సరైన కోర్సును ఎంపిక చేసుకొన్నప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించి విభిన్న కోర్సుల్లో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాంబినేషన్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. తమ విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పెయింట్ టెక్నాలజీని పరిచయం చేయనున్నట్లు చెప్పారు.

రోడ్డు నిర్మాణంతో తీరిన ఇబ్బందులు



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఫిలింనగర్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్ ఎన్బీటీనగర్‌లో రూ.17 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో స్థానికుల ఇబ్బందులు తీరాయి. కాంగ్రెస్ నాయకులు సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సౌధలో బతుకమ్మ వేడుక



వేడుకలను ప్రారంభిస్తున్న రోనాల్డ్ రాస్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ విద్యుత్తు మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్తు సౌధ ఆవరణలో ఏర్పాటుచేసిన వేడుకలను ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ, ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రెటరీ రోనాల్డ్ రాస్, ఆయన సతీమణి విశాలాక్షి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వసంత, ప్రణీత, హృదయ, సలహాదారులు విజయలక్ష్మి, మాధవి, ఆరోగ్యరాణి, అనూరాధ, ప్రవీణశ్రీ, అపర్ణ, సౌజన్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నవరాత్రి పూజల్లో ఎమ్మెల్యేలు



పూజల్లో ఎమ్మెల్యేలు గోపీనాథ్, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో చేస్తున్న పూజల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. మర్రి రాజశేఖర్‌రెడ్డి, మమతల కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి వారు మంగళవారం అక్కడికి వచ్చారు. చాముండేశ్వరీదేవి అలంకరణలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి ఆశీస్సులు అందించారు.

నయనానందకరం.. నృత్యోత్సవం





రవీంద్రభారతి, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకల్లో భాగంగా తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత డా.ఆనంద శంకర్ జయంత్, గీతాగణేషన్ శిష్యబృందాలు భరతనాట్య సంప్రదాయంలో అద్భుతమైన అంశాలను ప్రదర్శించి కళాప్రియులను మైమరిపించారు. కూచిపూడి నాట్యగురువులు దీపికారెడ్డి, భాగవతుల సేతురాంల శిష్య బృందాలు చక్కటి ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్నారు. కథక్ నృత్యకారులు రాఘవ రాజ్‌భట్, మంగళాభట్, సంజయ్‌జోషిల శిష్య బృందాలు నయనానందాన్ని పంచారు. ప్రముఖ నాట్యగురువులు కళాకృష్ణ, రాజ్‌కుమార్‌ల శిష్య బృందాలు పేరిణి నృత్యాంశాలు ఆసక్తికరంగా ప్రదర్శించారు. ఒడిస్సీ కళాకారులు దేబశ్రీ పట్నాయక్, సుదీప్తా పాండ శిష్య బృందాలు అభినయంతో ఆకట్టుకున్నారు.

పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని వినతి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు మంగళవారం సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాడవేడి వినోద్‌కుమార్, ఇమ్మడి సంతోష్‌కుమార్ తదితరులు టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా 2003 ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, దీనికి ప్రభుత్వంపై ఎలాంటి అదనపు భారం పడదని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డిలనూ కలిసి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరుగెడుతున్న యువకుడిని స్థానికులు పట్టుకొని, దేహశుద్ధి చేసిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడ, జయప్రకాష్ నగర్‌లోని వసతి గృహంలో ఉంటున్న నాగసాయి లహరి ప్రైవేటు ఉద్యోగిని. మంగళవారం ఉదయం వసతిగృహం నుంచి సమీపంలోని కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుంది. తమిళనాడులోని ధర్మపురికి చెందిన నితిన్ యువతిని అనుసరించి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరుగెత్తడానికి ప్రయత్నించాడు. యువతి కేకలు వేస్తూ అతడి వెంట పరుగెత్తింది. అప్రమత్తమైన స్థానికులు నితిన్‌ను పట్టుకొని దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పంజాగుట్ట: నిమ్స్ బస్టాపులో గుర్తు తెలియని ఓ బిక్షగాడు మృతి చెందిన ఘటనలో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6న నిమ్స్ బస్టాప్‌లో గుర్తు తెలియని 60-65 సంవత్సరాల వయసున్న వ్యక్తి పడి ఉన్నాడు. స్థానిక పోలీసు సిబ్బంది సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై వేణుగోపాల్ కోరారు.

భార్యను వేధిస్తున్న భర్తకు నెల రోజుల జైలు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: భార్యని వేధిస్తున్న వ్యక్తికి నెల రోజుల సాధారణ జైలు శిక్ష పడింది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండకు చెందిన డిల్లేశ్వరరావు(42)చాలా కాలంగా భార్యని అనుమానంతో వేధిస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం 10వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి మంద మురళీ నెల రోజుల శిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు

'కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ తగదు'

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో గత పదిహేనేళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథి కూనంనేని మాట్లాడుతూ.. జిల్లా నుంచి పల్లె వరకు అన్ని స్థాయిలో రాష్ట్రంలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 17,541 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 16న ఎన్‌హెచ్‌ఎం డైరెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా, నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, రాష్ట్ర నాయకులు దేవనబోయిన బాపు యాదవ్, సారంగుల బాలసుబ్రహ్మణ్యం, సరికొండా సురేష్‌గౌడ్, నూర సంపత్‌కుమార్, టి.రోహిణి, సింధుజ, జనగాం జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, ప్రధాన కార్యదర్శి గణేష్, ఇతర నాయకులు ఉన్నారు.

విద్యుత్తు రంగ ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం



ప్రసంగిస్తున్న కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన విద్యుత్తు ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్తు రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీలు గుప్పించారని, చివరకు ఆర్టిజన్‌లు అనే ముద్దు పేరుతో కార్మికుల జీవితాలను చీకట్లోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల పదోన్నతులు లేకుండా, చాలీచాలని జీవితాలతో నెట్టుకొస్తున్నారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైన ఆర్టిజన్ కార్మికులు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ గిరి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్‌లు మాట్లాడారు. సదస్సులో ఏఐటీయూసీ కార్యదర్శులు శింగు నర్సింహ్మారావు, నరాటి ప్రసాద్, ఆర్టిజన్ యూనియన్ నాయకులు ఉన్నారు. ఆర్టిజన్స్ సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నిమ్స్ అనుసంధాన అధికారిగా రాంబాబు

నిమ్స్, న్యూస్‌టుడే: పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రి అనుసంధాన అధికారిగా రాంబాబును నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహించిన ఆయన ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆయన్ను ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన నియమించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ఆసుపత్రికి మధ్య అనుసంధాన అధికారిగా వ్యవహరించనున్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రి డైరెక్టర్ నగరి బీరప్ప చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాను.



నియామకపత్రం అందుకుంటున్న రాంబాబు

కూకట్‌పల్లి

లండన్ టెన్నిస్ పోటీల్లో కేవీఎన్ మూర్తి ప్రతిభ



విజేతతో రన్నరప్ మూర్తి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: లండన్‌లోని గ్రేట్ మాల్వెన్‌లో ఈ నెల 3నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఐటీఎఫ్(ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్) పోటీల్లో కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డుకు చెందిన కొత్యాల వెంకటనారాయణ మూర్తి రన్నరప్‌గా నిలిచాడు. క్వార్టర్, సెమీఫైనల్స్‌లో రాణించిన మూర్తి ఫైనల్స్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన టిమ్ హింటన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. పాయింట్ల ఆధారంగా నిలిచే పోటీల్లో ఇండియా టాప్ 4లో నిలిచిన ఆటగాళ్లను భారత్ తరఫున వరల్డ్ టెన్నిస్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం కలుగుతుంది. ఇండియా టాప్-4లో నిలవాలన్నదే లక్ష్యమని మూర్తి చెప్పారు.

బతుకమ్మ పండగకు నిబంధనలేంటీ?: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బతుకమ్మ సంబరాలకు నిబంధనలు విధించడమేంటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే, ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో కొలిచే గౌరమ్మ పండగ వేళ.. పోలీసులు డీజే, మైకుల ఏర్పాటుపై నిషేధాజ్ఞలు ప్రకటించడాన్ని తప్పుపట్టారు. కొత్తగా నిబంధనలు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల పంపిణీ లేకుండా చేసిన ప్రభుత్వం ఇలా పండగపై కూడా నిబంధనల నీళ్లు చల్లడం ఎంత వరకు సమంజసమన్నారు. దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలోంచి బంగారు గొలుసు లాక్కొని పరుగెడుతున్న యువకుడిని స్థానికులు పట్టుకొని, దేహశుద్ధి చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ, జయప్రకాశ్‌నగర్‌లోని వసతిగృహంలో ఉంటున్న నాగసాయి లహరి ప్రైవేటు ఉద్యోగిని. మంగళవారం సమీపంలోని కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తోంది. తమిళనాడులోని ధర్మపురికి చెందిన నితిన్ ఆమె మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరిగెత్తడానికి ప్రయత్నించాడు. యువతి కేకలు వేస్తూ వెంట పరుగెత్తింది. అప్రమత్తమైన స్థానికులు నితిన్‌ను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేంకన్న దేవాలయం..

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

భక్తుల కొంగుబంగారం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా.. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు.. ఆ దేవ దేవుడు. భక్తుల్లో ఎనలేని నమ్మకం సొంతం చేసుకోవడంతో.. ఒకప్పుడు చిన్నగా ఉన్న ఆలయం.. దినదిన ప్రవర్ధమానమవుతూ.. నేడు దేదీప్యమానంగా వెలుగొందుతుంది. స్వామిని కొలిచి ప్రసాదం తీసుకున్న సంతానం లేనివారికి ఆ భాగ్యం కలగడం.. ఇది నలుమూలలా వ్యాపించడంతో ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో సంతానం లేని దంపతులు ఇక్కడికి వస్తుంటారు. మరోసారి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. బాలానగర్ డివిజన్ పరిధి సాయినగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం.. మీ కోసం..

రావిచెట్టు కింద చిన్నరాళ్లకు పూజలు

1984కి ముందు బాలానగర్ సాయినగర్‌కాలనీ లేదు. చిన్నచిన్న ఇళ్లు ఉండేవి. ఇక్కడి రావిచెట్టు కింద రాళ్లకు దీపం పెట్టి, పూజిస్తుండేవారు. 1984లో కాలనీ ఏర్పాటు కావడం.. ఒక్కొక్కటిగా నివాసాలు పెరగడంతో కాలనీ వాసులు రావిచెట్టు కింద ప్రాంతాన్ని గుడి కోసం వదిలేశారు. 150గజాల స్థలంలో ఆలయం నిర్మించుకోవాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇలా వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం కోసం 1977లో అంకురార్పణ జరిగింది. ఇలా ఆలయం నిర్మించుకొని 1989లో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దసరా సమయంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. మూడు రోజుల పాటు అధ్యయనోత్సవాలు.. తర్వాత బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. భక్తుల్లో స్వామివారి పట్ల నమ్మకం.. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సమయంలో సంతానం లేనివారికి ఇచ్చే గరుడ ప్రసాదం ఎంతో ప్రసిద్ధికెక్కింది. సంతానం లేని వారు ఇక్కడికొచ్చి ఆ ప్రసాదం తీసుకొని వెళ్లడం.. తర్వాత వచ్చే బ్రహ్మోత్సవాల సమయానికి ఆ దంపతులు బిడ్డతో వస్తుండడంతో స్వామివారి పట్ల ఎనలేని నమ్మకం పెరిగింది. నగరం నలు మూలల నుంచి భక్తులను రప్పిస్తుంది. ప్రతి బ్రహ్మోత్సవానికి ఇలాంటి జంటలు 5నుంచి 10మంది వచ్చి ప్రసాదం తీసుకెళ్లి తర్వాత తీపి కబురు చెబుతుంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెరగడంతో పక్కనే ఉన్న మరికొంత స్థలాన్ని కొనుగోలు చేసి ఆలయాన్ని విస్తరించారు. ఇలా ప్రస్తుతం 500గజాల స్థలంలో ఆలయం విరాజిల్లుతుంది.



బాలానగర్ సాయినగర్‌లోని వేంకటేశ్వరస్వామి



స్వామివారి ఆలయం

ఆరు రోజులు.. ప్రత్యేక పూజలు

ఈ నెల 6నుంచి మంగళవారం వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించారు. బుధవారం(9వ తేదీ) నుంచి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం జరగనుంది. ఆరు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో రోజూ ప్రత్యేక పూజలుంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి తెలిపారు. మొదటిరోజు విష్వక్సేన పూజ, రక్షాబంధనం, సాయంత్రం విష్వక్సేన అలంకరణలో అశ్వ వాహనంపై స్వామివారు పురవీధుల్లో దర్శనమిస్తారు. 10న అభిషేకం, ధ్వజారోహణం, సామూహిక కుంకుమార్చన, కృష్ణావతార అలంకరణలో శేషవాహనంపై, మూడోరోజు నిత్యహోమం, సామూహిక లక్ష పుష్పార్చన, రామావతార అలంకరణలో గజ వాహనంపై, 12న స్వామివారి కల్యాణం, గరుడ వాహనంపై ఊరేగింపు, 13న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, రథోత్సవం, చివరిరోజు 14న అష్టోత్తర శతకలశ పూజ ఉంటుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

రోడ్డుకు మరమ్మతులు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: మూసాపేట ప్రధాన రహదారిలోని సర్కిల్ జలమండలి వాటర్ ట్యాంక్ సమీపంలో రోడ్డు కోసుకుపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు కొన్ని మాసాలుగా ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి రాకపోకలు పునరుద్ధరించారు.

భూగర్భ మ్యాన్‌హోల్‌కు..



మూసాపేట, న్యూస్‌టుడే: అల్లాపూర్ పరిధి రాజీవ్‌గాంధీనగర్ డీ బ్లాకులో రోడ్డు మధ్యలో ఉన్న భూగర్భ మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగంతా వీధిలో ప్రవహించి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సమస్యను గుర్తించిన 'ఈనాడు' జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్‌కు వివరించింది. స్పందించిన ఆయన మంగళవారం మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే చర్యలు: ఏసీపీ



బాలానగర్ ఠాణాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ హనుమంతరావు

బాలానగర్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా అనుమతి లేకుండా మైకులు పెట్టొద్దని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. మంగళవారం దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, డీజే, మైకుసెట్ల నిర్వాహకులతో బాలానగర్ ఠాణా ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీఐలు నరసింహరాజు, క్రాంతికుమార్, శ్రీనివాసులు, ఎస్ఐలు రామనారాయణ, హాజీ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట: డీజే షాపులు, నిర్వాహకులతో మంగళవారం కూకట్‌పల్లి ఠాణాలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ..డీజేల వినియోగంపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, అల్లాపూర్ సీఐలు కొత్తపల్లి ముత్తు, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, బాచుపల్లి డీఐ జి.తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

● దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే అమ్మవార్ల ఊరేగింపులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కూకట్‌పల్లి సీఐ కొత్తపల్లి ముత్తు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఠాణా పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు.

తవ్వారు.. ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నారు



శ్రీసాయినగర్‌లో వరద కాలువ శ్లాబును ధ్వంసం చేసి వదిలేసిన పరిస్థితి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పనులు చేయాల్సిన గుత్తేదారులు.. వాటిని ఆహ్వానిస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. ఇష్టానుసారం తవ్విపోయడం.. వదిలేయడం అలవాటుగా మారింది. ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నవే.. ఈ చిత్రాలు. కూకట్‌పల్లి డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌లో వరద కాలువ పూడిపోవడంతో.. వరద ఉప్పొంగి రోడ్లను ముంచెత్తిన విషయం తెలిసిందే. నల్లచెరువు నుంచి వస్తున్న ఈ కాలువ శ్రీసాయినగర్‌లో అధ్వానంగా మారింది. ఏళ్ల కొద్ది పూడిక తీయకపోవడంతో కాలువ జామైంది. దీన్ని పరిష్కరించేందుకు చేసేదిలేక పొక్లెయిన్‌తో అధికారులు శ్లాబును ఇష్టానుసారం తవ్విపోశారు. వెంటనే మరమ్మతులు చేయాల్సిన గుత్తేదారు తవ్వి.. కనీసం ఇళ్లముందు బారికేడ్లు పెట్టకుండా వదిలేసి ప్రమాదకర పరిస్థితుల మధ్య వదిలేశాడు. దీంతో స్థానికులు ముంపు సమస్య కంటే.. తాజా పరిస్థితే ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. సత్వరమే మరమ్మతులు నిర్వహించి పూడిక తీయడంతోపాటు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం కనిపిస్తుంది.



శ్లాబుపై ప్రమాదకరంగా గుంతలు

కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ

హిమాయత్‌నగర్: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో పదిహేనేళ్లకు పైగా ఒప్పంద, పొరుగుసేవల పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీసవేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎం.నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథి కూనంనేని మాట్లాడుతూ..జిల్లా నుంచి పల్లె వరకు అన్నిస్థాయిలో రాష్ట్రంలో ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ మాట్లాడుతూ..ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 17,541మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 16న ఎన్‌హెచ్‌ఎం డైరెక్టరేట్ కార్యాలయం ముందు భారీ ధర్నా, నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ..ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత పీఆర్సీ సందర్భంగా రావాల్సిన ఏడు నెలల పీఆర్సీ ఎరియర్స్ నేటికీ అమలు చేయడం లేదన్నారు. సంఘం నాయకులు దేవనబోయిన బాపుయాదవ్, సారంగుల బాలసుబ్రహ్మణ్యం, సరికొండా సురేష్‌గౌడ్, నూర సంపత్‌కుమార్, టి.రోహిణి, సింధుజ, జనగాం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి తదితరులున్నారు.

అట్ల బతుకమ్మ.. అదిరిందమ్మా



కూకట్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి శోభారాజ్, వైద్యులు, సిబ్బంది





కూకట్‌పల్లి దేవిస్థానా హోమ్స్‌లో..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో మంగళవారం అట్ల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని హనుమాన్ దేవాలయం మైదానం మహిళలతో కిక్కిరిసింది. ఆట, పాటలతో అలరించారు. కూకట్‌పల్లి దేవిస్థానా హోమ్స్, బాలానగర్ హెచ్ఏఎల్, కూకట్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.







కూకట్‌పల్లి గ్రామంలో మహిళల సందడి

నిధి ఆప్కే నికట్ రేపు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 10న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రీజనల్ పీఎఫ్ కమిషనర్-1 డాక్టర్ హేమంత్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4వరకు ప్రశాంత్‌నగర్ ఆర్టీసీ బస్ భవనం రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పరిశ్రమల నిర్వాహకులు, ఉద్యోగులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు.



కూకట్‌పల్లి మెట్రో క్యాష్ అండ్ క్యారీ వెనుక రోడ్డులో..



రెయిన్‌బోవిస్టాస్ జంక్షన్ రంగధాముని చెరువు రోడ్డు

కుంగిన మూతలు.. ప్రమాదకర పరిస్థితులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలో పలుచోట్ల మంజీరా స్లూయిజ్‌వాల్వ్ మూతలు కుంగి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. వర్షం పడినప్పుడు ఆయాచోట్ల భారీగా నీరు నిలిచి వాహనదారులు పడిపోతున్నా.. పట్టించుకోని పరిస్థితి ఉండడం ఆందోళన కలిగిస్తుంది. కొన్నిసార్లు ఇక్కడ మంజీరా నీరు కూడా లీకవుతుండడం మరొక సమస్యగా చెప్పాలి. కూకట్‌పల్లి మెట్రో క్యాష్ అండ్ క్యారీ వెనుక రోడ్డు, మూసాపేట రెయిన్‌బోవిస్టాస్ జంక్షన్ రంగధాముని చెరువు రోడ్డు మలుపులో ఈ ప్రమాదాలు నెలకొన్నాయి. కొన్ని మాసాలుగా ఇదే దుస్థితి ఉన్నా.. జలమండలి అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తుంది.



అన్నపూర్ణాదేవి అలంకరణలో కూకట్‌పల్లి చిత్తారమ్మ తల్లి



మూడో రోడ్డులోని శివాలయంలో అన్నపూర్ణగా కామాక్షమ్మవారు



పర్వత్‌నగర్‌లో శ్రీమహాలక్ష్మిగా పర్వతవర్ధిని అమ్మవారు



మూసాపేట ఆంజనేయనగర్‌లో సరస్వతీదేవిగా..

శరన్నవరాత్రి ఉత్సవం.. భక్తుల సంబరం

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, అల్లాపూర్, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో దేవీశరన్నవరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం ఆరోరోజు అమ్మవారు విభిన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక మండపాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. హోమం, సామూహిక కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు.



రాజరాజేశ్వరీదేవిగా మూసాపేట రేణుకాఎల్లమ్మ

పెరిగిన జీతాలు అమలు చేయాలని నిరసన



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పెరిగిన జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేఎన్‌టీయూహెచ్ కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం కళాశాల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జీవో నంబర్ 11ను అమలు చేయడంలో వర్సిటీ అధికారులు జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నించారు. బకాయిలు రూ.19కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్‌ఖన్నా, నరేందర్‌రెడ్డి, కరుణాకర్, రాజేష్, శ్రవణ్, పావని తదితరులు పాల్గొన్నారు.

సైగలు చేస్తే సంకెళ్లే

అసాంఘిక కార్యకలాపాలపై మెరుపుదాడి ● గట్టి చర్యలకు సీపీ ఆదేశాలు

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాల మాటున అసభ్యకరంగా సైగలు చేస్తూ.. ఆకర్షించే యువతులు, మహిళలపై సోమవారం రాత్రి పోలీసులు మెరుపుదాడి చేశారు. చీకటి పడితే కాలిబాటలపై పలువురు యువతులు, మహిళలు నిలబడి బేరసారాలకు దిగుతున్నారు. ఈ ప్రభావంతో పోకిరీలు క్యాబ్, ఆటో కోసం ఎదురుచూస్తున్న మహిళలు, యువతులను మాటలతో ఇబ్బంది పెడుతున్నారు.

మహిళ హత్యతో రంగంలోకి పోలీసులు

ఈ నెల 2న కేపీహెచ్‌బీ పరిధి లోధా టవర్స్ ఎదురు జంగల్‌లో మహిళ హత్య వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ 30నే ఓ మహిళ మరో మహిళను హత్య చేసినట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. మహిళ హత్య, ఇక్కడి అసాంఘిక కార్యక్రమాలపై 3న 'ఈనాడు'లో 'నిషా పెంచక..నేరాల పరంపర' శీర్షికన కథనం ప్రచురితమైంది. సీపీ అవినాశ్ మహంతి సైతం మహిళ హత్యను తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఇందుకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఏఆర్, షీటీమ్, ఏహెచ్‌టీయూ విభాగాలు, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి ఠాణాల సిబ్బందితో కలిపి 5 బృందాలుగా విభజించి 100 మందిని రంగంలోకి దించారు.

కట్టడి ఇలా..

జాతీయ రహదారి, కళామందిర్-భాగ్యనగర్‌కాలనీ బస్టాప్, కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్-ఉషాముళ్లపూడి రోడ్డు, కైత్లాపూర్-నాలుగో ఫేజ్, బ్రాండ్ ఫ్యాక్టరీ-లోధా టవర్స్ మార్గాల్లో రాత్రి 8నుంచి 11 గంటల వరకు బృందాలు మెరుపు దాడి చేశాయి. కొందరిని పట్టుకొని ఠాణాలకు తరలించారు. పట్టుకున్న 27మందిలో ఆరుగురు యువతులే ఉండటం గమనార్హం. బహిరంగ ప్రదేశాల్లో జనాన్ని ఇబ్బందులకు గురిచేసినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఎమ్మార్వో సమక్షంలో బైండోవర్ కూడా చేశారు. మరోసారి దొరికితే రూ.లక్షకు పైగానే జరిమానాతోపాటు జైలుకు పంపిస్తారు. సెప్టెంబర్ 1న కేపీహెచ్‌బీ పోలీసుల దాడిలో 9మంది పట్టుబడ్డారు. తాజా దాడిలో వారెవరూ కనిపించకపోవడంతో కొంత మార్పు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ దాడులు తరచూ కొనసాగితేనే పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది. దాడిలో ఏసీపీ ప్రసన్నకుమార్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, ముత్తు, జేమ్స్ బాబు, సునీత, ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.



సిబ్బందికి వివరిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

వెటర్నరీ సహాయ సంచాలకుడిగా వెంకటేశ్వరరెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ వెటర్నరీ సహాయ సంచాలకుడిగా జి.వెంకటేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లింగస్వామి కొన్ని నెలల క్రితం బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది. సర్కిళ్లవారీగా వెటర్నరీ అధికారులు లేకపోవడంతో కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లకు వెంకటేశ్వరరెడ్డి ఇన్‌ఛార్జి వెటర్నరీ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు.

బతుకమ్మ ఉంచే స్థలం ఇదేనా?



జేఎన్‌టీయూ చౌరస్తాలో రూ.లక్షలు వెచ్చించి జీహెచ్ఎంసీ ఐలాండ్ మాదిరి స్థలాన్ని అభివృద్ధి చేసింది. పలు సందేశాలకు సంబంధించి ఇక్కడ సూచికలు, నమూనా ఆకృతులు ఉంచుతారు. ఇక్కడ కాకుండా నవరాత్రుల ఉత్సవాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్లాస్టిక్ పూల బతుకమ్మను విభాగినిలోని ఇరుకైన జాగాలో ఉంచింది. ఇక్కడే పాదచారులు రహదారి దాటుతుంటారు. పండగ ప్రాధాన్యతను తెలిసేలా ఏర్పాటుచేయాల్సిన స్థలంలో కాకుండా ఇరుకైన జాగాలో ఎవరికీ కనిపించకుండా బతుకమ్మను ఉంచడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

నక్సలైట్లపై అమిత్‌షా ప్రకటన విడ్డూరం: సీపీఐ

హిమాయత్‌నగర్: ఛత్తీస్‌గఢ్‌లో కాల్పుల్లో పెద్దసంఖ్యలో నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై స్పందించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 2026 నాటికి నక్సలైట్లు ఆఖరి ఊపిరి పీల్చుకుంటారని ప్రకటించటం ఆశ్చర్యంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్ బోస్ అన్నారు. దీనికి సహకరించిన నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల రాష్ట్ర ప్రభుత్వాలకు అభివృద్ధిలో కేంద్ర సహకారం ఉంటుందన్నారని, నక్సల్ ప్రభావితం లేని ఇతర ప్రాంతాల్లో వెనుకబడిన వారికి సమానంగా నిధులు కేటాయిస్తామని చెప్పకపోవటం దుర్మార్గమని పేర్కొన్నారు. సమాజ సమగ్రాభివృద్ధిని ఆలోచించకుండా నక్సలైట్లున్న అడవి ప్రాంతంపై కేంద్రీకరించడం ఎందుకో అమిత్‌షానే చెప్పాలన్నారు. అటవీ సంపదను బడాబాబులకు అప్పగించాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. సామాజిక రుగ్మతలు పరిష్కరించకుండా నక్సలైట్లను రూపుమాపుతామని ప్రకటించటం అర్థరహితమన్నారు.

విద్యుత్తురంగ ఆర్టిజన్లను క్రమబద్ధీకరించాలి: కూనంనేని

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన విద్యుత్తు ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీలు గుప్పించారని, చివరకు ఆర్టిజన్లు అనే ముద్దు పేరుతో కార్మికుల జీవితాలను చీకట్లోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లు పదోన్నతులు లేకుండా, చాలీచాలని జీవితాలతో నెట్టుకొస్తున్నారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైన ఆర్టిజన్ కార్మికులు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు నమోదు చేసుకోండి

పటాన్‌చెరు అర్బన్: పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రంగారావు తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఎన్నికల్లో ఓటుకు పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 6లోపు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యమ నిధికి విరాళం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు మండలం పాశమైలారం వాగ్వాల్స్ పరిశ్రమలో వేతన ఒప్పందం అయిన సందర్భంగా పెరిగిన నెల జీతాన్ని ఉద్యమనిధి కోసం కార్మిక సంఘం అధ్యక్షులు రాజయ్యకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఈనిధిని కార్మిక ఉద్యమాలకు ఖర్చు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు సీఐటీయూ చేస్తుందన్నారు. కార్మికసంఘం నాయకులు అఫీజ్, మురళీ, డేవిడ్ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు సాకిచెరువు కట్టపై ఈనెల 10న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మకు తరలి వచ్చే మహిళలకు ఇబ్బంది లేకుండా గ్రేటర్ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నిర్వహించే సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ తెలిపారు.

సమన్వయమేదీ.. సమస్య తీరే దారేదీ?

రేడియల్‌రోడ్డు నిర్మాణంలో జాప్యం



రేడియల్ రోడ్డుపై నల్లగండ్ల దగ్గర చౌరస్తాలో ట్రాఫిక్ అవస్థ

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి, వట్టినాగులపల్లి రింగ్ రోడ్డు వరకు, నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ మీదుగా రింగ్‌రోడ్డు వరకు రూ.152 కోట్ల అంచనా వ్యయంతో రేడియల్‌రోడ్డు నిర్మాణానికి ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ నిర్మాణ ప్రక్రియం ఓ రూపు సంతరించుకోలేదు.

ఎప్పటికీ పూర్తయ్యేను..

దాదాపు 150 అడుగుల విస్తీర్ణంతో రేడియల్‌రోడ్డును నల్లగండ్ల నుంచి మొదలుకొని గోపన్‌పల్లి, వట్టినాగులపల్లి రింగ్ రోడ్డు వరకు, నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ మీదుగా రింగ్ రోడ్డు చేరుకోవడానికి రేడియల్ రోడ్డు నిర్మాణానికి నిర్ణయించారు. అధికారులు సమర్థంగా పనిచేయకపోవడం, కొందరు ప్రజాప్రతినిధులు స్థలాలు, భవన నిర్మాణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పనులు సాఫీగా సాగడానికి సహకరించకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ◆ నల్లగండ్లలో రోడ్డు పనులు అరకొరగా పూర్తి చేశారు. రోడ్డు విస్తరణ, విద్యుత్ స్తంభాల తరలింపు, కల్వర్టులు, వరద నీటి కాలువలు నిర్మాణాలు పూర్తిగా వదిలేశారు. ◆ గోపన్‌పల్లి, వట్టినాగులపల్లిలో నివాసితులకు పరిహారం, రోడ్డు విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తరలింపు అలాగే ఉన్నాయి. ◆ నల్లగండ్ల-తెల్లాపూర్ రోడ్డులో కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. వరద నీటి కాలువల నిర్మాణాలు పూర్తికాలేదు.

ట్రాఫిక్ నరకం

● ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, తెల్లాపూర్ మున్సిపాలిటీ, ప్రజాప్రతినిధులు, విద్యుత్తు తదితర శాఖల మధ్య సరైన సమన్వయం లేక జనానికి నరకం చూపిస్తున్నారు. నల్లగండ్ల దగ్గర ఏర్పాటు చేసిన చౌరస్తా రింగు చాలా పెద్దగా నిర్మించారు. దీని తగ్గట్టు ఇక్కడ రోడ్డు విస్తరణ చేయలేదు. ఉదయం, సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. భవన నిర్మాణదారులు రోడ్డుపైకి వచ్చి నిర్మాణాలు సాగిస్తున్నా చర్యలు శూన్యం.

● మరో ఏడాది వ్యవధిలో ఈ రోడ్లలో భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పూర్తయి వేలాది కుటుంబాలు నివాసం ఉండనున్నాయి. దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగనుంది. ఎమ్మెల్యే గాంధీ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వాస్తవ పరిస్థితులపై చర్చించి చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పేలా లేవు.

డిసెంబరు కల్లా పూర్తి: వెంకటేశ్వరరావు, ఈఈ, ఆర్‌అండ్‌బీ

"గోపన్‌పల్లి ప్రాంతంలో నివాసితులకు పరిహారం నిధులు ఇటీవల విడుదల అయ్యాయి. విస్తరణ, విద్యుత్ స్తంభాలు, వరద నీటి కాలువల నిర్మాణ పనులన్నీ డిసెంబరుకల్లా పూర్తిచేయాలనుకున్నాం. అన్ని సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తాం."

మాదాపూర్, రామచంద్రాపురం రూరల్, ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే:

? కొండాపూర్ జూబ్లీగార్డెన్ ప్రధాన రోడ్డులో ప్రైవేటు బస్సులతోపాటు ఆటోలు రోడ్డుపైనే నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చర్యలు తీసుకోగలరు.– **వేణుగోపాల్, జూబ్లీగార్డెన్ కొండాపూర్**

✓ క్షేత్రస్థాయి పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటాం.
– **సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్**

?అమీన్‌పూర్ పురపాలక పరిధి సుల్తాన్‌పూర్ ఔటర్ జంక్షన్ వంతెన కింద సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.–**సురేష్, పటాన్‌చెరు**

✓ ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం. సుల్తాన్‌పూర్ గ్రామం కొత్తగా మున్సిపాలిటీలో విలీనమైంది. ప్రత్యక్ష పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం.–**జ్యోతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, అమీన్‌పూర్**

? వివేకానందనగర్ డివిజన్ మాధవరం కాలనీ వసుధ రెసిడెన్సి లైన్‌లో విద్యుత్ దీపాలు పనిచేయడంలేదు.–**బాలకోటయ్య, మాధవరం కాలనీ**

✓ కాలనీకి వెళ్లి సమస్యను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.– **నరేష్, జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగం పర్యవేక్షకుడు, ఆల్విన్ కాలనీ**

పీహెచ్‌సీలో పారిశుద్ధ్య చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి ప్రాథమిక వైద్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'ఆసుపత్రి అధ్వానం.. సేవలు దయనీయం' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఆసుపత్రి పరిస్థితి గురించి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలు తరలించారు. పిచ్చి మొక్కలు తొలగించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌కు చెందిన సయ్యద్ అజర్‌అలీకి రూ.2.50లక్షల సీఎం సహాయనిధి చెక్కును మంగళవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ◆ గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి, అవంతిక హోమ్స్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు ఆయా కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ, వేణుగోపాల్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం ఇంటి చుట్టూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ట్రాఫిక్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సీఎం ఇంటి చుట్టూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌లు సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం.45లో పర్యటించారు. విశ్వప్రసాద్ సూచనల మేరకు మార్పులు చేర్పులు చేపట్టారు. మాదాపూర్ వైపు నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనదారులు గతంలో రోడ్ నం.45లో బ్రిడ్జి దిగి ముందుకు వెళ్లేవారు. బ్రిడ్జి దిగగానే రహదారి కొంత ఇరుకుగా ఉండటంతో వాహనాలు నిలిచిపోయేవి. కేబుల్ బ్రిడ్జి దిగి కింది రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు రోడ్ నం.45లోని హార్ట్ కప్ వద్ద ఎడమకు తిరిగి అటునుంచి రోడ్ నం.36 మీదకు వెళ్లేవారు. తాజాగా హార్ట్‌కప్ వద్ద ఎడమ దారిని మూసివేశారు. బ్రిడ్జి కింది నుంచి వచ్చే వాహనదారులు బ్రిడ్జి దిగగానే మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తిరిగి అక్కడి నుంచి సీఎం నివాస దారి మీదుగా రోడ్ నం.36లోని రంగోలి ప్రాంతానికి చేరుకోవచ్చు. సీఎం ఇంటి మీదుగా ఉన్న మార్గంలో నేరుగా ముందుకు వెళ్లి పెద్దమ్మగుడి మార్గంలోకి అక్కడినుంచి రోడ్ నం.36కు వెళ్లొచ్చు. మాగ్నోలియా బేకరీ వద్ద ఎడమకు తీసుకొని నేరుగా న్యూయార్క్ అకాడమీ మీదుగా రోడ్ నం.36లోని క్రోమాకు వెళ్లేలా దారిని తీర్చిదిద్దారు. ఆయా దారుల్లో వాహనదారులకు అర్థమయ్యేందుకు బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఇక కేబుల్ బ్రిడ్జి, రోడ్ నం.45 బ్రిడ్జి దిగే వారు బ్రిడ్జి దిగగానే తరువాత వచ్చే ఎడమకు తిరిగి సైతం రోడ్ నం.36కు చేరుకొనేలా ఏర్పాట్లు చేశారు. వాహనదారుల ఇబ్బందులను, ట్రాఫిక్ తీరుతెన్నులను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు.

అందెల రవళి.. నాట్యకేళి



భరతనాట్య ప్రదర్శన



ఒడిస్సీ నృత్యప్రదర్శన

శిల్పారామంలో మంగళవారం సాయంత్రం కళాకారులు చూడముచ్చటైన కళారూపాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మైథిలి కిదాంబి బృందం వీణ వాయిద్య కచేరీతో సంగీత ప్రియులను అలరించారు. బెంగళూరు నుంచి విచ్చేసిన భరతనాట్య గురువు హేమ శిష్యబృందం వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా నృత్యం చేసిన తీరు ఆకట్టుకుంది. వారు ప్రదర్శించిన గణేశా కృతి, నంది చోళం, దేవీస్తుతి అంశాలు నయనానందకరంగా సాగాయి. సుష్మిత మిశ్ర బృందం ఒడిస్సీ నృత్యంతో చూపరులను మంత్రముగ్ధుల్ని చేశారు. – **న్యూస్‌టుడే, మాదాపూర్**

రహదారికి పచ్చటి హారం





గోపన్‌పల్లిలో టీఎన్‌జీఓస్ కాలనీ రోడ్డు విభాగిని పచ్చదనంతో కళకళలాడుతోంది. మైహోం విహంగా, మైహోం క్రిష్ నుంచి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రోడ్డులో కలిసే కూడలి వరకు వంపులు తిరిగిన టీఎన్‌జీఓస్ కాలనీ ప్రధాన రహదారి విభాగినిలో పచ్చటి మొక్కలు పచ్చటి హారంలా అలరారుతున్నాయి. ఇటీవల వర్షాలకు గుబురుగా పెరిగి మరింత ఆకట్టుకుంటున్నాయి. – **న్యూస్‌టుడే, రాయదుర్గం**

మహాలక్ష్మి రూపం.. మురిసిన భక్త జనం



దత్తాత్రేయ కాలనీ సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు



మియాపూర్ మాతృశ్రీనగర్ టెంపుల్ పార్కులో..

ఆల్విన్‌కాలనీ, మియాపూర్, రాయదుర్గం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించారు. ఆలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 భ్రమరాంబ మల్లికార్జున ఆలయానికి వరూ.2 లక్షల విలువ చేసే 100కిలోల అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని సుష్మ రంజిత్ రెడ్డి దంపతులు అందజేశారు.



హాఫీజ్‌పేట అంబేడ్కర్‌నగర్‌లో పూజల్లో ఎమ్మెల్యే గాంధీ



ప్రజయ్ సిటీలో పూజలు ..



ఖాజాగూడ సాయి వైభవ్ కాలనీలో..



ఆల్విన్ కాలనీ ఫేజ్-2 భ్రమరాంబ మల్లికార్జున ఆలయానికి అందజేసిన పంచలోహ విగ్రహం



శ్రీనివాసకాలనీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కుంకుమార్చన

ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో విసుగుచెంది ఓ ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ భవానిపురం కాలనీకి చెందిన మధుసూదన్‌రావు(54) అరబిందో పరిశ్రమ యూనిట్ 5లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల రెండు కళ్లకూ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అయినా పాక్షిక అంధత్వంతో మనస్తాపం చెంది మంగళవారం భార్య కుమారి గుడికి వెళ్లిన తర్వాత ఫ్యానుకు ఉరేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

మద్యంమత్తులో కింద పడి కూలీ మృతి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి మద్యంతాగి రహదారిపై పడి తీవ్రగాయాలతో మృతిచెందాడు. పటాన్‌చెరు ఎస్సై అభిమాన్ సింగ్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సంజయ్ రూప్‌చంద్ మొహతే(50) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ కూలీపని చేసేవాడు. సోమవారం మద్యంతాగి రహదారిపై పడిపోయాడు. తలకు, నుదుటికి తీవ్రంగా గాయాలవడంతో పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు అంకుర్‌రూప్‌చంద్‌మొహతే ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

వివాహిత అదృశ్యం

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు ఠాణా పరిధిలో వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌నకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి భార్య(22) ఈనెల 7న భర్తకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మోడుబారుతున్న పచ్చని చెట్లు



చందానగర్ సర్కిల్ పరిధిలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఎదురుగా ఇజ్జత్‌నగర్ సమీపంలో డివైడర్ల మధ్య పచ్చగా ఆహ్లాదకరంగా ఉండాల్సిన చెట్లు ఒక్కొక్కటిగా మోడు బారుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేక కొన్నేళ్ల నాటి చెట్లు చనిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉన్న వాటినైనా కాపాడాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి**

నడిరోడ్డుపై మందుబాబుల వీరంగం

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై మంగళవారం సాయంత్రం మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ప్రధాన రోడ్డు పక్కనే వైన్‌షాప్‌లో మద్యం తాగిన పలువురు ఒక్కసారిగా ఘర్షణకు దిగారు. ఒకరినొకరు తోసుకుంటూ రోడ్డు మీదకొచ్చి రాళ్లు విసురుకోవడంతో అటుగా వెళ్తున్న వాహనాదారులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడులకు పాల్పడినవారి వివరాలు సేకరించారు. పోలీసుల రాకను పసిగట్టి కొందరు పారిపోయారు. వైన్‌షాప్ ఎదుట మందుబాబుల ఆగడాలకు అంతులేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. చీకటి పడితే చాలు కొందరు వైన్‌షాప్ పక్కనే ఉన్న బొటానికల్‌గార్డెన్ ప్రహరీ వద్ద తిష్ఠ వేసి బహిరంగ ప్రదేశంలో దర్జాగా మద్యం తాగుతున్నారు. వైన్‌షాప్ ఎదుట బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి రభస చేస్తున్నవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు



పటాన్‌చెరు మార్కెట్ నుంచి పట్టణానికి వచ్చే రహదారి అసలే ఇరుకు.. ఆపై వర్క్‌షాపుల ముందు ట్రాలీపై పెద్ద ఎక్విప్‌మెంట్ పెట్టి నిలుపుతున్నారు. మలుపు కూడా అక్కడే ఉండటంతో వేగంగా ఎవరైనా వచ్చినా ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని వాహనదారులు వాపోతున్నారు.

–**న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్**

మరిన్ని ఆవిష్కరణలు తీసుకురావాలి



వెబ్‌సైట్ ప్రారంభించిన గీతం స్కూల్ ఆఫ్ డైరెక్టర్ రామశాస్త్రి తదితరులు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: గీతం విద్యార్థి క్లబ్బుల్లో ఎంతో ప్రభావశీలంగా నడుస్తున్న జీ-ఎలక్ట్రా క్లబ్, మరిన్ని ఆవిష్కరణలు చేసి మరింత ఉజ్వలంగా ప్రభవించాలని గీతం స్కూల్ ఆఫ్ డైరెక్టర్ రామశాస్త్రి అభిలషించారు. రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలోని జీ-ఎలక్ట్రా క్లబ్ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సాంకేతిక ఆవిష్కరణలపై మక్కువ పెంచడం, గాడ్జెటర్ల ఆటోమేషన్‌లో పురోగతిని అన్వేషించడంతోపాటు కొత్త సాంకేతికతలను స్వీకరించడం లక్ష్యంగా ఈ క్లబ్ ఏర్పాటుచేశారు. జీ-ఎలక్ట్రా కొత్త వెబ్‌సైటును స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి మాధవిలతో కలిసి శాస్త్రి ఆవిష్కరించారు. జీ-ఎలక్ట్రా అధ్యక్షులు దీపక్, అధ్యాపక సమన్వయకర్తలు నరేష్‌కుమార్, అనిత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలకు వినతి

మాదాపూర్: చందానగర్ ప్రధాన రోడ్డులో చేపట్టిన అక్రమ నిర్మాణంలో కొనసాగుతున్న ప్రైవేటు ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని జనం కోసం సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. రద్దీ రోడ్డు పక్కనే ఆసుపత్రి భవనం కారణంగా ట్రాఫిక్ సమస్యతో స్థానికులు ఇబ్బందిపడుతున్నట్లు వివరించారు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన భవనంలో కొనసాగుతున్న ఆసుపత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనాలను రోడ్డు మీద పార్క్ చేస్తున్నారని తెలిపారు.

వరద సాయానికి వెళ్తే ఆరోపణలా?: కాంగ్రెస్

పటాన్‌చెరు అర్బన్: ముడుపులతో దిల్లీకి సీఎం వెళ్లారని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని గతంలో ఆయన వెళ్లినప్పుడు ఇలాగే తీసుకెళ్లారా? అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం పటాన్‌చెరులో ఆయనమాట్లాడుతూ.. రాష్ట్రంలో వరదల మూలంగా రూ.11వేల కోట్ల నష్టం జరిగిందని ప్రజలను ఆదుకునేందుకు సహాయార్థం వినతిపత్రం ఇవ్వడానికి సీఎం వెళ్లారన్నారు. గతంలో కేసీఆర్ దిల్లీ వెళ్లారని అప్పుడు ముడుపులు తీసుకువెళ్లారా? లేదా తిన్నారా? చెప్పాలన్నారు.


హనుమాన్ ఆలయం వద్ద నేతల ప్రదర్శన

భాజపా సంబరాలు

నిజాంపేట, న్యూస్‌టుడే: హరియాణా ఎన్నికల ఫలితాల్లో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా నిజాంపేట బస్టాండు చౌరస్తాలో ఆ పార్టీ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. హనుమాన్ ఆలయం ఎదుట బాణాసంచా కాల్చారు. పరస్పరం మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పార్టీ నగర శాఖ అధ్యక్షుడు మర్రి బిక్షపతియాదవ్, డా.రాజు, శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్

అలరించిన కూచిపూడి నృత్యాభినయం



ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం అడపా భరణి శిష్య బృందం కూచిపూడి నృత్యం అలరించింది. కళాకారులు అక్షర, అఖిల, ప్రణవి, సర్వజ్ఞ, మనోజ్ఞ, వర్షిణి, కీర్తన, హాసిని, రోహిత, సుహాస, రామప్రియ, పలు అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: ఉదయం 10- 12 గంటల వరకు. మహదేవపురం, బాలయ్యబస్తీ, హిరిడీహిల్స్ కాలనీ, కైలాస్‌హిల్స్ కాలనీ. ఉదయం 11-12 గంటల వరకు చింతల్, చంద్రానగర్ ప్రాంతాలు. మధ్యాహ్నం 12- 3 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గానగర్, స్ఫూర్తినగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు.

పేట్‌బషీరాబాద్: ఉదయం 10-11.30 గంటల వరకు ఎన్సీఎల్ కాలనీ సౌత్, పేట్‌బషీరాబాద్, హైటెన్షన్ రోడ్డు, శ్రీని ఎవెన్యూ గేటు -1, 2, 3, పేట్‌బషీరాబాద్ సర్వీస్ రోడ్డు, గ్రీన్‌పార్కు కాలనీ, సర్వీస్ రోడ్డు పరిసర ప్రాంతాలు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం గాజులరామారంలోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే నియోజకవర్గంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. సోమవారం చింతల్, జగద్గిరిగుట్ట డివిజన్‌లో పనిచేస్తున్న 210 మంది కార్మికులు, మంగళవారం గాజులరామారం, సూరారం డివిజన్‌లలో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు 8 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఔషధాలు అందజేశారు. అంతకుముందు వైద్యులు పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మమత, గజేందర్ బాబు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నిలదొక్కుకొనేలోపే బదిలీలు..!

పారిశుద్ధ్య విభాగంలో వింత ధోరణి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య విభాగం గాడితప్పుతోంది. స్వచ్ఛ ఆటో టిప్పర్ల కేటాయింపు, కార్మికుల హాజరు నమోదు, నియమాకం వరకు అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. సంబంధిత విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన వైద్యాధికారులను తరచూ బదిలీ చేస్తుండటంతో అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఉన్నతాధికారులు వీటికి అడ్డుకట్ట వేయకపోవడంతో కొత్తగా వచ్చే ఏ వైద్యాధికారి కనీసం ఆరు నెలలు విధులు నిర్వర్తించని పరిస్థితి.


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం

అవగాహన పెంచుకునేలోపే..

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో గడిచిన ఆరేళ్లలోనే 11 మంది వైద్యాధికారులను బదిలీ చేశారు. వివిధ బస్తీలు, కాలనీల్లో వెలువడే వ్యర్థాలు, చెత్తా చెదారం, ఇంటికి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన పెంచుకునే లోపే అధికారులను అక్కడి నుంచి పంపేస్తున్నారు. దీంతో కొత్తగా వచ్చే ఏ ఒక్క వైద్యాధికారికి స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవడానికి సమయం పడుతుండటంతో ఆ విభాగంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారిని బదిలీ చేయడానికి అతనిపై వచ్చిన అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యలను కొలమానంగా తీసుకుంటుంటారు. కానీ ఎటువంటి ఆరోపణలకు ఆస్కారం లేకున్నా కొందరు వైద్యాధికారులకు స్థానచలనం కల్పించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆరేళ్లలో పనిచేసిన వైద్యాధికారుల వివరాలు

అధికారి పేరు	ఎన్నాళ్లు
మహిపాల్‌రెడ్డి	రెండేళ్లు
సంపత్‌కుమార్	8 నెలలు
బానుచందర్	ఏడాది
ప్రశాంతి	3 నెలలు ఇన్‌ఛార్జిగా
ప్రమీలా	2 నెలలు ఇన్‌ఛార్జిగా
ప్రశాంతి	3 నెలలు ఇన్‌ఛార్జిగా
రాంరెడ్డి	5 నెలలు
చంద్రశేఖర్‌రెడ్డి	3 నెలలు
రజనీకాంత్	3 నెలలు
మంజుల	4 నెలలు
భార్గవ్‌నారాయణ	10 నెలలు

ఒక్కో కార్మికుడి నుంచి రూ.500 వసూలు..

జంట సర్కిళ్లలో కొందరు పారిశుద్ధ్య సహాయ పర్యవేక్షకుల(ఎస్ఎఫ్ఏ) అక్రమ వసూళ్లకు అడ్డులేకుండా పోతోంది. హాజరు నమోదు పేరుతో ఒక్కో కార్మికుడి నుంచి నెలకు రూ.500 చొప్పున మొత్తం రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ట్రేడ్ లైసెన్స్‌లు పొందని వ్యాపారస్తులు, సంస్థల యజమానుల నుంచి కూడా నెల మామూళ్లు వసూలు చేసుకుంటూ లైసెన్స్‌ల ద్వారా జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు. పెద్ద మొత్తంలో గార్బేజీ వెలువడే వ్యాపార సముదాయాలు, కంపెనీలు, బార్లు, రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి అందినకాడికి దండుకుంటూ బస్తీలు, కాలనీల్లో పారిశుద్ధ్యానికి పాతర వేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

న్యూస్‌టుడే, దుండిగల్, నిజాంపేట, పేట్‌బషీరాబాద్

? మల్లంపేట కత్వ చెరువు వద్ద చెత్త పేరుకుపోయింది. – అంజనేయులు, స్థానికుడు

✓ చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. – సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

? సూరారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. – రాజశేఖర్, సూరారం

✓ వెంటనే సిబ్బందిని పంపించి వీధి దీపాలను పునరుద్ధరిస్తాం. –రఘుపతిరెడ్డి, డీఈ ఎలక్ట్రికల్ విభాగం గాజులరామారం సర్కిల్

? జీడిమెట్ల డివిజన్ రామిరెడ్డి నగర్‌లో రోడ్డుపై మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. – బత్తిని రామ్ కుమార్ గౌడ్, చింతల్

✓ సమస్య పరిష్కారానికి చర్య తీసుకుంటాం. – నరసింహ, ఉప కమిషనర్ కుత్బుల్లాపూర్ సర్కిల్

? ప్రగతినగర్‌లోని ఐక్యూసిటీ రోడ్డు నుంచి మిథిలానగర్ వాటర్ ట్యాంకుకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఎత్తుగా ఉన్న చోట రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. – వి.యోగేశ్వరి, ప్రగతినగర్

✓ ఆ రోడ్డులో ఎత్తుగడ్డ ఉండటంతో వరద ఉద్ధృతికి రోడ్డు కోతకు గురవుతోంది. పలుమార్లు మరమ్మతులు సైతం చేశాం. ఈ సారి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –సత్యనారాయణ, ఈఈ, నిజాంపేట

? కుత్బుల్లాపూర్ గ్రామంలోని ప్రధాన దారిలో రెండు చోట్ల పైపులైను లీకేజీల కోసం తవ్వి వదిలేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. – నక్కా ప్రకాశ్, కుత్బుల్లాపూర్

✓ లీకేజీలు గుర్తించి గుంతలను చదును చేస్తాం. – రవి. జలమండలి మేనేజరు


కొంపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్, మున్సిపల్ ఛైర్మన్ శ్రీశైలం యాదవ్


ఇందర్‌సింగ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


మహదేవపురంలో..


పేట్‌బషీరాబాద్ ఠాణా సమీపంలో..


నిజాంపేటలో రాజమాతంగీలా


బాచుపల్లి సాయి అనురాగ్‌కాలనీలో..

అమ్మదర్శనం.. పరవశించిన భక్తజనం


గాజులరామారం: కుంకుమార్చనలో భక్తులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దేవి శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన వారు పూజల్లో పాల్గొంటున్నారు. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. - **న్యూస్‌టుడే బృందం**


రంగారెడ్డినగర్‌లో ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ రాజ్‌కుమార్


చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లో ఎంపీ ఈటల రాజేందర్


దుండిగల్‌లోని ఆశ్రమంలో సచ్చిదానంద స్వామీజీ


దూలపల్లిలో ధనలక్ష్మి అవతారంలో..


మల్లంపేటలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి, వెంకటేశం

డిజిటల్ సర్వేను పరిశీలించిన ఉప కమిషనర్


అయోధ్యనగర్‌లో డీసీ నర్సింహ

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డివిజన్ గుర్తింపు కార్డు సర్వేను ప్రతి ఒక్క కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహ సూచించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సర్వేను ఆయన మంగళవారం సందర్శించి పరిస్థితిని సమీక్షించి మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. ప్రజలు కూడా సర్వేకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కోరారు.

కొలను శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నిజాంపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేటలోని ఆయన నివాసంతో పాటు కార్యాలయానికి అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆయన్ను పూలమాలతో సత్కరించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నేడు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా డీఎస్సీ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ 9న మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై ఉందని జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదిగిరి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మాదిగ ఉప కులాలవారంతా పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని నల్లజెండాలతో నిరసన తెలపాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మొట్టమొదటగా తెలంగాణలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి రెండు నెలలవుతోందన్నారు.

ఉపాధి పనుల పూర్తే లక్ష్యం: అదనపు కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్: ఉపాధి హామీ పథకంలో అన్ని రకాల పనులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పథకం అమలు- ప్రణాళికలు..చేపట్టాల్సిన పనులపై అవగాహన సదస్సు జరిగింది. కార్మికుల సమీకరణ, ఉద్యానపంటల సాగు రైతులను గుర్తించడం, నర్సరీల్లో మొక్కలు పెంపకంలో జాగ్రత్తలు, భూగర్భ జలాలను పెంపుపై చర్చించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు, డీపీవో వెంకయ్య, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

రహదారిలో మురుగు చేరి



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ ప్రధాన రహదారి రాజీవ్‌పార్కు సమీపంలోని నాలుగురోడ్ల కూడలిలో మురుగు మేటలు వేసింది. స్థానికంగా మ్యాన్‌హోల్ నుంచి బయటకు వచ్చిన మురుగు పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు వాపోయారు. ప్రధాన రహదారిపై నిత్యం వేలాదిమంది పాదచారులు, వాహనదారులు వెళ్లే దారిపక్కన ఇలా ఉంటే వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరుగెడుతున్న యువకుడిని స్థానికులు పట్టుకొని, దేహశుద్ధి చేసిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడ, జయప్రకాష్ నగర్‌లోని వసతి గృహంలో ఉంటున్న నాగసాయి లహరి ప్రైవేటు ఉద్యోగిని. మంగళవారం ఉదయం వసతిగృహం నుంచి సమీపంలోని కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుంది. తమిళనాడులోని ధర్మపురికి చెందిన నితిన్ యువతిని అనుసరించి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరుగెత్తడానికి ప్రయత్నించాడు. యువతి కేకలు వేస్తూ అతడి వెంట పరుగెత్తింది. అప్రమత్తమైన స్థానికులు నితిన్‌ను పట్టుకొని దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'నక్సలైట్లపై అమిత్‌షా ప్రకటన విడ్డూరం'

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో పెద్ద సంఖ్యలో నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై స్పందించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా 2026 నాటికి నక్సలైట్లు ఈ దేశంలో ఆఖరి ఊపిరి పీల్చుకుంటారని ప్రకటించటం ఆశ్చర్యంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. దీనికి సహకరించిన నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని చెప్పారని, నక్సల్ ప్రభావితం లేని ఇతర ప్రాంతాల్లో వెనుకబడిన వారికి కూడా సమానంగా నిధులు కేటాయిస్తామని చెప్పకపోవటం దుర్మార్గమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాజ సమగ్రాభివృద్ధి గురించి ఆలోచించకుండా కేవలం నక్సలైట్లు ఉన్న అడవి ప్రాంతంపై కేంద్రీకరించడం ఎందుకో అమిత్‌షానే చెప్పాలన్నారు. గిరిజనులకు చెందాల్సిన అటవీ సంపదను బడాబాబులకు అప్పగించాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. భూ కేంద్రీకరణ, ఆర్థిక కేంద్రీకరణ, ఆర్థిక అసమానతలు, దోపిడీ లాంటి సామాజిక రుగ్మతలను పరిష్కరించకుండా నక్సలైట్లను రూపుమాపుతామని ప్రకటించటం అర్థరహితమన్నారు.

రోడ్లపై నీరు.. రాకపోకలకు ఇబ్బందులు

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలికలో చిన్నపాటి వర్షం పడినా రోడ్లపైన నీరు నిలుస్తోంది. ముఖ్యంగా పల్లపు ప్రాంతంలో ఉన్న రోడ్లపైన రోజుల తరబడి నీళ్లు నిల్వ ఉంటున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మల్లంపేటలోని కేవీఆర్ లేఅవుట్, డ్రీమ్ వ్యాలీ కాలనీ, నర్సాపూర్-బాలానగర్ ప్రధాన రహదారిలో, గండిమైసమ్మ చౌరస్తా, డి.పోచంపల్లి ప్రధాన రహదారితో పాటు దుండిగల్‌లోని రోడ్డుపై నీరు చేరింది. అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రోడ్లపైన నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మల్లంపేట కేవీఆర్ లేఅవుట్‌లో..

వాహనాలు ఇలా.. నడిచేదెలా



పాదచారుల కోసం రూ.లక్షలు వెచ్చించి చింతల్ ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వం పాదబాటను నిర్మించింది. కానీ కొంతమంది వ్యాపారులు దాన్ని పార్కింగ్ అడ్డాగా మలుచుకుంటున్నారు. అటుగా వెళ్లే పాదచారులు రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. వాహనాలను నిలపకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, జీడిమెట్ల**

విద్యుత్తు రంగ ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన విద్యుత్తు ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్తు రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీలు గుప్పించారని, చివరకు ఆర్టిజన్‌లు అనే ముద్దు పేరుతో కార్మికుల జీవితాలను చీకట్లోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆర్టిజన్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ గిరి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్‌లు మాట్లాడారు. సదస్సులో ఏఐటీయూసీ కార్యదర్శులు నర్సింహ్మారావు, ప్రసాద్, ఆర్టిజన్ యూనియన్ నాయకులు ఉన్నారు. ఆర్టిజన్స్ సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలికలో వీధి కుక్కలు స్థానికులను హడలెత్తిస్తున్నాయి. చిన్నారులపై తరచూ దాడులు పాల్పడుతుండడంతో వారిని ఆడుకునేందుకు, పాఠశాలలకు ఒంటరిగా పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. వీధి కుక్కల బెడద లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మల్లంపేటలో వీధి కుక్కలు

ఆలస్యమవుతున్న ప్రక్రియ..

వీధి కుక్కలను నియంత్రించే క్రమంలో గత ఏడాది మార్చిలో బ్లూ క్రాస్ సొసైటీతో పురపాలిక ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా సొసైటీ సభ్యులు వీధి కుక్కలను పట్టుకొని జూబ్లీ హిల్స్‌లోని కేంద్రానికి తరలిస్తారు. అనంతరం వాటికి సంతానోత్పత్తి కలగకుండా ఆపరేషన్ చేయడంతో పాటు యాంటీ రేబీస్ టీకాలను వేసి వారం రోజులపాటు తమ పర్యవేక్షణలో ఉంచి తిరిగి ఎక్కడైతే పట్టుకున్నారో అక్కడే వాటిని వదిలేస్తారు. నగరంలోని పలు మున్సిపాలిటీలతో ఈ సొసైటీ సభ్యులు ఒప్పందం చేసుకున్నారు. దీంతో దుండిగల్ పురపాలికలో సభ్యులు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

సొసైటీ సభ్యులకు చెప్పి సమస్య పరిష్కరిస్తాం : సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

దుండిగల్ పురపాలికలోని బస్తీలు, కాలనీల్లో తరచూ వీధి కుక్కలను బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు పట్టుకెళ్లి యాంటీ రేబీస్, సంతానోత్పత్తి కలగకుండా ఆపరేషన్లు చేస్తున్నారు. స్థానికంగా కుక్కల బెడద అధికంగా ఉంటే తమ దృష్టికి తెస్తే సొసైటీ సభ్యులకు సమాచారం అందించి వాటిని పట్టిస్తాం.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- బౌరంపేటలో రెండు రోజుల క్రితం జశ్వంత్ అనే ఏడేళ్ల బాలుడిపై వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. బాలుడిని చికిత్స నిమిత్తం సూరారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.
- నాలుగు నెలల క్రితం పురపాలక కార్యాలయం వెనుక ప్రాంతం 10వ వార్డులో ఇంటి వద్ద ఉన్న మూడేళ్ల ఆరుషిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. తలపై గాయమవ్వడంతో చిన్నారికి తీవ్రంగా రక్తస్రావమైంది. ఆరు నెలల క్రితం దుండిగల్‌లో ఇంటి వద్ద ఆడుకుంటున్న నాలుగేళ్ల అనన్యపై రెండు వీధి కుక్కలు దాడి చేశాయి.